www.peoplesnews.in

పీపుల్స్ న్యూస్

హైదరాబాద్

ప్రజల గొంతుక...

దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 175 గురువారం, నవంబర్ 12, 2026 , పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad



ముస్లిం రిజర్వేషన్లపై
బీజేపీ ద్వంద్వ వైఖరి

- బీజేపీ నేతలకు సీఎం రేవంత్‌రెడ్డి సూటి సవాల్ - తెలంగాణలో రిజర్వేషన్ల రద్దు మాటలు చెబుతూ గుజరాత్‌లో ఎందుకు కొనసాగిస్తున్నారు?

- కమలంతో ప్రాంతీయ పార్టీలు రాజీ.. బీజేపీతో కాంగ్రెస్‌ది నిరంతర పోరాటం ఢిల్లీలో మోడీ గల్లీలోకి వెళ్లగానే గులాబీ కాస్తా కమలంగా మారుతోంది: సీఎం ఎద్దేవా



హైదరాబాద్,నవంబర్ 11 : తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లో అమల్లో ఉన్న ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామంటూ ప్రకటనలు చేస్తున్న బీజేపీ నేతలకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సూటి ప్రశ్న సంధించారు. బీజేపీకి నిజంగా ధైర్యం ఉంటే ఆ పార్టీ అధికారంలో ఉన్న గుజరాత్‌లో అమలవుతున్న ముస్లిం రిజర్వేషన్లను తొలగించాలని సవాల్ విసిరారు. తెలంగాణలో ముస్లిం రిజర్వేషన్లపై మాట్లాడుతున్న బీజేపీ నేతలు గుజరాత్ విషయంలో ఎందుకు మౌనంగా ఉంటున్నారని నిలదీశారు. మతోన్మాద బీజేపీతో కొన్ని ప్రాంతీయ పార్టీలు రాజీపడుతున్నాయని, కాంగ్రెస్ మాత్రం ఆ పార్టీతో నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.తెలంగాణ ఉర్దూ అకాడమీ, తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ (టీజీఎంఆర్ఈఐఎస్) సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ విద్యా దినోత్సవం, మైనారిటీల సంక్షేమ దినోత్సవ కార్యక్రమంలో సీఎం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశంలో మెజారిటీ, మైనారిటీ వర్గాల సంక్షేమం, భద్రత కాంగ్రెస్ ప్రభుత్వాలతోనే సాధ్యమని పేర్కొన్నారు.రాష్ట్రానికి పర్యాటకుల్లా వచ్చే బీజేపీ జాతీయ నాయకులు.. తెలంగాణలో తమ పార్టీ అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్లను తొలగిస్తామని ప్రజలను భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని రేవంత్‌రెడ్డి విమర్శించారు.

మిగతా2లో...

జాతీయ స్థాయిలో
మెరిసిన జీహెచ్ఎంసీ

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పురస్కారం స్వీకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్,నవంబర్ 11 : స్వచ్ఛ సర్వేక్షణ్ 202526 జాతీయ అవార్డుల ప్రదానోత్సవంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) జాతీయ పురస్కారాన్ని అందుకుంది. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం

మిగతా2లో...



విద్యారంగానికి
ప్రభుత్వ ప్రాధాన్యం

కాజీపేటలో రూ.10 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ విద్యార్థులకు సమాన విద్యావకాశాలు: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైడ్రా కమిషనర్‌కు
హైకోర్టు ఆదేశాలు

కోర్టు ధిక్కరణ కేసులో నవంబర్ 17న హాజరుకావాలని స్పష్టం.. రంగనాథ్‌తో పాటు శంషాబాద్ తహసీల్దార్‌ను తీసుకురావాలని డీజీపీకి ఆదేశం



హైదరాబాద్,నవంబర్ 11 : హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ధిక్కరణ కేసు విచారణకు వ్యక్తిగతంగా హాజరుకాకపోవడంపై తీవ్ర అనహనం వ్యక్తం చేసిన న్యాయస్థానం.. ఆయనను నవంబర్ 17న కోర్టు ముందు హాజరుపరచాలని రాష్ట్ర డీజీపీని ఆదేశించింది. రంగనాథ్‌తో పాటు శంషాబాద్ తహసీల్దార్ అమర్ లింగంను కూడా హాజరుపరచాలని స్పష్టం చేసింది.కోర్టు గతంలో సమన్లు జారీ చేసినప్పటికీ అధికారులు విచారణకు హాజరుకాకపోవడాన్ని హైకోర్టు తీవ్రంగా పరిగణించింది. మిగతా2లో...

రేపు ఏపీ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదల

- మూడు విడతల్లో ఎన్నికలు.. నవంబర్ 26, 29, డిసెంబర్ 2న పోలింగ్



రైతులను మోసం చేసిన
కాంగ్రెస్ ప్రభుత్వం

పంట పాలాలకు నీరు నిలిపేశారు.. ఇతర రాష్ట్రాలకు కరువు బృందాలు.. తెలంగాణకు మొండి చేయి చూపిన కేంద్రం

8 మంది ఎమ్మెల్యేలు, 8 మంది ఎంపీలు ఉండి ఏం లాభం?

ప్రధాని మోదీ ఇంటి ఎదుట బైఠాయించి ధర్నా చేయాలి: నిర్మల్ రైతు గర్జన సభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



నిర్మల్,నవంబర్ 11 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వల్లే కరువు కాటకాలు వచ్చాయని, అసమర్థ పాలనతో తెలంగాణ ప్రజల సంక్షేమం ఆగమవుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఇతర రాష్ట్రాలకు కరువు బృందాలను పంపి తెలంగాణకు పంపకుండా మొండిచేయి చూపిందని ఆరోపించారు. బుధవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్‌టీఆర్ స్టేడియంలో నిర్వహించిన రైతు గర్జన సభలో ఆయన ప్రసంగించారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, సంక్షేమ కార్యక్రమాలను నిలిపివేసిందని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పెండింగ్‌లో పెట్టారని, ఆరు నెలల్లో ఉద్యోగులకు పీఆర్సీ ఇస్తామని చెప్పి అమలు చేయలేదని కేటీఆర్ అన్నారు.

మిగతా2లో...

హైదరాబాద్‌కు
పూర్వ వైభవం

చెరువుల నగరంగా హైదరాబాద్ పాత గుర్తింపును పునరుద్ధరిస్తాం.. భవిష్యత్ తరాల కోసం జలవనరుల పరిరక్షణ: సీఎం రేవంత్‌రెడ్డి





సమ్మక్క బ్యారేజీకి కొత్త డీపీఆర్ రూపొందించాలి

ఆయకట్టు వివరాలు పూర్తిగా సేకరించాలని కేంద్ర జలసంఘం సూచన

అధికారులకు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశం

ఈ నెల 14న గిగ్
కార్మికుల భారీ ర్యాలీ

- **హైదరాబాద్‌లో శిల్పకళా వేదిక నుంచి హెచ్ఐసీసీ వరకు ప్రదర్శన.. పాల్గొననున్న రాహుల్‌గాంధీ**



ముస్లిం రిజర్వేషన్లపై బీజేపీ ద్వంద్వ వైఖరి

(మొదటి పేజీ తరువాయి)

అలాంటి ప్రకటనలు చేసే నేతలు ముందుగా గుజరాత్‌లో ముస్లింలకు అమలవుతున్న రిజర్వేషన్లపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పేదలకు ఓటు హక్కు కల్పించడాన్ని రాజ్యాంగ రచన సమయంలోనే కొందరు వ్యతిరేకించారని, అయితే కాంగ్రెస్ అందరికీ ఓటు హక్కు కల్పించిందని గుర్తుచేశారు. **బీఆర్ఎస్ మాట తప్పింది** తెలంగాణలో ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి రెండుసార్లు అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ఆ హామీని నెరవేర్చకుండా మోసం చేసిందని సీఎం విమర్శించారు. రాష్ట్రంలో బీజేపీకి వ్యతిరేకమని చెప్పుకునే బీఆర్ఎస్.. ఢిల్లీకి వెళ్లగానే బీజేపీతో సఖ్యతగా వ్యవహరిస్తోందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో గులాబీ పార్టీగా కనిపించే బీఆర్ఎస్.. ఢిల్లీలో మోడీ గల్లీలోకి వెళ్లగానే కమలంలా మారిపోతోందని వ్యాఖ్యానించారు. పాతబస్తీకి మెట్రో రైలు విస్తరణ విషయంలోనూ గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. **మైనారిటీ విద్యార్థుల ఉపకార వేతనాలు నిలిపివేత** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మైనారిటీ విద్యార్థులకు అందించే ఉపకార వేతనాలను నిలిపివేయడంపై రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పాతబస్తీ విద్యార్థులు, మైనారిటీ పిల్లలు ఏం పాపం చేశారని ప్రశ్నించారు. ఏ మతంలో పుట్టాలనేది ఎవరి చేతుల్లో ఉండదని, మతం ఆధారంగా వివక్ష చూపడం హేయమైన చర్య అని అన్నారు. దేశ జనాభాలో మైనారిటీలు సుమారు 15 శాతం ఉన్నారని, వారి అభివృద్ధిని విస్మరిస్తే దేశం సమగ్ర అభివృద్ధి సాధించలేదని పేర్కొన్నారు. మక్కాకు వెళ్లే యాత్రికులపై కేంద్రం అదనంగా రూ. 10 వేలు చెల్లించేలా ఆదేశాలు తీసుకొచ్చినప్పుడు పేద ముస్లింలపై భారం పడకుండా ఆ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించిందని తెలిపారు. అన్ని మతాల ప్రజలను కాంగ్రెస్ సమానంగా చూస్తుందని, మైనారిటీల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

మూడేళ్ల పాలనలో ఎవరికి న్యాయం చేశారో ప్రజలు గమనించాలని సూచించారు. బీడీ పరిశ్రమపై జీఎస్టీ విధించిన సమయంలో ఆ పరిశ్రమకు అండగా నిలిచిన నాయకుడు కేసీఆర్ అని గుర్తుచేశారు. నిర్మల్ జిల్లాలోనే 63 వేల మంది బీడీ కార్మికులకు పెన్షన్లు అందించినట్లు తెలిపారు. **రైతు హామీలను నెరవేర్చలేదు** రైతు డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, మూడేళ్లు గడిచినా వాటిని నెరవేర్చలేదని కేటీఆర్ విమర్శించారు. వరి పంటకు మద్దతు ధరతో పాటు రూ. 500 అదనపు బోనస్ ఇస్తామని చెప్పి ఏ ఒక్క పంటకూ ఇవ్వలేదన్నారు. మూడు విడతలుగా రైతుబంధు ఇవ్వకుండా రైతులను ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. రైతులకు సాగునీరు, విద్యుత్ నిలిపివేశారని, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందడం లేదని విమర్శించారు. యాసంగి పంటకు దుక్కి దున్నొద్దని, విత్తనం చల్లొద్దని చెబుతూ ప్రభుత్వం రైతులతో స్వీయ ప్రకటనలు రాయిస్తోందని అన్నారు. **కేంద్రంపై ఒత్తిడి తేవాలి** నిర్మల్ జిల్లాలో తొమ్మిది మండలాలను కరువు మండలాలుగా ఎలా ప్రకటించారని కేటీఆర్ ప్రశ్నించారు. గోదావరి నది ఒడ్డున, ఎస్ఆర్ఎస్పీ వంటి ప్రాజెక్టులు ఉన్న జిల్లాలో కరువు పరిస్థితులు రావడంపై ప్రభుత్వాన్ని నిలదీశారు. కడెం ప్రాజెక్టు కింద సాగునీరు నిలిపివేసి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ఒక్క పైసా కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. ఇతర రాష్ట్రాలకు కరువు బృందాలు వెళ్లి తెలంగాణకు రాకపోతే రాష్ట్రంలోని ఎనిమిది మంది బీజేపీ ఎమ్మెల్యేలు, ఎనిమిది మంది ఎంపీలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రానికి న్యాయం జరిగేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని, అవసరమైతే ప్రధాని మోదీ ఇంటి ఎదుట బైఠాయించి ధర్నా చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, నాయకులు జాన్సన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి ప్రభుత్వ ప్రాధాన్యం

వరంగల్, నవంబర్ 11 : తెలంగాణలో పుట్టిన ప్రతి బిడ్డకు నాణ్యమైన విద్య అందించి, ప్రపంచ స్థాయిలో పోటీపడేలా తీర్చిదిద్ద డమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో కాజీపేటలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో రూ. 10 కోట్ల వ్యయంతో నిర్మించనున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్ భవనానికి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. విద్య ద్వారానే సమాజ సమగ్ర అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాల విద్యార్థులందరికీ సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలకు అనుమతులు ఇచ్చామని, ఒక్కో పాఠశాలను 20 నుంచి 25 ఎకరాల్లో సుమారు రూ. 200 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ పాఠశాలల్లో ఒకటి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఆంగ్ల మాధ్యమంలో విద్య, ఆధునిక సదుపాయాలు, విద్యార్థులు, సిబ్బందికి వసతి కల్పిస్తామని వివరించారు. అన్ని సామాజిక వర్గాల పిల్లలు ఒకే ప్రాంగణంలో చదువుకోవడం ద్వారా సమానత్వం, సామాజిక సమైక్యత పెంపొందుతాయని చెప్పారు. ప్రతి శాసనసభ నియోజకవర్గంలో ఒక తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ప్రీ ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు విద్యతో పాటు డిజిటల్ బోధన, ఆధునిక తరగతి గదులు, శిక్షణ పొందిన ఉపాధ్యా యులు, రవాణా సదుపాయాలు కల్పిస్తామన్నారు. విద్యార్థులకు యూనిఫామ్‌లు, పుస్తకాలు, బ్యాగులు, బూట్లు ఉచితంగా అందిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని సుమారు 27 లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉదయం అల్పాహార పథకం అమలు చేస్తున్నామని భట్టి తెలిపారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కేంద్రీకృత వంటశాలల ద్వారా పౌష్టికాహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, కుడా చైర్మన్ గుండు సుధారాణి, కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, పోలీస్ కమిషనర్ శ్వేత తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు పూర్వ వైభవం

హైదరాబాద్,నవంబర్ 11 : హైదరాబాద్ నగరానికి చెరువుల నగరంగా ఉన్న పూర్వ వైభవాన్ని తిరిగి తీసుకురావడమే తన సంకల్పమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. నగరంలోని చెరువులను పునరుద్ధరించి భవిష్యత్ తరాలకు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మాదాపూర్‌లో పునరుద్ధరించిన తమ్మిడికుంట చెరువును బుధవారం ప్రారంభించనున్న సందర్భంగా ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. తమ్మిడికుంట చెరువును సుమారు 30 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. గతంలో ఆక్రమణలు, ఇతర కారణాలతో చెరువు విస్తీర్ణం తగ్గిపోయిందని, హైడ్రా ఆధ్వర్యంలో ఆక్రమణలను తొలగించి పూడికను తీసి పునరుద్ధరణ పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. చెరువు పరిసరాల్లో వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, పిల్లల ఆట స్థలం, పచ్చదనం వంటి సదుపాయాలను ఏర్పాటు చేశారు. **ఇప్పటికే మూడు చెరువుల పునరుద్ధరణ** హైదరాబాద్‌లో ఇప్పటికే నల్లచెరువు, బతుకమ్మకుంట, బం-రుక్నుద్దౌలా చెరువులను పునరుద్ధరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు సీఎం తెలిపారు. తమ్మిడికుంట నాలుగో చెరువుగా అందుబాటులోకి రానుంది. మరికొన్ని చెరువుల పనులు పూర్తయిన వెంటనే వాటిని కూడా ప్రజలకు అంకితం చేస్తామని చెప్పారు. నగరంలో గతంలో 1,372 చెరువులు ఉండగా, దాదాపు సగం చెరువులు కనుమరుగయ్యాయని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. చెరువుల ఆక్రమణల వల్ల వర్షాకాలంలో కాలనీలు, రహదారులు ముంపునకు గురవుతున్నాయని తెలిపారు. జలవనరులను కాపాడితేనే నగరాన్ని వరదల నుంచి రక్షించగలమని స్పష్టం చేశారు.

నాగార్జునకు సీఎం అభినందనలు

తమ్మిడికుంట అభివృద్ధికి సినీనటుడు అక్కినేని నాగార్జున స్వచ్ఛందంగా రెండు ఎకరాల భూమిని ప్రభుత్వానికి అప్పగించడంపై సీఎం అభినందనలు తెలిపారు. చెరువుల పరిరక్షణకు ప్రజలు, రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. మూసీ నది పునరుజ్జీవన పనులను కూడా త్వరలో ప్రారంభిస్తామని, ఈ ప్రాజెక్టు వల్ల ఎవరికీ నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దడంతోపాటు చెరువుల ఆధారంగా ఆర్థిక, పర్యాటక కార్యకలాపాలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

ఎరువుల రాయితీకి రూ.62,370 కోట్లు

- రబీ సీజన్ 202627కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం..

గత సీజన్‌తో పోలిస్తే 64 శాతం పెంపు

న్యూఢిల్లీ,నవంబర్ 11 : రబీ సీజన్ 202627కు సంబంధించి ఫాస్ఫేటిక్, పొటాషిక్ (పీ అండ్ కే) ఎరువులపై రూ. 62,370.02 కోట్ల రాయితీకి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన బుధవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. గత రబీ సీజన్‌లో ఈ రాయితీ కోసం రూ. 37,952.29 కోట్లు కేటాయించగా, ఈసారి అదనంగా రూ. 24,417.73 కోట్లు పెంచారు. అంటే గత ఏడాదితో పోలిస్తే సుమారు 64 శాతం పెంపు జరిగింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఎరువులు, ముడిసరుకుల ధరల్లో వచ్చిన మార్పుల నేపథ్యంలో రైతులకు అందుబాటు ధరల్లో ఎరువులు సరఫరా చేయాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రం వెల్లడించింది. డీఏపీ, ఎన్‌పీకేఎస్ తదితర రకాల ఎరువులకు ఈ రాయితీ వర్తించనుంది. 2026 అక్టోబర్ 1 నుంచి 2027 మార్చి 31 వరకు ఆమోదించిన రాయితీ ధరలు అమల్లో ఉంటాయి. **రైతులకు అందుబాటు ధరల్లో ఎరువులు** పోషక ఆధారిత రాయితీ పథకం (ఎన్‌బీఎస్) కింద ఫాస్ఫేటిక్, పొటాషిక్ ఎరువులపై ప్రభుత్వం రాయితీ అందిస్తోంది. ప్రస్తుతం డీఏపీతో సహా 28 రకాల పీ అండ్ కే ఎరువులను ఈ పథకం ద్వారా రైతులకు అందుబాటులో ఉంచుతున్నారు. ఎరువుల తయారీదారులు, దిగుమతిదారులకు ఆమోదించిన రేట్ల ప్రకారం రాయితీ చెల్లించనున్నారు. తద్వారా రైతులకు ఎరువుల సరఫరాలో అంతరాయం లేకుండా చూడటంతో పాటు ధరలను అందుబాటులో ఉంచాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. **డీఏపీ ధరపై ప్రత్యేక వెసులుబాటు** 50 కిలోల డీఏపీ బస్తా ధరను రూ. 1,350 వద్ద కొనసాగించే ప్రత్యేక ఏర్పాటును కూడా కేంద్రం కొనసాగించనుంది. అంతర్జాతీయంగా ఎరువుల ధరలు పెరిగినప్పటికీ రైతులపై అదనపు భారం పడకుండా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్రం తెలిపింది. రష్యాఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ సరఫరా వ్యవస్థపై ప్రభావం పడటంతో ఎరువుల ధరలు పెరిగాయి. ఈ నేపథ్యంలో రాయితీ పెంపు ద్వారా రైతులకు కొంత ఉపశమనం కల్పించాలని కేంద్రం నిర్ణయించింది.



రేపు ఏపీ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదల

అమరావతి,నవంబర్ 11 : ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధమైంది. ఎన్నికల షెడ్యూల్‌ను నవంబర్ 13న విడుదల చేయనున్నట్లు సమాచారం. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటలకు మీడియా సమావేశం నిర్వహించి ఎన్నికల వివరాలను వెల్లడించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించారు. తొలి విడతకు నవంబర్ 13న, రెండో విడతకు నవంబర్ 16న, మూడో విడతకు నవంబర్ 19న నోటిఫికేషన్లు జారీ చేయనున్నారు. ఆయా విడతల్లో నవంబర్ 26, నవంబర్ 29, డిసెంబర్ 2 తేదీల్లో పోలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పోలింగ్ రోజే ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన కూడా ఉండనుంది. **మూడు విడతల్లో ఎన్నికల ప్రక్రియ** తొలి విడతలో నామినేషన్ల స్వీకరణకు నవంబర్ 17 చివరి తేదీగా నిర్ణయించారు. రెండో విడతకు నవంబర్ 20, మూడో విడతకు నవంబర్ 23 వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియ పూర్తయిన తర్వాత అభ్యర్థుల తుది జాబితాలను ప్రకటిస్తారు. **13,219 పంచాయతీలకు ఎన్నికలు** రాష్ట్రంలో 13,219 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బంది, పోలింగ్ కేంద్రాలు, భద్రతా ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలతో గ్రామీణ ప్రాంతాల్లో రాజకీయ సందడి మొదలుకానుంది. సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాల కోసం ఆశావహులు సిద్ధమవుతున్నారు.

జాతీయ స్థాయిలో మెరిసిన జీహెచ్ఎంసీ

(మొదటి పేజీ తరువాయి)

ప్రభాకర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ అవార్డును స్వీకరించారు. **10,500 మార్కులతో మూల్యాంకనం** కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా నిర్వహించిన ఈ సర్వేలో పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త సేకరణ, ఘన వ్యర్థాల శుద్ధి, మురుగునీటి నిర్వహణ, ప్రజల భాగస్వామ్యం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. మొత్తం 10,500 మార్కులతో పది ప్రధాన విభాగాల్లో నగరాల పనితీరును అంచనా వేశారు. 2026 ఏప్రిల్, మే నెలల్లో హైదరాబాద్‌లో క్షేత్రస్థాయి పరిశీలనలు నిర్వహించి పారిశుద్ధ్య సదుపాయాలు, చెత్త నిర్వహణ, ఇంటింటి చెత్త సేకరణ, ప్రజాభిప్రాయాలను మూల్యాంకనం చేశారు. **గతంలోనూ జాతీయ గుర్తింపులు** స్వచ్ఛతలో జీహెచ్ఎంసీ గతంలోనూ పలు గుర్తింపులు సాధించింది. 2017లో ఓడీఎఫ్ హోదా, 2019లో ఓడీఎఫ్++ గుర్తింపు, 2021లో వాటర్ ప్లస్ ధ్రువీకరణ పొందింది. 2024 స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పది లక్షలకు పైగా జనాభా ఉన్న నగరాల విభాగంలో హైదరాబాద్ ఆరో ర్యాంకు సాధించింది. 2023లో ఐదు నక్షత్రాలు, 2024లో ఏడు నక్షత్రాల చెత్త రహిత నగర గుర్తింపులు లభించాయి. **ఇతర మున్సిపాలిటీలకు మార్గదర్శనం** స్వచ్ఛ షెహర్ జోడీ కార్యక్రమంలో భాగంగా మంథని, చేర్యాల మున్సిపాలిటీలకు జీహెచ్ఎంసీ మార్గదర్శక సంస్థగా వ్యవహరిస్తోంది. పారిశుద్ధ్య ప్రమాణాల మెరుగుదలకు శిక్షణ కార్యక్రమాలు, సామర్థ్య పెంపు శిబిరాలు నిర్వహిస్తోంది. ఈ జాతీయ గుర్తింపు నగర ప్రజలు, అధికారులు, పారిశుద్ధ్య కార్మికుల కృషికి దక్కిన గౌరవమని అధికారులు పేర్కొన్నారు.

హైడ్రా కమిషనర్‌కు హైకోర్టు ఆదేశాలు

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని రంగనాథ్, తహసీల్దార్ దాఖలు చేసిన పిటిషన్లను న్యాయస్థానం కొట్టివేసింది. తదుపరి విచారణకు వారిద్దరూ తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించింది. **భూమి కూల్చివేతపై కోర్టు ధిక్కరణ పిటిషన్** శంషాబాద్ ప్రాంతంలోని సుమారు తొమ్మిది ఎకరాల భూమికి సంబంధించిన వివాదంలో కోర్టు ఆదేశాలను ఉల్లంఘించి నిర్మాణాలను కూల్చివేశారంటూ మహమ్మద్ తాజాముల్లుద్దీన్ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా హైకోర్టు తాజా ఆదేశాలు జారీ చేసింది. నవంబర్ 17న జరిగే తదుపరి విచారణలో అధికారులు హాజరుకావాల్సి ఉంది.

ఈ నెల 14న గిగ్ కార్మికుల భారీ ర్యాలీ

హైదరాబాద్, నవంబర్ 11 : గిగ్ కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం ఈ నెల 14న హైదరాబాద్‌లో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి వెల్లడించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఈ ర్యాలీలో పాల్గొని కార్మికులతో సమావేశమవుతారని తెలిపారు. శిల్పకళా వేదిక నుంచి హెచ్‌ఐసీసీ వరకు ర్యాలీ కొనసాగుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో సుమారు ఆరు లక్షల మంది గిగ్ కార్మికులు వివిధ డిజిటల్ వేదికలు, బహుళజాతి సంస్థల్లో పనిచేస్తున్నారని మంత్రి తెలిపారు. ఆహార సరఫరా సిబ్బంది, క్యాబ్ డ్రైవర్లు, ఇతర సేవలందించే కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. వారికి ప్రమాద బీమా, సామాజిక భద్రత, కనీస సంక్షేమ సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. **కార్మికుల నమోదు కోసం ప్రత్యేక యాప్** గిగ్ కార్మికుల వివరాల నమోదు, వారి సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల అమలు కోసం ప్రత్యేక మొబైల్ యాప్‌ను తీసుకురానున్నట్లు మంత్రి వెల్లడించారు. తెలంగాణ ప్లాట్‌ఫామ్ ఆధారిత గిగ్ వర్కర్స్ సంక్షేమ చట్టం అమలుకు సంబంధించిన నిబంధనలను సిద్ధం చేశామని తెలిపారు. సంక్షేమ బోర్డు ఏర్పాటుకు కూడా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ ర్యాలీ రాజకీయాలకు అతీతంగా నిర్వహిస్తున్నామని, కార్మికులు తమ రాజకీయ అనుబంధాలతో సంబంధం లేకుండా పాల్గొనవచ్చని మంత్రి స్పష్టం చేశారు. యాప్‌లో నమోదు చేసుకున్న గిగ్ కార్మికులు ర్యాలీలో పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. కార్మికులకు తగిన గుర్తింపు, గౌరవం, భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

సమ్మక్క బ్యారేజీకి కొత్త డీపీఆర్ రూపొందించాలి

హైదరాబాద్, నవంబర్ 11 :

ములుగు జిల్లా తుపాకులగూడెం వద్ద నిర్మిస్తున్న సమ్మక్కసాగర్ బ్యారేజీకి కొత్తగా సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపొందించాలని కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) తెలంగాణ ప్రభుత్వానికి సూచించింది. గతంలో సమర్పించిన డీపీఆర్‌లో ఆయకట్టు వివరాలు పూర్తిస్థాయిలో లేవని అభ్యంతరం వ్యక్తం చేస్తూ, అవసరమైన మార్పులు చేసి మళ్లీ సమర్పించాలని తెలిపింది. ప్రాజెక్టు కింద సాగునీరు అందించే ప్రాంతాన్ని వందశాతం సర్వే చేసి వివరాలను ధ్రువీకరించాలని స్పష్టం చేసింది. ఇందుకోసం డ్రోన్లు, లైడార్, జీపీఎస్, జీఐఎస్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని సూచించింది. కాలువల నిర్మాణం, భూసేకరణ, నీటి పంపిణీ వ్యవస్థకు సంబంధించిన వివరాలను కూడా డీపీఆర్‌లో పొందుపర్చాలని పేర్కొంది. మరోవైపు, ప్రాజెక్టుకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్ఓసీ) రావాల్సి ఉంది. బ్యారేజీలో నీటి నిల్వతో తమ రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలు ముంపునకు గురయ్యే అవకాశాలపై ఛత్తీస్‌గఢ్ అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. ఈ సమస్య పరిష్కారానికి తెలంగాణ ప్రభుత్వం ఆ రాష్ట్రంతో చర్చలు జరుపుతోంది. సుమారు రూ. 9,257 కోట్ల వ్యయంతో చేపట్టిన సమ్మక్కసాగర్ బ్యారేజీ నిర్మాణ పనులు 95 శాతం పూర్తయ్యాయి. దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాలకు సాగునీరు అందించడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. కొత్త డీపీఆర్, ఇతర అనుమతులు పూర్తయిన తర్వాతే ప్రాజెక్టు తదుపరి ప్రక్రియ ముందుకు సాగనుంది.

రామంజపూర్ ఫీల్డ్ అసిస్టెంట్ గుండెపోటుతో మృతి









వెంకటాపూర్ రామప్ప నవంబర్ 11 (పీపుల్స్ న్యూస్)

వెంకటాపూర్ మండలంలోని రామానుజపురం ఫీల్డ్ అసిస్టెంట్ నిమ్మల నరసయ్య 58 గుండెపోటుతో మృతి చెందాడు. బుధవారం ఉదయం నరసయ్య ఉపాధి పనుల పని ప్రదేశానికి వెళ్లగా అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు . అక్కడ ఉన్న సర్పంచ్ అశోక్ కూలీలు వెంటనే సిపిఆర్ చేసి ములుగు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే నరసయ్య మృతి చెందాడు. నరసయ్యకు భార్య వనిత కుమారులు పృథ్వీరాజ్ దేవరాజ్ ఉన్నారు. విషయం తెలుసుకున్న మండల పరిషత్ అధికారులు ఎంపీడీవో మూడు రాజు, ఏపీవో మాలోతు రాజు చేరుకొని సమస్య తెలుసుకున్నారు. దహన సంస్కరణల కు మండల పరిషత్ కార్యాలయం నుండి 20 వేలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీఒ షాజిదా, మల్లంపల్లి ఏపీవో నారగాని సునీత,పంచాయతీ సెక్రటరీలు నాగరాజు, రజనీకర్, మహేందర్ , గీత, రేవతి, ఫీల్డ్ అసిస్టెంట్లు రామాచారి ,భాస్కర్, సారంగపాణి, నాగరాజు, సునీత ,రాధిక , మాజీ ఎంపీపీ ఆషాడపు దేవేందర్ ,మాజీ సర్పంచ్ తుమ్మేటి రాజిరెడ్డి గ్రామంలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

జవహర్ నగర్‌లో ప్రభుత్వ భూముల పట్టాలపై సమగ్ర విచారణ చేపట్టాలి

- నిరుపేద దళిత, గిరిజన కుటుంబాలకు భూములు పంపిణీ చేయాలి
- తెలంగాణ మాల పోరాట సమితి డిమాండ్



ములుగు జిల్లా ప్రతినిధి నవంబర్ 11 (పీపుల్స్ న్యూస్)

ములుగు జిల్లా జవహర్ నగర్ గ్రామ పరిధిలోని వివిధ సర్వే నంబర్లలో స్థానికేతరులుగా పేర్కొంటున్న పలువురు అగ్రకులాలకు చెందిన వ్యక్తులు, తమ కుటుంబ సభ్యుల పేర్లపై ఒక్కొక్కరికి ఐదు ఎకరాల చొప్పున వందల ఎకరాల ప్రభుత్వ భూములకు పట్టాలు పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా, గత 13 సంవత్సరాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలను కూడా అర్హతకు విరుద్ధంగా పొందుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.ఈ వ్యవహారంపై సంబంధిత రెవెన్యూ అధికారులు సమగ్ర విచారణ చేపట్టి, ప్రభుత్వ భూముల పట్టాల మంజూరు వెనుక ఉన్న వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలి. భూముల కేటాయింపులో నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే, చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోవాలి. అలాగే అనర్హులు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందుతున్నట్లు నిర్ధారణ అయితే వాటిపైనా విచారణ జరపాలి.జవహర్ నగర్ గ్రామంలో ఎన్నో సంవత్సరాలుగా నివాసం ఉంటూ, సొంత భూమి లేకుండా జీవిస్తున్న నిరుపేద దళిత, గిరిజన కుటుంబాలను ప్రభుత్వం గుర్తించి, నిబంధనల ప్రకారం స్వాధీనంలోకి వచ్చే అర్హమైన ప్రభుత్వ భూములను వారికి పంపిణీ చేయాలి. భూమి లేని పేదలకు భూమి అందించడం ద్వారా వారి కుటుంబాలకు జీవనోపాధి, ఆర్థిక భద్రత కల్పించాలి.ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి నిష్పక్షపాతంగా విచారణ జరిపి, అర్హులైన నిరుపేద కుటుంబాలకు న్యాయం చేయాలని తెలంగాణ మాల పోరాట సమితి తరఫున డిమాండ్ చేస్తున్నాము.

ముద్దమల్ల కరుణాకర్ తెలంగాణ మాల పోరాట సమితి ములుగు జిల్లా అధ్యక్షులు

ఎల్లారెడ్డిపల్లి ఉపాధి హామీలో రూ. లక్షల లూటీ-దొంగ మస్టర్ల గుట్టు రట్టు-ఎంపీడీఓ ఎంట్రీతో అధికారుల్లో వణుకు!

- కూలీల కడుపు కొట్టి జేబులు నింపుకుంటున్న అధికారులు-
- ఎంపీడీవోకు నిమ్మల వేణు బాంబులాంటి ఫిర్యాదు
- స్పేప్ ఫోటోలు, బ్యాంక్ ఖాతాలు తీస్తే దొంగలంతా బయటపడతారు-ఎంపీడీఓ విచారణకు డిమాండ్
- ఎల్లారెడ్డిపల్లి ఉపాధి హామీలో దోపిడీ దందా-అవినీతి అధికారులకు ముచ్చెమటలు!

మొగుళ్ళ పల్లి ప్రతినిధి నవంబర్ 11 (పీపుల్స్ న్యూస్)

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం ఎల్లారెడ్డిపల్లి గ్రామంలో కేంద్ర ప్రభుత్వ పథకం వి బి జి రామ్ జి (ఉపాధి హామీ)లో జరుగుతున్న భారీ దోపిడీ దందా వెలుగులోకి వచ్చింది. పేద కూలీల పేరుతో లక్షల రూపాయల ప్రభుత్వ నిధులు స్వాహా చేస్తున్న వ్యవహారంపై గ్రామస్తుడు నిమ్మల వేణు సంచలన ఫిర్యాదుతో మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) గోడిశాల సురేందర్ గౌడ్ ను ఆశ్రయించడంతో, అవినీతికి పాల్పడిన సంబంధిత అధికారుల వెన్నులో వణుకు పుట్టింది.

ఎండలో పని చేసేది కూలీలు-డబ్బు నొక్కేసేది దొంగ మస్టర్ ముఠా!

ఎల్లారెడ్డిపల్లిలో దారుణం జరుగుతోంది. అసలు పనికి రాని వారి పేర్లతో, ఇంట్లో కూర్చున్న వారి పేర్లతో దొంగ మస్టర్లు సృష్టిస్తున్నారు. హాజరు వేసి, ప్రభుత్వ ఖజానా నుండి డబ్బులు మాయం చేస్తున్నారు. చెమటోడ్చి పని చేసిన నిజమైన కూలీకి మాత్రం పూర్తి కూలీ ఇవ్వడం లేదు. కమీషన్ పేరుతో వారి కడుపు కొడుతున్నారు. ఇది పథకం కాదు, పేదల పేరుతో **జరుగుతున్న పక్కా దోపిడీ!**

తెర వెనుక ఫీల్డ్ అసిస్టెంట్ హస్తం-కుమ్మక్కై నొక్కేస్తున్న వైనం!

ఈ మొత్తం దందా వెనుక ఫీల్డ్ అసిస్టెంట్ హస్తం ఉందని, అతనికి అనుకూలంగా ఉన్న కొందరు వ్యక్తులతో కుమ్మక్కై ఈ అక్రమాలకు పాల్పడుతున్నారని నిమ్మల వేణు తన ఫిర్యాదులో స్పష్టంగా పేర్కొన్నారు. పై అధికారుల అండదండలు లేకుండా ఇంత ధైర్యంగా దొంగ మస్టర్లు వేయడం సాధ్యం కాదని, దీని వెనుక పెద్ద నెట్ వర్క్ ఉందని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఎంపీడీఓ సురేందర్ గౌడ్ రంగంలోకి దిగితే-మస్టర్ రోల్స్, స్పేప్ ఫోటోలు, బ్యాంక్ లెక్కలు బయటకొస్తాయ్!


ఈ అక్రమాలకు చెక్ పెట్టేందుకు గ్రామస్తుడు నిమ్మల వేణు ఎంపీడీఓ గోడిశాల సురేందర్ గౌడ్ కు ఇచ్చిన ఫిర్యాదు ఇప్పుడు బ్రహ్మాస్త్రంగా మారింది. ఎంపీడీఓ స్వయంగా గ్రామంలోకి వచ్చి విచారణ చేస్తే చాలు. మస్టర్ రోల్స్ లో సంతకాలు ఎవరివి?, స్పేప్ ఫోటోల్లో ఉన్నది ఎవరు?, పనిచేసిన కూలీలేనా?, లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లోకి వెళ్లిన డబ్బు ఎటు పోయింది?, ఎవరు డ్రా చేశారు? అనేవీ ఈ మూడింటిని పరిశీలిస్తే చాలు, దొంగలంతా బయటపడతారని, అవినీతి బాగోతం మొత్తం బట్టబయలవుతుందని గ్రామస్తులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎంపీడీఓ గోడిశాల సురేందర్ గౌడ్ ఈ ఫిర్యాదును సీరియస్ గా తీసుకొని, నిష్పక్షపాత విచారణ జరిపి, దోషులైన ఫీల్డ్ అసిస్టెంట్ తో పాటు అవినీతికి పాల్పడిన ప్రతి ఒక్కరిపై కఠిన చర్యలు తీసుకొని, పేద కూలీలకు న్యాయం చేయాలని ఎల్లారెడ్డిపల్లి గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఫిర్యాదుపై తీసుకున్న చర్యను తమకు తెలియజేయాలని కోరారు.

బీసీ వీసీపై కుట్రలు చేస్తే సహించం: వేముల మహేందర్ గౌడ్ ఫైర్

- బీసీలను టార్గెట్ చేస్తే బుద్ధి చెబుతామని హెచ్చరిక
- జానయ్యకు మద్దతుగా భూపాలపల్లి బీసీలు
- కుట్రదారులను బయటపెట్టాలని డిమాండ్

భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, నవంబర్ 11 (పీపుల్స్ న్యూస్)

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి (వీసీ) గా తొలిసారిగా బీసీ బిడ్డ ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య నియమితులైతే, ఆయనపై కావాలనే కుట్రలు చేస్తున్నారని, ఇది బీసీ సమాజం సహించబోదని సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్ తీవ్రంగా హెచ్చరించారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.



"మహిళను అడ్డంపెట్టి బీసీలను దోషులుగా చిత్రీకరించాలని చూస్తున్నారు"

"మొట్టమొదటిసారిగా ఒక బీసీ వ్యక్తికి వీసీ అవకాశం వస్తే, కొంతమంది అగ్రకుల భావజాలం ఉన్న వ్యక్తులు జీర్ణించుకోలేకపోతున్నా రు. ఒక మహిళా ప్రొఫెసర్ ను పావుగా వాడుకుని, బీసీ వీసీపై లేనిపోని ఆరోపణలు చేస్తూ, యూనివర్సిటీలో రాజకీయం చేస్తున్నారు. నిజంగా మహిళను వేధిస్తే, వీసీ అయినా సరే శిక్షించాల్సిందే. కానీ పోలీస్ విచారణ జరుగుతుండగానే, రాజకీయ ప్రోద్బలంతో నిరసనలు చేయడం వెనుక పెద్ద కుట్ర ఉంది" అని ఆయన ఆరోపించారు."సీఎం జోక్యం చేసుకోవాలి""ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు వెంటనే జోక్యం చేసుకొని నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలి. ప్రభుత్వం విచారణ చేసి నిజాలు నిగ్గు తేల్చాలి. అసలు దోషులెవరో, కుట్రదారులు ఎవరో బయట పెట్టాలి. మహిళ పేరుతో యూనివర్సిటీని అడ్డాగా చేసుకొని రాజకీయం చేస్తే, భూపాలపల్లి జిల్లా నుండి మొదలుకొని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీలే బుద్ధి చెబుతారు" అని వేముల మహేందర్ గౌడ్ స్పష్టం చేశారు. బీసీ వీసీకి అండగా తామంతా ఉంటామని, బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే కుట్రలను తిప్పికొడతామని ఆయన తేల్చి చెప్పారు.

అంకుషాపురాన్ని గంగాదేవిపల్లిలా తీర్చిదిద్దుతున్న మహిళా సర్పంచ్-నీళ్ల ట్యాంక్ పైకెక్కి సాహసం!

- సర్పంచ్ క్యాతరాజు కవిత-లింగమూర్తి దంపతుల సేవలు అభినందనీయం
- మహిళ అయినా తగ్గేదేలే..ట్యాంక్ పైకెక్కి శుభ్రం చేయించిన వైనం వైరల్
- పారిశుధ్యం, సీసీ రోడ్లు, వీధి దీపాలు, హరితహారం, డంపింగ్ యార్డు, సీసీ కెమెరాలతో గ్రామానికి నయా కళ
- ఇందిరమ్మ ఇండ్లు, కష్టసుఖాల్లో అండగా సర్పంచ్ దంపతులు

భూపాలపల్లి ప్రతినిధి నవంబర్ 11 (పీపుల్స్ న్యూస్)

సాధారణంగా సర్పంచ్ అనగానే కుర్చీలో కూర్చుని పనులు చేయించే నాయకులను చూస్తాం. కానీ అంకుషాపురం గ్రామ సర్పంచ్ క్యాతరాజుకవిత-లింగమూర్తిదంపతులుమాత్రంఅందుకు భిన్నం.

నీళ్ల ట్యాంక్ పైకెక్కి సాహసం!

స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో, మహిళ అనే సంకోచం లేకుండా స్వయంగా నీళ్ల ట్యాంకు పైకి ఎక్కి శుభ్రం చేయించారు. ఈ ఘటన మండలంలోనే హాట్ టాపిక్ గా మారింది.

గ్రామంలో చేస్తున్న అభివృద్ధి పనులు-గంగాదేవిపల్లి తరహాలో పారిశుధ్యంలో నంబర్ వన్

ప్రతిరోజూ చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలింపు.. మౌలిక వసతులైన సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీలు, వీధి దీపాల ఏర్పాటు..పచ్చదనం కోసం హరితహారం, నర్సరీ పెంపకం లాంటి కార్యక్రమాలను చేపట్టి గ్రామాన్ని పచ్చదనంతో ఉట్టిపడేలా సుందరీకరణ చేస్తున్నారు.



శాంతి భద్రతల కోసం సీసీ కెమెరాలు:

గ్రామంలో నేరాలు, దొంగతనాలు జరగకుండా, గ్రామ భద్రత కోసం కీలక ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. దీంతో గ్రామంలో ఎవరు వస్తున్నారు, పోతున్నారనేది పంచాయతీ పర్యవేక్షణలో ఉంది. ఈ నిర్ణయాన్ని మహిళలు ప్రత్యేకంగా అభినందిస్తున్నారు. గ్రామంలో మరుగుదొడ్ల నిర్మాణం సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా గ్రామసభలు నిర్వహించి చర్యలు తీసుకుంటున్నారు.ప్రజల కష్టసుఖాల్లో అండగాఅర్హులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు, శుభ, అశుభ కార్యక్రమాలకు హాజరు, ఎవరైనా చనిపోతే వారి కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేయడం వంటి మానవతా కార్యక్రమాలు చేస్తున్నారు. మొత్తంగా అభివృద్ధి, సేవ, మానవత్వం, భద్రత కలగలిసిన సర్పంచ్ గా క్యాతరాజు కవిత-లింగమూర్తి దంపతుల సేవలను అధికారులు, మండల ప్రజలు, గ్రామస్తులు కొనియాడుతున్నారు.

చిన్నారి ఆలివ్ జన్మదిన వేడుకల్లో సేవా కార్యక్రమాలు

పేదలకు అన్నదానం.. విద్యార్థులకు పుస్తకాలు, కలాలు పంపిణీ



బాలానగర్ నవంబర్ 12 (పీపుల్స్ న్యూస్)

కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ఫతేనగర్ డివిజన్ పరిధిలో సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే చందు తన కుమార్తె ఆలివ్ రెండవ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదర్శప్రాయమైన సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జన్మదిన వేడుకలను కేవలం కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల మధ్య జరుపుకోవడమే కాకుండా, సమాజంలోని పేదలు, నిరుపేదలు, వృద్ధులు, దివ్యాంగులకు అండగా నిలుస్తూ మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాలు, కలాలు పంపిణీ చేసి వారి చదువుకు చేయూతనందించారు. అలాగే అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి పేదలకు భోజన పొట్లాలు, తాగునీటి సీసాలు పంపిణీ చేశారు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగుల వద్దకు వెళ్లి వారికి ఆహార పొట్లాలు, తాగునీరు అందించడం పలువురి ప్రశంసలు అందుకుంది.మానవసేవే మాధవసేవ అనే గొప్ప సందేశాన్ని ఆచరణలో చూపిస్తూ, పూజలు, ప్రార్థనలతో పాటు ఆపదలో ఉన్నవారికి చేసే సహాయమే నిజమైన సేవ అని చాటిచెప్పారు. చిన్నారి జన్మదినాన్ని పురస్కరించుకుని సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టడం అందరికీ ఆదర్శంగా నిలిచింది. ఈ సేవా కార్యక్రమాల్లో శివశంకర్ కాలనీ అధ్యక్షుడు దీపక్, సతీష్, వడ్ల అశోక్‌తో పాటు వివిధ కుటుంబ సభ్యులు, మిత్రబృందం పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. చిన్నారి ఆలివ్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని పలువురు ఆశీర్వదించారు.

పేదలకు ఇందిరమ్మఇండ్లు ఇవ్వడమే మా లక్ష్యం

కాంగ్రెస్ పార్టీ ఆదివాసి రాష్ట్ర కార్యదర్శి: వాలియా నాయక్



బిజినాపల్లి నవంబర్ 11 మండలంలో మండల పరిధిలోని షైన్ పల్లి గ్రామంలో నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కూచికుల రాజేష్ రెడ్డి అధ్వారంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇండ్లు గురించి కాంగ్రెస్ పార్టీ ఆదివాసి రాష్ట్ర కార్యదర్శి షైన్ పల్లిగ్రామంలో ఆరు ఇండ్లు మంజూరయ్యాయి ఆ ఇండ్ల స్థలాలకు ముగ్గులు వేయడం జరిగినది పేద మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కలలను నిజం చేస్తూ ప్రతి ఇంట్లో వెలుగులు నింపడమే ఇందిరమ్మ ప్రభుత్వం లక్ష్యమని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వాలియా నాయక్ కాంగ్రెస్ సీనియర్ నాయకు లు బూసి కురుమయ్యమదన్ శెట్టి దస్తగిరి పంచాయతీ కార్యదర్శి సర్పంచ్ వార్డు నెంబర్లు పాల్గొన్నారు.

చారిత్రక రామప్పపై ఉత్కంఠ వీడెనా?

పీవీఎన్ఆర్ ఓపెన్‌కాస్ట్‌పై ఎన్జీటీ విచారణ - సింగరేణి భరోసా





ములుగు, జిల్లా ప్రతినిధి నవంబర్ 11 (పీపుల్స్ న్యూస్)

ములుగు జిల్లా వెంకటాపూర్‌లో ప్రతిపాదించిన పీవీఎన్ఆర్ ఓపెన్‌కాస్ట్ గని ప్రాజెక్టు భవితవ్యంపై ఉత్కంఠ కొనసాగుతోంది. అభివృద్ధి, ఉపాధి అవసరాలకు, వేయి సంవత్సరాల చరిత్ర కలిగిన రామప్ప ఆలయ పరిరక్షణకు మధ్య నెలకొన్న ఈ వివాదం ఇప్పుడు జాతీయ స్థాయిలో చర్చకు దారితీసింది. కాకతీయుల కాలంలో నిర్మించిన రామప్ప ఆలయం యునెస్కో గుర్తింపు పొందిన ప్రపంచ వారసత్వ సంపద. దేశ విదేశాల నుంచి ప్రతి ఏటా లక్షలాది మంది పర్యాటకులు ఇక్కడికి తరలివస్తుంటారు. ఇలాంటి అపురూప కట్టడానికి సమీపంలో గని తవ్వకాలు చేపడితే బ్లాస్టింగ్ వల్ల కలిగే కంపనాలు, దుమ్ము, భూగర్భ జలాల క్షీణత ఆలయానికి తీవ్ర ముప్పుగా మారుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రామప్ప చెరువు, ఆలయ పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలమట్టం తగ్గిపోతుందని, వ్యవసాయం, తాగునీటిపై కూడా ప్రతికూల ప్రభావం పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చరిత్రను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, అభివృద్ధి పేరుతో వారసత్వాన్ని ధ్వంసం చేయవద్దని రామప్ప ఆలయ పరిరక్షణ కమిటీ డిమాండ్ చేస్తోంది.ఈ నేపథ్యంలో జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) ఈ అంశాన్ని సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టింది. పర్యావరణ నిబంధనలు, ఆలయానికి గని దూరం, తవ్వకాల వల్ల కలిగే ప్రభావాలపై ఎన్జీటీ ఆరా తీస్తోంది.అయితే రామప్ప ఆలయానికి ఎలాంటి ప్రమాదం లేదని సింగరేణి అధికారులు స్పష్టం చేశారు. అన్ని పర్యావరణ నిబంధనలను పాటిస్తూనే శాస్త్రీయ పద్ధతిలో గని తవ్వకాలు చేపడతామని, ఆలయ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని వారు హామీ ఇచ్చారు.

ఎన్జీటీ తుది నిర్ణయంతోనే రామప్పపై నెలకొన్న ఉత్కంఠ వీడుతుందని స్థానికులు ఎదురుచూస్తున్నారు. చరిత్రను కాపాడుతూనే అభివృద్ధి సాధ్యమవుతుందా అనేది ఇప్పుడు అందరి ముందున్న ప్రశ్న.

కిసాన్ సభ మహాసభలను జయప్రదం చేయండి: శ్రీనివాస్



నల్గొండ: నల్గొండలో ఈనెల 15 జరిగే అఖిల భారత రైతు సంఘం 36వ జాతీయ మహాసభలను బహిరంగ సభను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం శ్రీనివాస్ పిలుపునిచ్చారు బిజినపల్లి ప్రచార జాతకం ప్రారంభించి ఆయన మాట్లాడాలి కేంద్రం రైతు వ్యతిరేకంగా విధానాలతో కార్పొంటర్లకు వ్యవసాయం కట్టు బెడుతోందని విద్యుత్ ప్రవేటీకరణలతో రైతులు అప్పుల పాలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు రైతులందరికీ ఏకకాలంలో రుణమాఫీ చేయాలని తెలిపారు

అపరమేధావి డా. దివ్యమూర్తి అభిమానుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ విద్యా దినోత్సవ వేడుకలు



ఖమ్మం/ ముదిగొండ/నవంబర్ 11/ (పీపుల్స్ న్యూస్)

అపరమేధావి డా. దివ్యమూర్తి అభిమానుల సంఘం ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కేక్ కటింగ్ తో ఈ కార్యక్రమం చేయడం జరిగింది. అభిమానుల సంఘ రాష్ట్ర అధ్యక్షులు సైదారావు గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డాక్టర్ దివ్యమూర్తి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దివ్యమూర్తి మాట్లాడుతూ విద్య అనేది మనిషికి ఎవరూ దొంగిలించలేని సంపద అని, విద్యలేని జీవితం వెలుగులేని దీపం లాంటిదని, చదువు మనిషికి జ్ఞానాన్ని జ్ఞానం జీవితానికి మార్గాన్ని చూపిస్తుందని, విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని, విద్య అనేది మనిషి జీవితాన్ని మార్చే శక్తి అని, విద్య మనిషికి గౌరవాన్ని సమాజానికి అభివృద్ధిని ఇస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు సబ్ జైల్ ఏఎస్ఐ ఉదయ్ కుమార్, తలారి ప్రకాష్, ఎమ్మార్పీఎస్ నాయకులు సంపంగి వీరబాబు, నక్కా అజయ్ నేత, నరసింహారావు, వెంకట్రావు, అజీజ్, కత్తుల ఉపేందర్, యోబు, వీరాచారి, తోటమల్ల అచ్చయ్య, ఊటుకూరి సుధాకర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



స.హ.చ.ట్టం. కీలకం డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్





మెదక్ జిల్లా బ్యూరో, నవంబర్ 11

బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో ప్రభుత్వ పరిపాలనలో పారదర్శకతను పెంపొందించడానికి మరియు పౌరుల దరఖాస్తులను చట్టబద్ధంగా పరిష్కరించడానికి ఇన్‌స్టిట్యూట్ సమాచార హక్కు చట్టం 2005) జిల్లా స్థాయిలో ప్రత్యేక శిక్షణలను నిర్వహిస్తోందని డి ఆర్ ఓ అంబదాస్ రాజేశ్వర్ అన్నారు.ఈ సందర్భంగా డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్ మాట్లాడుతూచట్టం ప్రకారం 30 రోజుల్లో సమాచారం అందించాలని,పారదర్శకత, జవాబుదారీతనం పెంచడానికి చట్టం కీలకమని,పౌరులకు చట్టం విధానాలు, దరఖాస్తు ప్రక్రియ, సమాచారం పొందే హక్కులు గురించి వివరంగా తెలియజేశారు అని తెలిపారు.ఈ కార్యక్రమంలో శంకర్ .సెషన్‌లో పౌర సమాచార అధికారులు , సహాయ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పకడ్బందీగా భూ రీ సర్వే మెదక్ ఆర్డీవో రమాదేవి

మెదక్ జిల్లా బ్యూరో, నవంబర్ 11



పకడ్బందీగా భూ రీ సర్వే నిర్వహించాలని మెదక్ ఆర్డీవో రమాదేవి సర్వే అధికారులకు స్పష్టం చేశారు.బుధవారం మెదక్ మండలం కోమటూరు గ్రామంలో నిర్వహిస్తున్న భూ రీసర్వేను ఆర్డీవో క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.రీ సర్వేలో భాగంగా సరిహద్దులు , భూ వివాదాలు లేకుండా నిర్వహించి ,రీ సర్వే జరుగుతున్నపుడు రైతులకు సమాచారం తప్పకుండా ఉండాలని అధికారులు ఆమె సూచించారు.

చీకట్లో ప్రయాణం.. ప్రమాదాలకు ఆహ్వానం!

- బాలానగర్ డాక్టర్ బాబు జగ్జీవన్‌రావు ఫ్లైఓవర్‌పై వెలగని వీధి దీపాలు.. రాత్రివేళ వాహనదారుల అవస్థలు
- విద్యుత్ స్తంభాలున్నా వెలగని దీపాలు.. అధికారుల పర్యవేక్షణ ఏదీ?
- ప్రజాధనం వృథా అవుతున్నా పట్టించుకోని సంబంధిత అధికారులు



బాలానగర్ నవంబర్ 12 (పీపుల్స్ న్యూస్)

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ బాలానగర్ మండల పారిశ్రామిక ప్రాంతంలోని అత్యంత రద్దీగా ఉండే ప్రధాన మార్గాల్లో ఒకటైన డాక్టర్ బాబు జగ్జీవన్‌రావు ఫ్లైఓవర్‌పై రాత్రివేళ ప్రయాణం వాహనదారులకు ప్రాణసంకటంగా మారుతోంది. లక్షలాది రూపాయల ప్రజాధనంతో ఏర్పాటు చేసిన వీధి దీపాలు వెలగకపోవడంతో ఫ్లైఓవర్ మొత్తం చీకటిమయంగా మారుతోంది. రాత్రి వేళ ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు ఎదురుగా వచ్చే వాహనాల లైట్ల వెలుతురుపైనే ఆధారపడి రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ ఫ్లైఓవర్‌పై కనీస వెలుగులు లేకపోవడం సంబంధిత అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా కనిపిస్తోంది. ఫ్లైఓవర్ పొడవునా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసినప్పటికీ వాటిపై అమర్చిన వీధి దీపాలు వెలగకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, కార్లలో ప్రయాణించేవారు రహదారిపై గుంతలు, అడ్డంకులు, ఇతర వాహనాలను సరిగా గుర్తించలేక ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. ఎదురుగా వచ్చే వాహనాల కాంతి కళ్లపై పడటంతో రహదారి స్పష్టంగా కనిపించక ప్రమాదాలకు గురయ్యే ప్రమాదం ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళ విధులు ముగించుకుని ఇళ్లకు వెళ్లే కార్మికులు, ఉద్యోగులు ఈ సమస్యతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మరోవైపు, ఈ ఫ్లైఓవర్‌పై వీధి దీపాల నిర్వహణ, విద్యుత్ సరఫరా, మరమ్మతుల విషయంలో సంబంధిత విభాగాల మధ్య సమన్వయం కొరవడిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఒకవైపు ఇరవై నాలుగు గంటల విద్యుత్ సరఫరా అందుబాటులో ఉందని చెబుతున్నప్పటికీ, మరోవైపు ప్రజల భద్రత కోసం ఏర్పాటు చేసిన వీధి దీపాలు వెలగకపోవడం ఏమిటని ప్రజలు నిలదీస్తున్నారు. విద్యుత్ స్తంభాలు, దీపాల ఏర్పాటు కోసం వెచ్చించిన ప్రజాధనం ఆశించిన ప్రయోజనాన్ని అందించకపోవడమే కాకుండా, వాటి నిర్వహణపై పర్యవేక్షణ లేకపోవడం ప్రభుత్వ ఆదాయానికి, ప్రజాధనానికి నష్టం కలిగించే పరిస్థితులకు దారి తీస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీధి దీపాలు పని చేయకపోతే వాటిని గుర్తించి వెంటనే మరమ్మతులు చేయించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై లేదా నిర్వహణ సంస్థలపై లేదా? ప్రజల నుంచి పన్నుల రూపంలో వసూలు చేస్తున్న ఆదాయాన్ని ప్రజల భద్రతకు ఉపయోగించాల్సిన అధికారులు ఇంతటి కీలక సమస్యను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. ప్రమాదం జరిగే వరకు ఎదురుచూస్తారా? ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి డాక్టర్ బాబు జగ్జీవన్‌రావు ఫ్లైఓవర్‌పై క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలని, పనిచేయని వీధి దీపాలను గుర్తించి తక్షణమే మరమ్మతులు చేయించాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు. అవసరమైన చోట కొత్త విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయడంతో పాటు, ప్రతిరోజూ వాటి పనితీరును పర్యవేక్షించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల రాకపోకలకు ఎంతో కీలకమైన ఈ ఫ్లైఓవర్‌పై వెలుగులు నింపడం అధికారులకు పెద్ద పనేమీ కాదని, కానీ నిర్లక్ష్యం కొనసాగితే అమాయక వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ప్రమాదాలు జరిగిన తర్వాత హడావుడి చేయడం కంటే ముందుగానే చర్యలు తీసుకోవాలని, ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించడంలో అధికారులు తమ బాధ్యతను గుర్తించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. చీకట్లో ప్రయాణించే పరిస్థితికి స్వస్తి పలికి.. డాక్టర్ బాబు జగ్జీవన్‌రావు ఫ్లైఓవర్‌పై వీధి దీపాల వెలుగులు ఎప్పుడు విరజి మ్ముతాయో సంబంధిత అధికారులు సమాధానం చెప్పాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ నెల 29న ఘనంగా కార్తీకమాసి వనభోజనాలు

- పబ్లిక్ గార్డెన్స్‌లో ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహణ
- కేసీఆర్, కేటీఆర్ భూములను స్వాధీనం చేసుకుటాం
- డాక్టర్ పిడమర్తి రవి



బాలానగర్ నవంబర్ 12 (పీపుల్స్ న్యూస్)

కార్తీకమాసాన్ని పురస్కరించుకుని మాదిగ ఉపకులాల ఐక్యత, సామాజిక సమైక్యత, సాంస్కృతిక చైతన్యాన్ని చాటే లక్ష్యంతో ఈ నెల 29వ తేదీన హైదరాబాద్‌లోని పబ్లిక్ గార్డెన్స్‌లో ఘనంగా కార్తీకమాస వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ పిడమర్తి రవి, నేషనల్ దళిత సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు భూదాల బాబురావు వెల్లడించారు. బుధవారం బాలానగర్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ నవంబర్ 29న ఆదివారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, దామోదర రాజనర్సింహ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు వెల్లడించారు. అలాగే రాష్ట్ర శాసనసభ్యులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, మాదిగ ఉపకులాలకు చెందిన ప్రముఖులు, కవులు, కళాకారులు, విద్యార్థులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. కార్తీకమాస వనభోజనాలు కేవలం భోజనాలకే పరిమితం కాకుండా సామాజిక ఐక్యతకు, పరస్పర పరిచయాలకు, సంఘటిత శక్తిని చాటేందుకు వేదికగా నిలవనున్నాయని నిర్వాహకులు తెలిపారు. మాదిగ ఉపకులాల మధ్య ఐకమత్యాన్ని మరింత బలోపేతం చేస్తూ, విద్య, ఉద్యోగ, రాజకీయ, సామాజిక రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని వారు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా డాక్టర్ పిడమర్తి రవి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో దళితులకు జరిగిన అన్యాయాలు, భూముల అంశాలను ప్రస్తావిస్తూ కేసీఆర్, కేటీఆర్ భూములను గుంజుకుంటామని వ్యాఖ్యానించారు. దళితుల హక్కులు, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడుతామని స్పష్టం చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మాదిగ ఉపకులాలకు చెందిన అన్ని సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన, విద్యార్థి సంఘాల ప్రతినిధులు సమన్వయంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గడ్డ యాదయ్య, దళిత బహుజన సమితి రాష్ట్ర అధ్యక్షులు గజ్జల మల్లికార్జున్, బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు బోరెల్లి సురేష్, మాదిగ యూత్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు నక్క మహేష్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు జెర్రిపోతుల సాయన్న, దేవరకొండ నరేష్, విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు జోగు గణేష్, నక్క రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ సభ మహాసభలను విజయవంతం చేయాలి: బాలపీర్



కొల్లాపూర్: కొల్లాపూర్‌లో అఖిల భారత కిసాన్ సభ 36వ జాతీయ మహాసభల గోడపత్రికను తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బి. బాలపీర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన అన్ని పంటలకు స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం మద్దతు ధర కల్పించి, పార్లమెంటులో చట్టం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నవంబర్ 15 నుంచి18వరకునల్గొండలోజరిగే మహాసభలకు రైతులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.


మౌలానా ఆబుల్ కలాం జయంతి



కొల్లాపూర్: మౌలానా ఆబుల్ కలాం జయంతి సందర్భంగా కొల్లాపూర్ లోని 8వార్డులోని ఉర్దూ మీడియం స్కూల్ లోని విద్యార్థిని విద్యార్థులకు 8వార్డు ఎతీం ఇంచార్జ్ md.ఖలీం గారు స్వీట్స్ పంపిణీ చేయుట జరిగింది. ఈ కార్యక్రమంలో అక్బర్ గారు, నదీమ్ సార్ రిటైర్డ్ ఎతీశీ గారు co option md రుక్కు ఎతీం నాయకులు టీచర్స్ పాల్గొన్నారు.

బాచుపల్లి శివాలయంలో అయ్యప్ప స్వాములకు అన్నదాన బిక్ష ప్రారంభం

- మొదటి రోజు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన మాజీ కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్





కుత్బుల్లాపూర్ : నవంబర్ 11 (పీపుల్స్ న్యూస్)

అయ్యప్ప స్వాముల సేవే పరమావధిగా బాచుపల్లి శివాలయం ప్రాంగణంలోని అయ్యప్ప స్వామి సన్నిధానంలో అన్నదాన బిక్ష కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. మాజీ సర్పంచ్ ఆగం పాండు ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం మొదటి రోజు అయ్యప్ప స్వాములకు మధ్యాహ్న అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్ అన్నదాన బిక్ష కార్యక్రమాన్ని ప్రారంభించి, అయ్యప్ప స్వాములకు స్వయంగా భోజనం వడ్డించారు.అయ్యప్ప స్వాముల మండల దీక్షా కాలమంతా ప్రతిరోజూ మధ్యాహ్నం అన్నదాన బిక్ష అందించాలనే సంకల్పంతో ఆగం పాండు ముదిరాజ్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గత కొన్ని సంవత్సరాలుగా నిరంతరంగా ఈ సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తూ, అయ్యప్ప మాలధారణ చేసిన స్వాములకు సన్నిధానంలో ఆశ్రయం కల్పించడంతో పాటు వారికి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలు భక్తుల ప్రశంసలు అందుకుంటున్నాయి.

తండ్రి బాటలో తనయుడు..

తండ్రి అడుగుజాడల్లో తనయుడు అన్నట్లుగా ఆగం పాండు ముదిరాజ్ కుమారుడు ఆగం కిరణ్ కుమార్ ఈ ఏడాది తొలిసారిగా అయ్యప్ప మాలధారణ చేసి కన్యాస్వామిగా దీక్షను ప్రారంభించారు. కుటుంబ సభ్యులంతా భక్తి భావంతో అయ్యప్ప స్వాముల సేవలో భాగస్వాములు కావడం ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.అయ్యప్ప స్వాముల దీక్షా కాలం ముగిసే వరకు సన్నిధానంలో ప్రతిరోజూ అన్నదాన బిక్ష కార్యక్రమం కొనసాగనుంది. ఈ సేవా కార్యక్రమం పట్ల అయ్యప్ప స్వాములుహర్షం వ్యక్తం చేస్తూ నిర్వాహకులను అభినందించారు.

తెలంగాణలో తొలి స్వచ్ఛ నగరంగా గ్రేటర్ హైదరాబాద్‌కు జాతీయ గుర్తింపు



హైదరాబాద్, నవంబర్ 11, 2026: తెలంగాణకు గర్వకారణంగా, స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26లో తెలంగాణ రాష్ట్రంలో తొలి స్వచ్ఛ నగరంగా గ్రేటర్ హైదరాబాద్ జాతీయ స్థాయి గుర్తింపు పొందింది. కేంద్ర ప్రభుత్వ గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ మిషన్--అర్బన్‌లో భాగంగా నిర్వహించిన ఈ సర్వేలో గ్రేటర్ హైదరాబాద్ ఈ ప్రతిష్టాత్మక గుర్తింపును సాధించింది.నగరంలో పారిశుధ్య నిర్వహణ, పరిశుభ్రత ప్రమాణాలు, ఘన వ్యర్థాల నిర్వహణ తదితర అంశాల్లో చేపట్టిన కృషికి ఈ జాతీయ గుర్తింపు నిదర్శనంగా నిలిచింది.ఈ సందర్భంగా న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించిన జాతీయ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో తెలంగాణ తరఫున హైదరాబాద్ ఇన్‌ఛార్జ్ మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్, జీహెచ్ఎంసీ కమిషనర్ శ్రీ ఆర్వీ కర్ణన్, హెచ్ఎండీఏ కమిషనర్ శ్రీ సర్ఫరాజ్ అహ్మద్ పాల్గొని గౌరవ భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము గారి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.ఈ ఘనత సాధించడంలో కృషి చేసిన జీహెచ్ఎంసీ అధికారులు, పారిశుధ్య కార్మికులు, క్షేత్రస్థాయి సిబ్బంది మరియు నగర ప్రజలందరికీ ఈ గుర్తింపు అంకితం.తెలంగాణలో తొలి స్వచ్ఛ నగరంగా గ్రేటర్ హైదరాబాద్‌కు గుర్తింపు రావడం మనందరికీ గర్వకారణం!

క్రీడా మైదానంలో సత్తా చాటిన మహిళా కానిస్టేబుల్!

బాస్కెట్‌బాల్‌లో ప్రథమ స్థానం.. హ్యాండ్‌బాల్‌లోనూ విజయం.. వాలీబాల్‌లో కెప్టెన్‌గా జట్టుకు విజయాలు





హైదరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో నవంబర్ 11 (పీపుల్స్ న్యూస్)

విధి నిర్వహణలోనే కాదు.. క్రీడా మైదానంలోనూ తన ప్రతిభతో సత్తా చాటుతూ హైదరాబాద్ సిటీ పోలీస్ శాఖకు గర్వకారణంగా నిలుస్తున్నారు చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ మహిళా కానిస్టేబుల్ సుంకరి మేఘన. 2024--25 బ్యాచ్‌కు చెందిన ఆమె (బ్యాజ్ నం.31633) పలు క్రీడా పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి విజయాల పరంపర కొనసాగిస్తున్నారు.వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహించిన 5వ తెలంగాణ పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌లో బాస్కెట్‌బాల్ విభాగంలో ప్రథమ స్థానం సాధించారు. హ్యాండ్‌బాల్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి జట్టును ప్రథమ స్థానంలో నిలిపారు. అదేవిధంగా వాలీబాల్ జట్టుకు కెప్టెన్‌గా నాయకత్వం వహించి ద్వితీయ స్థానాన్ని సాధించారు.ఇంతటితో ఆమె విజయ ప్రస్థానం ఆగలేదు. 3వ, 4వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌లో హైదరాబాద్ కమిషనరేట్ వాలీబాల్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి వరుసగా ప్రథమ స్థానాలు సాధించారు. హర్యానాలో నిర్వహించిన ఆల్ ఇండియా పోలీస్ క్లస్టర్ గేమ్స్‌లో తెలంగాణ పోలీస్ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించారు.సీనియర్, జూనియర్, యూత్ నేషనల్ వాలీబాల్ ఛాంపియన్‌షిప్‌లలో పాల్గొనడంతో పాటు ఉస్మానియా విశ్వవిద్యాలయం తరఫున కూడా క్రీడా పోటీల్లో ప్రాతినిధ్యం వహించారు. రాష్ట్ర, జాతీయ, అంతర్ జిల్లాల, అంతర్ కళాశాల స్థాయి పోటీల్లో పలు పతకాలు సాధించారు. బెస్ట్ అటాకర్, ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ వంటి వ్యక్తిగత పురస్కారాలను సైతం అందుకున్నారు.

ఏసీపీ ప్రత్యేక అభినందనలు.

మలక్‌పేట డివిజన్ ఏసీపీ ఎల్. రాజా వెంకట్ రెడ్డి మహిళా కానిస్టేబుల్ సుంకరి మేఘన సాధించిన విజయాలను ప్రత్యేకంగా అభినందించారు. విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ అంకితభావం, క్రమశిక్షణ, పట్టుదలతో రాణించడం అభినందనీయమని ప్రశంసించారు. హైదరాబాద్ సిటీ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకొచ్చిన ఆమె భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

మహిళా పోలీసులకు స్ఫూర్తి.

పోలీస్ విధులు నిర్వహిస్తూనే క్రీడల్లో జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుతున్న సుంకరి మేఘన విజయాలు మహిళా పోలీస్ సిబ్బందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయి. ఆమె సాధించిన విజయాల పట్ల హైదరాబాద్ సిటీ పోలీస్ శాఖ హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపింది.

సంపాదనలో 10 శాతం పేదల సేవకు కేటాయించాలి

'అమ్మ' సేవా మార్గం సమాజానికి ఆదర్శం

'అమ్మ' నిస్వార్థ సేవ స్ఫూర్తిదాయకం.. పేదలకు అండగా నిలవడమే నిజమైన ఆత్మసంతృప్తి



సికింద్రాబాద్ :సికింద్రాబాద్‌లోని బ్రహ్మస్థాన ఆలయ 25వ వార్షికోత్సవంలో పాల్గొన్న మంత్రి వివేక్ వెంకటస్వామిమహిళలకు చీరలు, దివ్యాంగులకు వీల్‌చైర్ల పంపిణీహైదరాబాద్, నవంబరు 11: ప్రతి ఒక్కరూ తమ సంపాదనలో కనీసం 10 శాతాన్ని నిరుపేదల సంక్షేమానికి కేటాయించాలని శక్తి, గనుల శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. పేదలకు సేవ చేయడం ద్వారా నిజమైన మానసిక ప్రశాంతత, ఆత్మసంతృప్తి లభిస్తాయని తెలిపారు.భారత యాత్రలో భాగంగా శ్రీ మాతా అమృతానందమయీ దేవి (అమ్మ) బుధవారం హైదరాబాద్‌కు విచ్చేశారు. సికింద్రాబాద్‌లోని మహేంద్ర హిల్స్ బ్రహ్మస్థాన ఆలయ 25వ వార్షికోత్సవ రజతోత్సవ వేడుకల్లో 'అమ్మ' పాల్గొన్నారు. 'అమ్మ' భారత యాత్రలో భాగంగా ఇక్కడికి విచ్చేసి భక్తులకు తన అమృత సందేశాన్ని అందించి ఆశీస్సులు అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, దశాబ్దాలుగా 'అమ్మ' కొనసాగిస్తున్న నిస్వార్థ సేవా కార్యక్రమాలు సమాజానికి దిక్సూచిగా నిలుస్తున్నాయని కొనియాడారు. సమాజ సేవలో భాగస్వామ్యం కావడం ద్వారానే మనిషికి నిజమైన ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు. అనంతరం ఈ వేడుకల సందర్భంగా పేద మహిళలకు చీరలను మరియు దివ్యాంగులకు వీల్‌చైర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

125 ఏళ్ల క్రితం నాటి కాళీ మందిర్- విగ్రహ సమర్పణకు 2056 వరకు స్లాట్స్ ఫుల్!



బిహార్: బిహార్‌లోని కిషన్‌గంజ్ జిల్లాలోని బూఢీ కాళీ మందిరానికి ఉన్న ఘనమైన చరిత్ర అందరిని ఆశ్చర్యపరుస్తోంది. 125 ఏళ్ల నాటి ఈ గుడిలో అమ్మవారి విగ్రహం సమర్పించడానికి స్లాట్లు 2056 వరకు అడ్వాన్స్‌గా బుక్ అయిపోయాయి. సీమాంచల్ ప్రాంత ప్రజల అపారమైన భక్తికి, అచంచలమైన మత విశ్వాసాలకు ప్రధాన కేంద్రంగా ఈ దేవాలయం నిలుస్తోంది. అందుకే ఈ స్టోరీలో 125 ఏళ్ల చరిత్ర ఉన్న 'బూఢీ కాళీ మందిరం' గురించి తెలుసుకుందాం పదండి.విస్తరించిన ఆలయ సముదాస్థానిక చరిత్ర ప్రకారం, ఈ ఆలయాన్ని 1902లో నిర్మించారు. కాలక్రమేణా గుడి సముదాయాన్ని విస్తరించారు. ఈ క్రమంలో ఇక్కడ ఒక భారీ శివాలయాన్ని కూడా నిర్మించారు. బూఢీ కాళీ మందిరానికి ఉన్న ప్రత్యేకత ఏమిటంటే, ఆలయం స్థాపించినప్పటి నుంచి నేటివరకు తరతరాలుగా ఒకే పూజారి కుటుంబానికి చెందిన వంశస్థులే ఇక్కడ పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ ఆలయంలో శతాబ్దాల నాటి జంతు బలి సంప్రదాయం నేటికీ కొనసాగుతోంది. కాళీ పూజ రోజున భక్తుల కోరికలు నెరవేరడం కోసం పూజారులు సుమారు 50-60 మంది భక్తుల తరపున ఒక మేకను బలి ఇస్తారు.అందంగా ముస్తాబైన కాళీ మాత టెంపుల్ ప్రస్తుతం ఈ గుడికి ప్రధాన పూజారిగా మలయ్ ముఖర్జీ ఉన్నారు. లైన్ మొహల్లా ప్రాంతంలో ఉన్న ఈ దేవాలయాన్ని దీపావళి సందర్భంగా అత్యంత సుందరంగా అలంకరించారు. అక్కడి సంప్రదాయం ప్రకారం దీపావళి రోజు అర్ధరాత్రి వేళ భక్తుల సమక్షంలో అమ్మవారి విగ్రహాన్ని గుడిలో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.125 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ గుడిని సీమాంచల్ వాసులు అత్యంత పవిత్రమైన పుణ్యక్షేత్రంగా భావిస్తారు. అక్కడ కొలువైన కాళీ మాతను అపారమైన భక్తితో కొలుస్తారు. ఈ ఏడాదికి బూఢీ కాళీ మందిరాన్ని నిర్మించి 125 ఏళ్లు పూర్తయ్యాయి. దీంతో ఈ ఏడాది దీపావళి వేడుకలు, అమ్మవారికి పూజలు మరింత ఘనంగా చేశారు నిర్వాహకులు. కాగా, ఈ కాళీ ఆలయానికి ఉన్న విశేష ఆధ్యాత్మిక ప్రాధాన్యం గురించి తెలుసుకున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా 2022 సెప్టెంబర్ 24న ఈ గుడిని సందర్శించారు. కాళీ మాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి ఆశీస్సులు తీసుకున్నారు. అంతేకాకుండా పట్నా హైకోర్టు చీఫ్ జస్టిస్, బిహార్ గవర్నర్‌తో సహా పలువురు ప్రముఖులు వేర్వేరు సమయాల్లో ఈ కాళీ క్షేత్రానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు.తమ మొక్కులు (కోరికలు) తీరిన భక్తులు ఈ గుడికి అమ్మవారి విగ్రహాన్ని బహూకరిస్తుంటారని ఆలయ పూజారి మలయ్ ముఖర్జీ తెలిపారు. భక్తుల రద్దీ, అపారమైన నమ్మకం కారణంగా ఈ ఆలయంలో విగ్రహాలను సమర్పించడానికి కేటాయించిన స్లాట్లు 2056వ సంవత్సరం వరకు పూర్తిగా బుక్ అయిపోయాయని పేర్కొన్నారు. ఈ ఆలయానికి ఎంతోమంది ప్రముఖులు వచ్చి పూజలు చేస్తుంటారని వివరించారు. అలాగే భారత్ పొరుగు దేశమైన నేపాల్, బంగాల్ వంటి రాష్ట్రాల నుంచి కాళీ పూజ రోజున అమ్మవారిని ఆశీస్సులను పొందడానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తారని చెప్పారు."కాళీ పూజకు సరిగ్గా ఒక రోజు ముందు అంతకుముందు ఏడాది ప్రతిష్ఠించిన కాళీమాత విగ్రహాన్ని శాస్త్రోక్తంగా నిమజ్జనం చేస్తాం. ఈ ప్రక్రియ పూర్తైయిన తర్వాత ప్రతి ఏటా దీపావళి పర్వదినాన గుడిలో కాళీ మాత కొత్త విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తాం. అప్పటి నుంచే వేడుకలు మొదలవుతాయి. ఈ గుడి చాలా ఆధ్యాత్మిక శోభతో నిండి ఉంటుంది. కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో సహా అనేకమంది ప్రముఖులు ఇక్కడికి వచ్చి పూజలు చేశారు. తమ కోరికలను అమ్మవారు నెరవేరుస్తుందని భక్తులు నమ్ముతారు. తమ కోరికలు తీరినప్పుడు భక్తులు ఆలయానికి ఒక విగ్రహాన్ని సమర్పిస్తారు. ఇలాంటి విగ్రహ సమర్పణ స్లాట్లు 2056వ సంవత్సరం వరకు బుక్ అయిపోయాయి. ఆ తర్వాతే మళ్లీ కొత్త బుకింగ్‌లు సాధ్యమవుతాయి" అని పూజారి మలయ్ ముఖర్జీ పేర్కొన్నారు.

ఐఐటీ జోధ్‌పుర్ అద్భుత ఆవిష్కరణ- 1000 డిగ్రీల వేడిని తట్టుకునే మెటల్ తయారీ



భారత రక్షణ, అంతరిక్ష, విమానయాన రంగాలకు ఉపయోగపడే అద్భుతమైన సాంకేతికతను ఐఐటీ జోధ్‌పుర్ పరిశోధకులు ఆవిష్కరించారు. 1,000 డిగ్రీల సెల్సియస్ వరకు తీవ్రమైన వేడిని తట్టుకోగల అత్యంత తేలికైన, బలమైన లోహపు మిశ్రమాన్ని వారు తయారుచేశారు. మెటీరియల్స్ ఇంజనీరింగ్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సౌరభ్ నేనే నేతృత్వంలోని బృందం ఈ పరిశోధన చేసింది. ఈ వివరాలు ప్రముఖ అంతర్జాతీయ జర్నల్ మెటీరియల్స్ అండ్ డిసైన్‌లో ప్రచురితమయ్యాయి. ఈ పరిశోధనా బృందంలో డాక్టర్ ధర్మేంద్ర యాదవ్, డాక్టర్ అక్షత్ దత్తా, పీహెచ్‌డీ స్కాలర్ ఆదిత్య బాల్పాండే ఉన్నారు.అంతరిక్ష రాకెట్ ఇంజన్లు, హైపర్సోనిక్ వాహనాలు, యుద్ధ విమానాల్లో వాడే లోహాలు సాధారణంగా తీవ్రమైన వేడిని తట్టుకోవాల్సి ఉంటుంది. అయితే సంప్రదాయకంగా వాడే అధిక ఉష్ణోగ్రత లోహాలు చాలా బరువుగా ఉంటాయి. సాధారణ గది ఉష్ణోగ్రత వద్ద వాటిని కోరుకున్న ఆకారంలో మలచడం చాలా కష్టం. పైగా విపరీతమైన వేడి వద్ద గాలిలోని ఆక్సిజన్ కారణంగా వాటి ఉపరితలంపై ఆక్సీకరణం జరిగి లోహం త్వరగా క్షీణించిపోతుంది. ఈ సమస్యలన్నింటికీ పరిష్కారంగా ఐఐటీ జోధ్‌పుర్ పరిశోధకులు 'కాంప్లెక్స్ లీన్ అలాయ్ (సీఎల్ఏ)' డిజైన్ సాంకేతికతను ఉపయోగించిన లోహ మిశ్రమాన్ని తయారు చేశారు. ఇందులో భారీ, ఖరీదైన మూలకాల వినియోగాన్ని తగ్గిస్తూ వివిధ ధాతువులను సరైన నిష్పత్తిలో సమ్మేళనం చేశారు. ఈ నూతన లోహ మిశ్రమాన్ని 'నయోబియం ఆధారిత రిఫ్రాక్టరీ కాంప్లెక్స్ లీన్ అలాయ్ (ఆర్ సీఎల్ఏ)' గా చెప్తారుఈ కొత్త మిశ్రమం సాంద్రత కేవలం 7.6 గ్రాములు/క్యూబిక్ సెంటీమీటర్ ఉంటుంది. ప్రస్తుతం విస్తృతంగా వాడుకలో ఉన్న సీ-103, డబ్ల్యూసీ3009 వంటి నయోబియం ఆధారిత మిశ్రమాల సాంద్రత 9 నుంచి 12 గ్రాములు/క్యూబిక్ సెంటీమీటర్ వరకు ఉంటుంది. వాటితో పోలిస్తే కొత్త లోహం ఎంతో తేలికైనది. విమానయాన, రక్షణ రంగాల్లో లోహ బరువు తగ్గడం వల్ల ఇంధన ఆదా పెరగడమే కాకుండా, ఎక్కువ బరువున్న పేలోడ్‌ను సులువుగా తీసుకెళ్లేందుకు వీలవుతుంది.ఈ లోహాన్ని నిరంతరం 24 గంటల పాటు 1,000 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత వద్ద ఉంచి నాణ్యతా పరీక్షలు నిర్వహించారు. ఈ వ్యవధిలో ఆక్సీకరణం వల్ల లోహం బరువులో చదరపు సెంటీమీటర్‌కు కేవలం 43.48 మిల్లీగ్రాముల పెరుగుదల మాత్రమే కనిపించింది. సరిగ్గా ఇదే పరీక్షలో సాంప్రదాయ సీ-103 మిశ్రమంలో ఈ పెరుగుదల 258 మిల్లీగ్రాములుగా ఉంది. అంటే కొత్త మిశ్రమం ఆక్సీకరణను నిరోధించడంలో దాదాపు 6 రెట్లు మెరుగైన పనితీరు కనబరిచింది. తీవ్రమైన వేడి తగిలినప్పుడు లోహం ఉపరితలంపై ఒక పటిష్టమైన రక్షణ పొర ఏర్పడి ఆక్సిజన్ లోపలికి వెళ్లకుండా అడ్డుకుంటుందని డాక్టర్ సౌరభ్ నేనే తెలిపారు. మిశ్రమ లోహం తీవ్రమైన వేడిని తట్టుకోవడమే కాకుండా సాధారణ ఉష్ణోగ్రతల వద్ద కూడా బలమైన ఒత్తిడిని ఎదుర్కోగలదని పరిశోధకులు చెప్పారు. పీడనం వల్ల కలిగే ఆకార మార్పును సుమారు 29 శాతం వరకు ఇది తట్టుకోగలదు.

దూలపల్లిలో అక్రమ షెడ్ బాగోతం.. సర్కిల్--56లో టౌన్‌ప్లానింగ్ శాఖ బందీనా?

- నిర్మాణదారులదే రాజ్యం.. అధికారులు కేవలం సంతకాలకే పరిమితమా?
- భారీ షెడ్ నిర్మాణం సాగుతున్నా అడ్డుకునే నాథుడే లేడా?
- అక్రమ నిర్మాణానికి అనుమతుల ముసుగా? అధికారుల నిర్లక్ష్యానికి అంతులేదా?
- ముడుపుల ఆరోపణలపై విచారణకు ఉన్నతాధికారులు సిద్ధమా?
- నిర్మాణం పూర్తయ్యాక మేల్కొంటారా? అప్పటివరకు చోద్యం చూస్తారా?
- చట్టం ముందు బిల్డర్లు పెద్దలా? అధికారులే చిన్నబోతున్నారా?





కుత్బుల్లాపూర్ : నవంబర్ 11 (పీపుల్స్ న్యూస్)

కొంపల్లి సర్కిల్--56 పరిధిలోని దూలపల్లిలో భారీ షెడ్ నిర్మాణం వ్యవహారం ఇప్పుడు టౌన్‌ప్లానింగ్ శాఖ పనితీరుపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతోంది. భారీ స్థాయిలో షెడ్ నిర్మాణ పనులు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నా సంబంధిత అధికారుల స్పందన కనిపించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన అధికారులే మౌనంగా ఉంటే నిబంధనలను అమలు చేసేది ఎవరు?

షెడ్ నిర్మాణం కనిపించడం లేదా? లేక కనిపించినా కనిపించనట్లేనా?

దూలపల్లిలో భారీ షెడ్ నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో నిర్మాణ అనుమతులపై అధికారులు ఎందుకు స్పష్టత ఇవ్వడం లేదు? నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా? అనుమతులకు మించి పనులు జరుగుతున్నాయా? నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతున్నట్లు తేలితే ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదు? అధికారుల క్షేత్రస్థాయి పర్యవేక్షణ ఎక్కడ పోయింది?



అక్రమ నిర్మాణదారులకు అభయహస్తమా?

సాధారణ ప్రజలు చిన్న నిర్మాణం చేపట్టినా అనుమతులు, నిబంధనలు అంటూ ప్రశ్నించే అధికారులు.. భారీ షెడ్ నిర్మాణం విషయంలో ఎందుకు స్పందించడం లేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సామాన్యుల విషయంలో ఒక న్యాయం, భారీ నిర్మాణదారుల విషయంలో మరో న్యాయమా? అనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ముడుపుల మర్మంపై విచారణ ఎప్పుడు?

అధికారుల మౌనం వెనుక ముడుపుల వ్యవహారం ఏమైనా ఉందా? అన్న అనుమానాలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి ఎలాంటి ఆధారాలు బహిర్గతం కాలేదు. అందుకే ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెల్లడించాలి. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.


నవజాత శిశు సంరక్షణపై నిరంతర పర్యవేక్షణకు ఎఫ్‌బీఎన్‌సీ పోర్టల్

- 70 ఆరోగ్య కేంద్రాల సిబ్బందికి ప్రత్యేక శిక్షణ
- 210 మంది వైద్యులు, నర్సులు, సమాచార నమోదు సిబ్బందికి అవగాహన

మంగళగిరి। నవంబర్ 12, 2026

మంగళగిరి:..నవజాత శిశువులకు అందించే వైద్య సేవల నాణ్యతను పెంచడం, వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ ఎఫ్‌బీఎన్‌సీ (ఆసుపత్రి ఆధారిత నవజాత శిశు సంరక్షణ) పోర్టల్ వినియోగాన్ని మరింత బలోపేతం చేస్తోంది. ఇందులో భాగంగా జాతీయ ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో చినకాకాని హాయిలాండ్ హోటల్‌లో రెండు రోజుల పాటు పోర్టల్ వినియోగంపై ప్రత్యేక పునశ్చరణ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

నవజాత శిశువులకు అందిస్తున్న వైద్య సేవల వివరాలను పోర్టల్‌లో ఖచ్చితంగా, సకాలంలో నమోదు చేయడం, సమాచార నమోదు, విశ్లేషణ, పర్యవేక్షణలో వైద్య సిబ్బంది నైపుణ్యాలను పెంపొందించడం ఈ శిక్షణ ప్రధాన లక్ష్యం. బుధవారం నాటి శిక్షణ కార్యక్రమంలో రాష్ట్ర ప్రోగ్రామ్ మేనేజర్ (జాతీయ ఆరోగ్య మిషన్) డా. విజయలక్ష్మి కార్యక్రమంలో మాట్లాడుతూ.. నవజాత శిశు సంరక్షణ సేవల బలోపేతంలో ఎఫ్‌బీఎన్‌సీ పోర్టల్ ప్రాధాన్యాన్ని వివరించారు. జాయింట్ డైరెక్టర్ (శిశు ఆరోగ్యం) డా. సుబ్రహ్మణ్యం ముఖ్యోపన్యాసం చేస్తూ.. శిశువుల ఆరోగ్య వివరాలను సమగ్రంగా సేకరించడం, విశ్లేషించడం, వైద్య సేవలను పర్యవేక్షించడం ద్వారా సంరక్షణ నాణ్యతను మెరుగుపరచవచ్చని తెలిపారు. యునిసెఫ్ కన్సల్టెంట్ డా. విక్రమ్ రెడ్డి శిక్షణలో వనరుల నిపుణుడిగా పాల్గొని, పోర్టల్ వినియోగం, సమాచార నమోదు, సాంకేతిక అంశాలపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 70 ఆరోగ్య కేంద్రాలకు చెందిన 210 మంది వైద్యాధికారులు, స్టాఫ్ నర్సులు, సమాచార నమోదు సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ విభాగాలు (ఎస్ఎన్‌సీయూ), నవజాత శిశు స్థిరీకరణ విభాగాల్లో (ఎన్‌బీఎస్‌యూ) పనిచేస్తున్న సిబ్బందికి ఈ శిక్షణ అందించారు.



పోర్టల్ వినియోగంపై సమగ్ర అవగాహన

శిక్షణలో భాగంగా పోర్టల్‌లో ప్రవేశం, వినియోగదారుల నమోదు, ఆరోగ్య కేంద్రాల వివరాల నిర్వహణ, నవజాత శిశువుల ఆసుపత్రిలో చేరిక, డిశ్చార్జి వివరాల నమోదు, వైద్య సేవల సమాచార నమోదు, వివరాల ధ్రువీకరణ, నివేదికల తయారీ, డ్యాష్‌బోర్డు వినియోగం, పనితీరు పర్యవేక్షణ తదితర అంశాలను వివరించారు. సిబ్బందికి స్వయంగా పోర్టల్‌ను వినియోగించేలా ప్రాయోగిక శిక్షణ కూడా ఇచ్చారు.

సేవల నాణ్యత పెంపునకు దోహదం

నవజాత శిశువులకు అందించే వైద్య సేవల వివరాలను పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయడం ద్వారా ఎస్ఎన్‌సీయూ, ఎన్‌బీఎస్‌యూ విభాగాల పనితీరును నిరంతరం పర్యవేక్షించవచ్చని సుబ్రహ్మణ్యం తెలిపారు. సేవల్లో లోపాలను గుర్తించి, అవసరమైన నాణ్యతా మెరుగుదల చర్యలు చేపట్టేందుకు ఈ వ్యవస్థ ఉపయోగపడుతుందని వివరించారు. ఈ శిక్షణతో రాష్ట్రంలో నవజాత శిశు సంరక్షణ సేవల పర్యవేక్షణ వ్యవస్థ మరింత బలోపేతం కానుంది. సమాచార ఆధారిత నిర్ణయాలకు మార్గం సుగమం కావడంతో పాటు, వైద్య సేవల నాణ్యత పెంపు, నవజాత శిశు మరణాలు, అనారోగ్య సమస్యల తగ్గింపునకు దోహదపడుతుందని తెలిపారు

అక్రమ సెల్లార్లకు అధికారుల అభయహస్తమా?

ముడుపుల మత్తులో చర్యలు మరిచారా?

- బిల్డర్ల జేబులు నిండితే చాలు.. ప్రజల భద్రత గాలికేనా?
- కళ్ల ముందే అక్రమ నిర్మాణాలు.. అధికారుల కళ్లకు కాసుల గంతలా?
- సెల్లార్లలో అక్రమ దందా.. కార్యాలయాల్లో అధికారుల మౌనవ్రతం!
- దుండిగల్--59లో చట్టం బిల్డర్ల చుట్టమా? అధికారులది ప్రేక్షకపాత్రా?
- నిర్మాణదారుల కనుసైగే ఆదేశమా? టౌన్‌ప్లానింగ్ శాఖలో బాధ్యతలు బందీనా?
- అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్టేది ఎవరు? ముడుపుల ఆరోపణలపై విచారణ ఎప్పుడు?













కుత్బుల్లాపూర్, నవంబర్ 11 (పీపుల్స్ న్యూస్)

దుండిగల్ సర్కిల్--59 పరిధిలో టౌన్‌ప్లానింగ్ నిబంధనలు అమలవుతున్నాయా? లేక నిర్మాణదారుల కనుసైగలే అక్కడ శాసనాలుగా మారుతున్నాయా? అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన అధికారులు ఏం చేస్తున్నారు? కళ్ల ముందే సెల్లార్ల తవ్వకాలు, వాటితో కూడిన కమర్షియల్ భవనాల నిర్మాణాలు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు స్థానికంగా తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నా సంబంధిత అధికారులు ఎందుకు స్పందించడం లేదన్న ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన యంత్రాంగం మౌనంగా ఉండటానికి కారణమేంటి? బిల్డర్ల ఒత్తిడా? అధికారుల నిర్లక్ష్యమా? లేక ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించిన ఆరోపణల్లో ఏమైనా వాస్తవం ఉందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అక్రమ సెల్లార్ల దందా.. చోద్యం చూస్తున్న అధికారులా?

సర్కిల్--59 పరిధిలో సెల్లార్లతో కూడిన కమర్షియల్ భవన నిర్మాణాలు జరుగుతున్నాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో టౌన్ ప్లానింగ్ శాఖ పనితీరుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. భవన నిర్మా ణానికి మంజూరైన అనుమతులు ఏమిటి? ఆమోదిత ప్రణాళికలో సెల్లార్‌కు అనుమతి ఉందా? ఉంటే దాని వినియోగం పార్కింగ్‌కే పరిమితమా? లేక వాణిజ్య కార్యకలాపాల కోసం మార్పులు చేస్తున్నారా? అనుమతించిన అంతస్తులకే నిర్మాణం పరిమితమైందా? సెట్‌బ్యాక్‌లు, పార్కింగ్, భవన ఎత్తు, నిర్మాణ విస్తీర్ణం వంటి నిబంధనలు పాటిస్తున్నారా? ఈ ప్రశ్నలకు అధికారుల నుంచి స్పష్టమైన సమాధానం రావాల్సి ఉంది.

బిల్డర్లకు ఒక న్యాయం.. సామాన్యులకు మరో న్యాయమా?

సామాన్యులు చిన్నపాటి నిర్మాణాలు చేపట్టినా నిబంధనల పేరుతో నోటీసులు జారీ చేసే అధికారులు, భారీ కమర్షియల్ భవనాల నిర్మాణాల విషయంలో మాత్రం ఎందుకు నిశ్శబ్దంగా ఉంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చట్టం అందరికీ సమానంగా వర్తించాల్సి ఉండగా, పెద్ద నిర్మాణదారుల విషయంలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే భావన ప్రజల్లో ఏర్పడితే ప్రభుత్వ వ్యవస్థపై నమ్మకం దెబ్బతింటుంది. అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నట్లు తేలితే ఎంతటి వారైనా చట్టప్రకారం చర్యలు ఎదుర్కోవాల్సిందే. మరి సర్కిల్--59లో ఈ నిబంధనలు అమలవుతున్నాయా?

ముడుపుల ఆరోపణలు.. విచారణ జరిపించే దమ్ముందా?

నిర్మాణాలు బహిరంగంగా కొనసాగుతున్నప్పటికీ చర్యలు కనిపించకపోవడంపై స్థానికంగా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు నిర్మాణదారులకు అధికారులు అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు, భారీ మొత్తంలో ముడుపులు చేతులు మారాయేమోననే సందేహాలు చర్చకు వస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి నిర్ధారిత ఆధారాలు ప్రజల ముందుకు రాలేదు. అందుకే ఉన్నతాధికారులు స్వతంత్ర విచారణ చేపట్టి వాస్తవాలను బయటపెట్టాల్సిన అవసరం ఉంది. సంబంధిత నిర్మాణాల అనుమతి పత్రాలు, తనిఖీ నివేదికలు, ఫిర్యాదులు, జారీ చేసిన నోటీసులు, తదుపరి చర్యల వివరాలను బహిర్గతం చేస్తే అనేక సందేహాలకు సమాధానం లభించే అవకాశం ఉంది. ఆరోపణల్లో నిజం లేకపోతే అధికారులే రికార్డులతో స్పష్టత ఇవ్వాలి. నిజంగా అక్రమాలు జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.

సెక్షన్ ఆఫీసర్ నుంచి ఏసీపీ వరకు.. బాధ్యత ఎవరిది?

క్షేత్రస్థాయిలో నిర్మాణాలను పరిశీలించి ఉల్లంఘనలను గుర్తించాల్సిన సెక్షన్ ఆఫీసర్ బాధ్యత ఏమిటి? పర్యవేక్షణ చేయాల్సిన ఏసీపీ విధులు ఏమయ్యాయి? అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వచ్చినప్పుడు కేవలం కాగితాలపై నివేదికలు తయారు చేయడమే సరిపోతుందా? నిర్మాణ స్థలాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి, ఆమోదిత ప్లాన్‌తో ప్రస్తుత నిర్మాణాన్ని పోల్చి, ఉల్లంఘనలు ఉంటే పనులు నిలిపివేసే చర్యలు ఎందుకు కనిపించడం లేదు? నిర్మాణం పూర్తయ్యాక నోటీసులు ఇవ్వడం కంటే, ఉల్లంఘనలు జరుగుతున్నప్పుడే అడ్డుకోవడం అధికారుల బాధ్యత కాదా?

సెల్లార్ పార్కింగ్‌కా? వ్యాపార కార్యకలాపాలకా?

భవనాల్లో సెల్లార్ నిర్మాణానికి అనుమతి ఉన్నప్పటికీ దాని వినియోగం కూడా ఆమోదిత ప్రణాళిక, సంబంధిత నిబంధనలకు అనుగుణంగానే ఉండాలి. పార్కింగ్ కోసం కేటాయించిన స్థలాన్ని వాణిజ్య అవసరాలకు వినియోగిస్తే ప్రజలకు పార్కింగ్ సమస్యలు తలెత్తడమే కాకుండా భద్రతాపరమైన ఇబ్బందులు కూడా ఎదురయ్యే ప్రమాదం ఉంది. ముఖ్యంగా కమర్షియల్ భవనాల్లో అగ్నిమాపక భద్రత, అత్యవసర మార్గాలు, వాహనాల రాకపోకలు, పార్కింగ్ సౌకర్యాలపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. సెల్లార్ల వినియోగంపై సమగ్ర తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెల్లడించాలి.

నోటీసులకే పరిమితమా? క్షేత్రస్థాయిలో చర్యలు ఎప్పుడు?

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వచ్చినప్పుడు నోటీసులు జారీ చేశామని చెప్పడం మాత్రమే సరిపోదు. ఆ నోటీసుల తర్వాత నిర్మాణ పనులు నిలిచాయా? యజమానులు సమాధానాలు ఇచ్చారా? ఉల్లంఘనలు నిర్ధారణ అయ్యాయా? తదుపరి చట్టపరమైన చర్యలు ఏమిటి? అనే వివరాలను అధికారులు ప్రజలకు తెలియజేయాలి. ఒకవేళ నిర్మాణాలు కొనసాగుతున్నట్లు గుర్తిస్తే నిబంధనల ప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలి. లేదంటే ఫిర్యాదులు, నోటీసులు కేవలం రికార్డులకే పరిమితమయ్యాయన్న విమర్శలకు తావిచ్చినట్లవుతుంది.

ఉన్నతాధికారులారా.. సర్కిల్--59పై ప్రత్యేక విచారణ ఎప్పుడు?

దుండిగల్ సర్కిల్--59 పరిధిలో వివాదాస్పదంగా మారిన నిర్మా ణాలన్నింటినీ ఉన్నతాధికారులు ప్రత్యేకంగా పరిశీలించాలి. మం జూరైన భవన అనుమతులు, ఆమోదిత ప్రణాళికలు, క్షేత్రస్థాయి నిర్మాణాలు, సెల్లార్ల వినియోగం, సెట్‌బ్యాక్‌లు, పార్కింగ్ తదితర అంశాలపై సమగ్ర తనిఖీలు చేపట్టాలి. విధుల్లో నిర్లక్ష్యం లేదా అక్రమాలకు సహకారం ఉన్నట్లు ఆధారాలతో తేలితే సంబంధిత అధికారులపైనా శాఖాపరమైన చర్యలు తీసు కోవాలి. ముడుపుల ఆరోపణలపై కూడా నిష్పక్షపాత విచారణ జరిపించాలి.

దేశంలోనే క్లీనెస్ట్ సిటీగా నవీ ముంబయి- లిస్ట్‌లో విజయవాడ, విశాఖ



విశాఖ: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే వార్షిక స్వచ్ఛతా సర్వేలో మహారాష్ట్రకు చెందిన నవీ ముంబయి దేశంలోనే అత్యంత పరిశుభ్రమైన నగరంగా అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ స్వచ్ఛ సర్వేక్షణ్ 2026 జాబితాలో గుజరాత్‌లోని సూరత్ రెండో స్థానంలో నిలవగా, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విజయవాడ మూడో స్థానాన్ని దక్కించుకుంది. దిల్లీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము విజేతలకు ఈ స్వచ్ఛతా పురస్కారాలను ప్రదానం చేశారు. 10 లక్షల పైబడిన జనాభా కేటగిరీలో ఆంధ్రప్రదేశ్‌కే చెందిన గ్రేటర్ విశాఖపట్నం) దేశంలోనే క్లీనెస్ట్ సిటీగా మొదటి స్థానంలో నిలిచింది. ఈ విభాగంలో వైజాగ్ తర్వాతి స్థానాల్లో జబల్‌పుర్, లఖ్‌నవూ వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. 3 నుంచి 10 లక్షల జనాభా విభాగంలో మధ్య ప్రదేశ్‌లోని ఉజ్జయిన్ తొలి స్థానం దక్కించుకోగా, చండీగఢ్ రెండో స్థానంలో నిలిచింది. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు మూడో స్థానంలో నిలిచి సత్తా చాటాయి.

గత 8 సంవత్సరాలుగా వరుసగా దేశంలోనే క్లీనెస్ట్ సిటీగా అగ్రస్థానంలో నిలుస్తూ వచ్చిన మధ్యప్రదేశ్‌లోని ఇందౌర్ ఈ ఏడాది టాపర్ల జాబితాలో చోటు దక్కించుకోకపోవడం గమనార్హం. కిందటేడాది ఇందౌర్ అగ్రస్థానంలో నిలవగా, తర్వాతి స్థానాల్లో సూరత్, నవీ ముంబయి నిలిచాయి. ఇప్పుడు సూరత్ అదే స్థానంలో ఉండగా నవీ ముంబయి తొలి ప్లేసులోకి వచ్చింది. ఇందౌర్ జాబితాలోనే నిలవలేదు. రాజస్థాన్‌లో ఈసారి జైపుర్ అత్యంత పరిశుభ్రమైన నగరంగా గుర్తింపు పొందగా, మధ్యప్రదేశ్ నుంచి గ్వాలియర్ ఈ ఘనతను దక్కించుకుంది.

ఇతర ప్రత్యేక విభాగాల్లో విజేతలు ఇవే

కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (వీశీఎఖూ) ఇతర ప్రత్యేక విభాగాల్లోనూ విజేతల్ని ప్రకటించింది. నదీ తీర పట్టణాల (క్లీనెస్ట్ రివర్‌ఫ్రంట్ టౌన్స్) కేటగిరీలో చూస్తే మధ్యప్రదేశ్‌లోని రేవా తొలి స్థానంలో నిలిచింది. ఇది 50,000 నుంచి 3 లక్షల జనాభా కేటగిరీలో ఉంది. బిలాస్‌పుర్ (ఛత్తీస్‌గఢ్) రెండో స్థానంలో, వారణాసి (ఉత్తర్‌ప్రదేశ్) మూడో స్థానంలో నిలిచాయి. ఇవి వరుసగా 3-10 లక్షల జనాభా, 10 లక్షలకు పైగా జనాభా కేటగిరీలో ఉన్నాయి. స్వచ్ఛ తీర ప్రాంత పట్టణాల కేటగిరీలో (స్వచ్ఛ్ కోస్టల్ టౌన్స్) ఒడిశాలోని పూరీ అగ్రస్థానాన్ని దక్కించుకుంది. కేరళలోని అలప్పుళ రెండో స్థానంలో నిలవగా, మహారాష్ట్రలోని రత్నగిరి ఈ జాబితాలో మూడో స్థానాన్ని దక్కించుకుంది. ఈ మూడు నగరాలు 50,000 నుంచి 3 లక్షల జనాభా విభాగంలో ఉన్నాయి. క్లీనెస్ట్ హిమాలయన్ సిటీగా ఉత్తరాఖండ్‌లోని రుద్రపుర్ తొలి స్థానంలో నిలిచింది. ఈ హిమాలయ నగరాల్లో రెండో స్థానాన్ని జమ్మూ కైవసం చేసుకుంది.

ఇదే స్వచ్ఛ్ సర్వేక్షణ్ పురస్కారాల్లో మెంటార్ సిటీ (మార్గదర్శక నగరం) విభాగంలో గుజరాత్‌లోని అహ్మదాబాద్ తొలి స్థానంలో నిలిచింది. ఇక్కడ ఇందౌర్ రెండో స్థానంలో, ఆంధ్రప్రదేశ్‌లోని ఆధ్యాత్మిక నగరం తిరుపతి మూడో స్థానంలో నిలిచింది. స్వచ్ఛ షెహర్ జోడీ ఇనిషియేటివ్ కింద పెద్ద నగరాలతో చిన్న పట్టణాలను అనుసంధానించారు. ఇందులో భాగంగా సనంద్ నగరాన్ని అహ్మదాబాద్‌తో, దేపాల్‌పుర్‌ను ఇందౌర్‌తో, ఆంధ్రప్రదేశ్‌లోని కుప్పం పట్టణాన్ని తిరుపతితో మెంటీ సిటీస్‌గా (మార్గదర్శకత్వం పొందే నగరాలు) జత చేశారు. ఇతర అవార్డుల వివరాల్ని పరిశీలిస్తే అత్యుత్తమ పనితీరు కనబరిచిన నగరాల విభాగంలో హరియాణాలోని కర్నాల్- రాష్ట్రపతి పురస్కారాన్ని అందుకుంది. ఇంకా అర్బన్ శానిటేషన్ స్టాండర్డ్స్ కింద అద్భుత ప్రతిభ కనబర్చినందుకు ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పుర్, బిలాస్‌పుర్, బిల్హా నగరాలకు ప్రత్యేక గుర్తింపు దక్కింది. స్వచ్ఛ భారత్ మిషన్- అర్బన్ () ప్రారంభమై పదేళ్లు పూర్తయిన సందర్భంగా ఈ వేడుకను నిర్వహించారు. 'స్వచ్ఛతా కీ నయీ పహల్- బధాయే హాత్, కరే సఫాయీ సాథ్ (స్వచ్ఛత కోసం కొత్త కార్యక్రమం- చేయి కలపండి, కలిసి శుభ్రం చేద్దాం)' థీమ్‌తో సాగిన ఈ సర్వేలో దేశవ్యాప్తంగా ఉన్న 4751కి పట్టణ స్థానిక సంస్థలను 43 రకాల ప్రమాణాల ఆధారంగా పోల్చి చూసి విజేతల్ని గుర్తించారు. 2016లో కేవలం 73 పట్టణ స్థానిక సంస్థలతో ప్రారంభమైన ఈ స్వచ్ఛ సర్వేక్షణ్, తాజా ఎడిషన్ నాటికి 4751 నగరాలకు విస్తరించింది.

జమ్మూకశ్మీర్‌లోని కుల్గామ్ జిల్లాలో ఉన్న సీఆర్‌పీఎఫ్ (CRPF) శిబిరంపై బుధవారం ఉగ్రవాద దాడి జరిగింది.



జమ్మూకశ్మీర్: ఈ దాడిలో ముగ్గురు సీఆర్‌పీఎఫ్ సిబ్బంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. జమ్మూకశ్మీర్‌లోని కుల్గామ్ జిల్లాలో ఉన్న సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) శిబిరంపై బుధవారం ఉగ్రదాడి జరిగింది. ఈ ఘటనలో ముగ్గురు సీఆర్‌పీఎఫ్ సిబ్బంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. గాయపడిన జవాన్లను హుటాహుటిని సమీప ఆసుపత్రికి తీసుకెళ్లారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఉగ్రదాడి నేపథ్యంలో ఆ ప్రాంతంతో భారీ బలగాలను మోహరించారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, బుధవారం మధ్యాహ్నం సుమారు 2:15 గంటల ప్రాంతంలో మోటార్ సైకిళ్?పై వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులిద్దరు, చెక్?పాయింట్? వద్ద ఉన్న సీఆర్?పీఎఫ్? సిబ్బందిపై కాల్పులు జరిపారు. ఈ నేపథ్యంలో భద్రతా సిబ్బంది ఎదురుకాల్పులు జరపగా, నిందితులు వెంటనే అక్కడి నుంచి పరారయ్యారు. గాయపడిన సిబ్బందిని చికిత్స కోసం అనంతనాగ్ జిల్లాలోని ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారు 46వ సీఆర్పీఎఫ్ బెటాలియన్‌కు చెందిన సిబ్బందిగా తెలుస్తోంది. "కశ్మీర్‌లోని కుల్గామ్‌లో సీఆర్పీఎఫ్ నాకా వద్ద కాల్పులు జరిగాయి. ముగ్గురు జవాన్లు గాయపడ్డారు. నిందితులను పట్టుకోవడానికి గాలింపు చర్యలు ముమ్మరం చేశాం. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందిస్తున్నాం" అని సీఆర్పీఎఫ్ ప్రతినిధి తెలిపారు.వరూ ఇళ్ల నుంచి బయటకు రావొద్దు!కాగా, ఉగ్రదాడి అనంతరం ఘటనా స్థలంలో అదనపు బారికేడ్లు ఏర్పాటు చేసి, సాయుధ వాహనాలతో భారీగా బలగాలను మోహరించారు. క్విక్ రియాక్షన్ టీమ్‌తో కలిసి క్యాంప్ చుట్టుపక్కల ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ చేపట్టాయి. స్థానికులు ఎవరూ ఇళ్ల నుంచి బయటకు రావొద్దంటూ అధికారులు లౌడ్‌స్పీకర్ల ద్వారా హెచ్చరికలు జారీ చేశారు. అటు ఈ ఉగ్రదాడి జరిగిన సమయంలో జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా కుల్గామ్ జిల్లాలోనే పర్యటిస్తున్నారు. అయితే ఆయన పర్యటిస్తున్న ప్రాంతానికి దాడి జరిగిన స్థలం దూరంగా ఉందని అధికారులు తెలిపారు. ఉగ్రదాడి నేపథ్యంలో కత్రాలో

ఓటరు జాబితా సవరణ పారదర్శకంగా చేపట్టాలి,

నాగర్ కర్నూల్: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతోందని, ఇందులో భాగంగా బుధవారం నాగర్ కర్నూల్ కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, అదనపు కలెక్టర్ బి. చెన్నయ్యతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఎస్ఐఆర్ ప్రక్రియ అమలు, ఓటరు జాబితా సవరణ, పేర్ల నమోదు, తొలగింపు, మార్పులు, చేర్పులు, అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణ తదితర అంశాలపై కలెక్టర్ సమగ్రంగా వివరించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో రాజకీయ పార్టీల ప్రతినిధులు భాగస్వాములై, అవసరమైన సూచనలు, అభ్యంతరాలను నిర్దిష్ట గడువులోగా సమర్పించాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ....., ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటరు జాబితాలో పేర్ల నమోదు, తొలగింపు, మార్పులు, చేర్పులకు సంబంధించి ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా అభ్యంతరాలు, క్లెయిమ్‌లు సమర్పించే ందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సమయంలో అందిన ప్రతి అభ్యంతరాన్ని, క్లెయిమ్‌ను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా పరిష్కరిస్తారని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.అలాగే అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణతో పాటు వాటి పరిశీలన, పరిష్కార ప్రక్రియ పూర్తయిన అనంతరం తదుపరి దశలో కొత్తగా ఓటరుగా నమోదు కావాలనుకునే వారి నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎండి హుస్సేన్ , బాలకృష్ణ, ఎండి హబీబ్, పర్వతాలు, రాజేందర్, వెంకటయ్య, ఎన్నికల విభాగం సూపరిండెంట్ రవి కుమార్, ఎన్నికల డిటీ కల్పన సంబంధిత ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

రేకులపల్లి తండాకు పర్యటించిన మంత్రి జూపల్లి కృష్ణారావు .







రేకులపల్లి: రేకులపల్లి తండా సర్పంచ్ ప్రభాకర్ నాయక్ ఆహ్వానం మేరకు తెలంగాణ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి గౌరవ శ్రీ జూపల్లి కృష్ణారావు గారు పర్యటించారు,పర్యటనలో బాగంగా తండా లబ్ధిదారులు కల్యాణలక్ష్మి చెక్కు,మరియు ఇందిరమ్మ ప్రొసీడింగ్ ఇవ్వడం జరిగింది.అదేవిధంగా తండా ప్రధాన సమస్య రేకులపల్లి నుండి రాజాపూర్ బీటీ రోడు టెండర్ పని పూర్తి అయింది,పనులు కూడా కూడా అతి త్వరలో మొదలు పెడతారు అన్నారు.అదేవిధంగా రేకులపల్లి తండా సర్పంచ్ ప్రభాకర్ నాయక్ మాట్లాడుతూ తండాకు ఇంకా అదనపు ఇందిరమ్మ ఇళ్లు కావాలని మంత్రి గారిని కోరడం జరిగింది,దానికి మంత్రి గారు సానుకూలంగా స్పందించి తప్పా కుండా ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి గారితో పాటు మాజీ ఎంపీపీ రామోనరావు సార్,మాజీ జడ్పీటీసీ బిస్తిరం నాయక్, ఉపసర్పంచ్ లలిత శ్రీను నాయక్ ,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్య నాయక్,వార్డ్ మెంబర్ శ్రీను ,బాబు,మరియు కాంగ్రెస్ పార్టీ గ్రామ ఉపాధ్యక్షులు మాతృ నాయక్, సురేష్ నాయక్, తండా ప్రజలు తదితరులు పాల్గొన్నారు. మంత్రి గారి పర్యటనకు సంబంధించిన కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామా పెద్దలు,ప్రజలు పాల్గొని విజయవంతం చేసినందుకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు.??
జై జూపల్లి జైజై జూపల్లి

బిల్డర్ రాజ్యమా? అధికారులది బానిస బతుకా?

- బిల్డర్ కనుసైగే చట్టమా? టౌన్‌ప్లానింగ్ శాఖ బందీనా?
- G+2 పేరుతో G+5 బరితెగింపు.. అధికారుల కళ్లు గుడ్డివయ్యాయా?
- నిబంధనలు బుట్టదాఖలు.. బిల్డర్ అక్రమాలకు అధికారుల అండ ఉందా?
- అధికారుల కుర్చీలకు పరిమితమైన పర్యవేక్షణ.. బిల్డర్‌కు అడ్డూ అదుపూ లేదా?
- బిల్డర్ ముందు చట్టం మోకరిల్లిందా? సర్కిల్--58లో ఇదేం విచిత్రం?
- అనుమతులు ఒకటి.. అంతస్తులు ఐదు! ఈ అక్రమాలకు బాధ్యులెవరు?
- టౌన్‌ప్లానింగ్ శాఖ నిద్రలోనా? బిల్డర్ మాత్రం నిర్మాణంలో బిజీనా?
- అక్రమ అంతస్తులకు అడ్డుకట్ట ఏది? అధికారుల చర్యలు ఎక్కడ?
- బిల్డర్ ఇష్టారాజ్యానికి ప్రభుత్వ నిబంధనలు బలిపశువులా?





కుత్బుల్లాపూర్, నవంబర్ 11 (పీపుల్స్ న్యూస్)

నిబంధనలు సామాన్యులకేనా? బడా నిర్మాణదారులకు వర్తించవా? ప్రభుత్వ అనుమతులు ఒక లెక్క.. క్షేత్రస్థాయిలో నిర్మాణాలు మరో లెక్క అన్న చందంగా నిజాంపేట సర్కిల్--58 పరిధిలో భవన నిర్మాణాలు సాగుతున్నాయనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. +o2 అంతస్తులకు అనుమతులు తీసుకుని మరో మూడు అంతస్తులు అదనంగా నిర్మిస్తున్నారనే ఆరోపణలు వెలుగులోకి వస్తున్నా సంబంధిత టౌన్‌ప్లానింగ్ అధికారులు ఏం చేస్తున్నారన్న ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి.నిజాంపేటలోని అలిపి సర్కిల్ సమీపంలో శిల్ప పారడైస్ వద్ద ప్లాట్ నంబర్ 185లో ఈ నిర్మాణం జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మంజూరైన అనుమతులు +o2 వరకే ఉంటే, అదనంగా మరో మూడు అంతస్తుల నిర్మాణానికి అనుమతి ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరు అనుమతించారు? నిర్మాణదారుడికి ప్రత్యేక



నిబంధనలు ఏమైనా ఉన్నాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

బిల్డర్ కనుసైగే చట్టమా? అధికారుల అధికారం ఏమైంది?

నిర్మాణ అనుమతులకు విరుద్ధంగా పనులు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో తనిఖీలు ఎందుకు జరగడం లేదన్నది అంతుచిక్కని ప్రశ్నగా మారింది. భవన నిర్మాణ అనుమతులను పరిశీలించాల్సిన అధికారులు ఎక్కడు న్నారు? అదనపు అంతస్తుల నిర్మాణం వారి దృష్టికి రాలేదా? వచ్చినా పట్టించుకోవడం లేదా? లేక నిర్మాణదారుడి పలుకుబడి ముందు అధికారుల చర్యలు ఆగిపోతున్నాయా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చిన్నపాటి నిర్మాణ మార్పులకే నిబంధనల పేరుతో సామాన్యులను ప్రశ్నించే టౌన్‌ప్లానింగ్ విభాగం, బహుళ అంతస్తుల నిర్మాణంపై వస్తున్న ఆరోపణల విషయంలో ఎందుకు మౌనంగా ఉందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలను అమలు చేయాల్సిన అధికారులే ప్రేక్షక పాత్రకు పరిమితమైతే నగరంలో అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేసేదెవరు?

అనుమతులు G+2.. నిర్మాణం G+5నా?

మంజూరైన భవన నిర్మాణ అనుమతులకు మించి అదనపు అంతస్తులు నిర్మిస్తున్నారనే ఆరోపణలు నిజమైతే ఇది సాధారణ ఉల్లంఘనగా తీసుకునే అంశం కాదు. భవన భద్రత, నిర్మాణ ప్రమాణాలు, పార్కింగ్, అగ్నిమాపక భద్రత వంటి అంశాలపై కూడా సంబంధిత శాఖలు పరిశీలన జరపాల్సిన అవసరం ఉంది. అనుమతుల పత్రాలు ఒకటి చెబుతుంటే క్షేత్రస్థాయి నిర్మాణం మరోలా ఉందా? అన్నది అధికారులు స్పష్టం చేయాలి.

నోటీసుల నాటకమా? చర్యల అమలెక్కడ?

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వచ్చినప్పుడు నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకోవడం కాకుండా, ఉల్లంఘనలు నిర్ధారణ అయితే చట్టప్రకారం తదుపరి చర్యలు తీసుకోవాలి. నిర్మాణ పనులు కొనసాగుతున్న సమయంలోనే అధికారులు స్పందిం చకపోతే, భవనం పూర్తయిన తర్వాత చర్యలు తీసుకోవడం వల్ల ప్రయోజనం ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

బిల్డర్‌కు ఒక న్యాయం.. సామాన్యులకు మరో న్యాయమా?

ప్రభుత్వ నిబంధనలు అందరికీ సమానంగా వర్తించాలి. అనుమతులకు మించి నిర్మాణం జరిగిందా లేదా అన్న విషయాన్ని సర్కిల్--58 టౌన్‌ప్లానింగ్ అధికారులు బహిరంగంగా స్పష్టం చేయాలి. ప్లాట్ నంబర్ 185కు సంబంధించిన మంజూరైన అనుమతులు, క్షేత్రస్థాయి నిర్మాణ పరిస్థితిని సరిపోల్చి వాస్తవాలను వెల్లడించాలి.

ఉన్నతాధికారులారా.. మీరైనా స్పందించండి!

G+2 అనుమతుల పేరిట మరో మూడు అంతస్తుల నిర్మాణం జరుగుతోందన్న ఆరోపణలపై జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు, టౌన్‌ప్లానింగ్ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలి. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి ఉల్లంఘనలు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

గురుకుల విద్యార్థులపై వసతి గృహ విద్యార్థుల దాడి?



పెద్దవూర, నవంబర్ 11 : పాఠశాలల్లో, వసతి గృహాల్లో భద్రతా పర్యవేక్షణ లోపించడంతో నల్లగొండ జిల్లా పెద్దవూర మండల కేంద్రంలో విద్యార్థులు అర్ధరాత్రి వేళ పాఠశాల ప్రాంగణం దాటి పట్టణంలోని రోడ్లపైకి చేరుకుని పరస్పరం ఘర్షణకు దిగిన ఘటన కలకలం రేపుతోంది. విద్యార్థులు రోడ్లపై వచ్చి కొట్టుకుంటున్న దృశ్యాల వీడియో బుధవారం వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో ఈ ఘటన చర్చనీయాంశంగా మారింది. మండలంలోని గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు ముగ్గురు ఈ నెల 4న సాయంత్రం వేళలో తినుబండారాల కోసం పాఠశాల నుండి పెద్దవూరకు చేరుకుని తినుబండారాలు తీసుకుని తిరిగి వస్తుండగా వసతి గృహాలకు చెందిన వివిధ పాఠశాలల విద్యార్థులు గురుకుల పాఠశాల ముగ్గురు విద్యార్థులను అడ్డగించి దాడికి దిగినట్టు తెలుస్తుంది. వీడియో చూసిన స్థానికులు, తల్లిదండ్రులు గంజాయి మత్తులో ఈ దారుణానికి ఒడిగట్టారని ఆరోపిస్తున్నారు.గురుకుల విద్యార్థులపై వసతి గృహా విద్యార్థుల దాడిగురుకుల విద్యార్థులపై వసతి గృహా విద్యార్థుల దాడిఅసలు అర్ధరాత్రి వేళ విద్యార్థులు పాఠశాల నుండి బయటకు ఎలా వచ్చారు? వారు పట్టణంలోని రోడ్లపైకి చేరుకునే వరకు పాఠశాల సిబ్బంది, వసతి గృహాల వార్డెన్లు ఏం చేస్తున్నారు? రాత్రి వేళ విద్యార్థుల కదలికలను పర్యవేక్షించాల్సిన బాధ్యత ప్రిన్సిపాల్, వార్డెన్లకు లేదా? విద్యార్థుల భద్రత కోసం సెక్యూరిటీ సిబ్బంది కూడా లేకపోవడం వంటి వాటిపై తల్లిదండ్రులు, స్థానికుల నుండి ప్రశ్నలు ఉత్పన్నమౌతున్నాయి. గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల క్రమశిక్షణ, ప్రవర్తనపై యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని సర్వత్రా అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల ఇలాంటి ఘర్షణలకు పాల్పడకుండా కౌన్సెలింగ్ నిర్వహించి వారి మానసిక పరిణతిలో స్నేహ సంబంధాలు, ప్రవర్తనపై మార్పు తీసుకురావాలని కోరుతున్నారు. పాఠశాల ప్రిన్సిపల్, వసతి గృహాల వార్డెన్ల పర్యవేక్షణ పూర్తిగా విఫలమైందని గురుకుల పాఠశాల ప్రిన్సిపల్, వసతి గృహాల వార్డెన్లు స్థానికంగా ఉండి ఉంటే ఇలాంటి ఘటన జరిగేది కాదని అంటున్నారు. వసతి గృహాల్లో కనీసం సెక్యూరిటీ గార్డు లేకపోవడం దురదృష్టకరమని తల్లిదండ్రులు వాపోతున్నారు. రాత్రి వేళ భద్రతా ఏర్పాట్లు, విద్యార్థులు బయటకు వెళ్లకుండా అధికారులు కళ్లు తెరిచి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరుతున్నారు. ఈ ఘటనపై పూర్తి విచారణ చేపట్టి ఘటనకు బాధ్యులైన విద్యార్థులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

విద్యా రంగానికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన సేవలు చిరస్మరణీయం

- మౌలానా అబుల్ కలాం ఆజాద్ 138వ జయంతి వేడుకలు
- నేటి యువతకు మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆదర్శనీయం
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్





మెదక్ జిల్లా బ్యూరో, నవంబర్ 11

విద్యా వైతాళికుడు, భారతదేశ తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవితం నేటి యువతకుఆదర్శ నీయమని కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు.బుధవారం, జిల్లా సమీకృత కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ 138వ జయంతి వేడుకలను నిర్వహించారు.కలెక్టర్ ప్రతిమా సింగ్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన గావించి, పూలమాలలు సమర్పించి, నివాళు లర్పించారు.కలెక్టర్ మాట్లాడుతూ 1923లో కేవలం 35 సంవత్సరాల వయసులోనే ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీకి అతి చిన్న వయసులో అధ్యక్షుడిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఎన్నికయ్యారని తెలిపారు. ఆయన జయంతి రోజును జాతీయ విద్యా దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామని పేర్కొన్నారు. దేశ తొలి విద్యా శాఖ మంత్రిగా విద్యారంగ అభివృద్ధికి, విద్యా సంస్కరణలకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు.ఆధునిక విద్యా విధానాలు, విద్యా ప్రణాళికల రూపకల్పనలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. అప్పటివరకు అమలులో ఉన్న విద్యా విధానాల్లో మార్పులు తీసుకువచ్చి, దేశ అవసరాలకు అనుగుణంగా నూతన విద్యా విధానానికి పునాదులు వేశారని వెల్లడించారు.మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆశయాలు, దేశభక్తి, విద్యారంగానికి ఆయన చేసిన సేవలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకొని, విద్యకు ప్రాధాన్యతనిస్తూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఎంతో ఉన్నతమైన వ్యక్తిత్వం కలిగినప్పటికీ ఎలాంటి స్వార్థం లేకుండా దేశ సేవకే తన జీవితాన్ని అంకితం చేశారని పేర్కొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొని, ఎన్ని సవాళ్లు ఎదురైనా వెనుకడుగు వేయకుండా దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడారని తెలిపారు. దేశానికి ఆయన అందించిన విశిష్ట సేవలను గుర్తించి, భారత ప్రభుత్వం అత్యున్నత పౌర పురస్కారమైన 'భారతరత్న'తో సత్కరించిందని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు

దేశంలోనే తొలి ఏఐ పోలీస్ స్టేషన్‌గా పంజాగుట్ట ఠాణా!

■ ఫిర్యాదు నుంచి ఛార్జ్‌షీట్ వరకు కృత్రిమ మేధతోనే పోలీసింగ్.. డిసెంబర్ మొదటి వారంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభం

■ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో సీపీ సజ్జనర్ ఆకస్మిక తనిఖీ.. ఏఐ సాంకేతిక ఏర్పాట్లపై క్షేత్రస్థాయి పరిశీలన







హైదరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో నవంబర్ 11 (పీపుల్స్ న్యూస్)

పోలీసింగ్ వ్యవస్థలో సరికొత్త సాంకేతిక విప్లవానికి హైదరాబాద్ నగరం వేదిక కానుంది. దేశంలోనే తొలి కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత పోలీస్ స్టేషన్‌గా పంజాగుట్ట పోలీస్ స్టేషన్ రూపుదిద్దుకుంటోంది. ఫిర్యాదు స్వీకరణ నుంచి ఎఫ్ఐఆర్ నమోదు, కేసు దర్యాప్తు, కేసు డైరీ, దర్యాప్తు నివేదికలు, ఛార్జ్‌షీట్ రూపకల్పన వరకు పోలీస్ సేవలను ఏఐ సాంకేతికతతో అనుసంధానించేందుకు ఏర్పాట్లు వేగంగా కొనసాగుతున్నాయి. గౌరవ డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశాల మేరకు పైలట్ ప్రాజెక్టుగా ఈ వినూత్న విధానాన్ని అమలు చేయనున్నట్లు హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ వెల్లడించారు. బుధవారం పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, అక్కడ జరుగుతున్న సాంకేతిక ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడిన సీపీ.

తనిఖీలో భాగంగా పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో సీపీ సజ్జనర్ నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పనితీరు, బాధ్యతలు, రోజువారీ విధుల నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. ఏసీపీ మురళీకృష్ణ, ఇన్‌స్పెక్టర్ జహంగీర్‌తో కలిసి ఏఐ ఆధారిత వ్యవస్థల ఏర్పాటు, సాంకేతిక పనుల పురోగతిని పరిశీలించారు.

10 భాషల్లో ఫిర్యాదులు.. క్షణాల్లో అనువాదం!.

పోలీస్ స్టేషన్ రిసెప్షన్ వద్ద ఏర్పాటు చేసిన 'సేతు' కియోస్క్ ఈ కొత్త విధానంలో కీలకంగా మారనుంది. దీని ద్వారా బాధితులు దాదాపు పది భాషల్లో తమ ఫిర్యాదులను నమోదు చేయవచ్చు. ఏఐ సాంకేతికత ఫిర్యాదులను స్థానిక భాషలోకి అనువదించి సంబంధిత అధికారులకు క్షణాల్లో చేరవేస్తుంది. భాషా సమస్యల కారణంగా ఫిర్యాదులు చేయడంలో ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులను తగ్గించేందుకు ఈ విధానం ఉపయోగపడనుంది.

ఎఫ్ఐఆర్ నుంచి ఛార్జ్‌షీట్ వరకు ఏఐ సేవలు.

కేసుల నమోదు, కేసు డైరీల నిర్వహణ, దర్యాప్తు నివేదికల తయారీ, ఛార్జ్‌షీట్ రూపకల్పన వంటి ప్రక్రియల్లో ఏఐ సాంకేతికతను వినియోగించనున్నారు. దీనివల్ల పోలీస్ సిబ్బందికి పనిభారం తగ్గడంతో పాటు కేసుల నిర్వహణలో వేగం, సమన్వయం పెరుగుతాయని పోలీస్ అధికారులు భావిస్తున్నారు.

నేరాల విశ్లేషణతో పటిష్టమైన పెట్రోలింగ్.

పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని రద్దీ ప్రాంతాలు, హోస్టళ్లు, వాణిజ్య సముదాయాలు, గత నేరాల చరిత్ర తదితర వివరాలను ఏఐ ద్వారా విశ్లేషించి బ్లూకోల్ట్స్, పెట్రోలింగ్ వ్యవస్థను మరింత సమర్థంగా నిర్వహించనున్నారు. అవసరమైన ప్రాంతాల్లో పోలీసుల నిఘా, గస్తీని మెరుగుపరిచేలా సాంకేతిక వ్యవస్థను రూపొందిస్తున్నారు. ఈ విధానం వినియోగంపై పోలీస్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కూడా అందిస్తున్నారు.

డిసెంబర్ మొదటి వారంలో ప్రారంభం.

డిసెంబర్ నెల మొదటి వారంలో డీజీపీ సీవీ ఆనంద్ చేతుల మీదుగా ఏఐ ఆధారిత పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌ను పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించనున్నట్లు సీపీ సజ్జనర్ తెలిపారు. ఈ ప్రయోగం ద్వారా వచ్చే ఫలితాలను సమగ్రంగా పరిశీలించిన అనంతరం రాష్ట్రవ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లలోనూ ఈ విధానాన్ని అమలు చేసే దిశగా చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు.

తెలంగాణలోని విద్యాసంస్థల్లో మూవీ ప్రమోషన్లు బ్యాన్?! - కొత్త మార్గదర్శకాలకు సర్కారు సమాయత్తం



రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల్లో సినిమా ప్రమోషన్లు, ప్రైవేట్ కార్యక్రమాలను నిషేధించేందుకు తెలంగాణ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇటీవల కొన్ని విద్యాసంస్థల యాజమాన్యాలు సినిమా ప్రమోషన్లు, ఇతర ప్రైవేట్ కార్యక్రమాలను నిర్వహిస్తూ విద్యార్థుల ప్రాణాలను ప్రమాదంలోకి నెడుతున్నాయి. కొద్ది రోజుల కిందట ఓ ప్రైవేట్ విశ్వవిద్యాలయంలో సినిమా ప్రమోషన్ కార్యక్రమం నిర్వహించారు. మరో ఇంజినీరింగ్ కళాశాలలో దాండియా వేడుక నిర్వహించగా, తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ఓ విద్యార్థి ప్రాణాలు కోల్పోవడంతోపాటు పదుల సంఖ్యలో గాయాలపాలయ్యారు. ఈ తరహా ఘటనలను కట్టడి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.ముసాయిదా రూపొందించిన విద్యామండలి చైర్మన్విద్యాసంస్థల్లో ఎలాంటి కార్యక్రమాలను అనుమతించొచ్చు, ఏయే ఈవెంట్స్?ను నిషేధించాలనే అంశంపై సమగ్ర అధ్యయనం చేయాలని విద్యాశాఖ అధికారులను ప్రభుత్వం ఆదేశించినట్లు సమాచారం. విద్యాసంస్థల ప్రాంగణాలు కేవలం విద్య, క్రీడా సంబంధిత కార్యకలాపాలకు మాత్రమే వినియోగించాలని, సినిమా ప్రమోషన్లు లేదా ఇతర వాణిజ్య కార్యక్రమాల కోసం ఉపయోగించకూడదని భావిస్తున్నట్లు తెలుస్తోంది. చిన్నపాటి కార్యక్రమాలైతే ఇబ్బంది లేదని, వందల సంఖ్యలో బయటి నుంచి ఇతరులు సైతం గుమిగూడే కార్యక్రమాల పట్ల యాజమాన్యాలు తగు జాగ్రత్తలు పాటించాలని సర్కారు సూచించినట్లు తెలుస్తోంది.ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి విద్యాసంస్థల్లో విద్యార్థుల భద్రతపై చట్టం చేయాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి ముసాయిదాను రూపొందించి ప్రభుత్వానికి సమర్పించారు. త్వరలోనే దీనిపై అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉందని సమాచారం.ఇటీవల జరిగిన ప్రమాదంలో విద్యార్థిని మృతికొద్ది రోజుల కిందట హైదరాబాద్? నగరంలోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్? కళాశాలలో దాండియా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వెయ్యిమందికి పైగా విద్యార్థులు హాజరుకాగా, దాండియా అలంకరణ కోసం కళాశాల ప్రాంగణంలో లైటింగ్ ట్రస్ ఏర్పాటు చేశారు. అమ్మాయిలు, అబ్బాయిలకు వేర్వేరుగానే విభాగాలు ఏర్పాటు చేశారు. అయితే వేడుకలు మొదలుపెట్టిన కొద్దిసేపటికే ఈదురుగాలులు వీచాయి. దీంతో రాత్రి 7.30 నుంచి 7.45 గంటల సమయంలో అమ్మాయిల కోసం ఏర్పాటు చేసిన ట్రస్ ఒక్కసారిగా కూలిపడింది.నృత్యాల కోసం ఏర్పాటు చేసిన సౌండ్? సిస్టమ్? కారణంగా తొలుత ఏం జరిగిందో అక్కడున్న వారికి అర్థం కాలేదు. పదుల సంఖ్యలో విద్యార్థులు లైటింగ్ స్తంభాల కింద పడి సాయం కోసం హాహాకారాలు చేశారు. దీంతో ఇతర విద్యార్థులు తేరుకొని వారిని బయటికి తీయగా, అప్పటికే పలువురు స్పృహ కోల్పోయారు. వారిని దగ్గర్లోని ఆసుపత్రికి తరలించారు. కానీ అప్పటికే బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతిచెందిన విద్యార్థిని కవల సోదరి కూడా అదే కళాశాలలో చదువుతోంది. ఆమెకు కూడా గాయాలయ్యాయి.

ఎవరికీ అనుమానం రాదనుకున్నారు - ఒంటిపై ఆభరణాల కోసం హతమార్చారు



కరీంనగర్ జిల్లా: వారిద్దరిదీ ఒకే ఊరు. పిల్లలంతా ఎవరికి వారుగా స్థిరపడటంతో ఒంటరిగా వృద్ధాప్య జీవితం గడుపుతున్నారు. అదేంటో కానీ ఆ వృద్ధ మహిళలిద్దరూ మూడు నెలల వ్యవధిలో కాలం చేశారు. అనూహ్యంగా ఇద్దరూ ఒకే విధంగా చనిపోయారు. మొదట ఓ వృద్ధురాలు చనిపోతే సహజమరణంగా భావించినా, రెండోసారి మరొకరు అదే విధంగా చనిపోవడం ఎందుకో కుటుంబ సభ్యులకు అనుమానాన్ని రేకెత్తించింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల దర్యాప్తులో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి.బంగారు, వెండి ఆభరణాల కోసమే హత్యలుకరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ వచ్చనూరులో జరిగిన ఇద్దరు వృద్ధురాళ్ల మరణాల వెనుక దాగిన మిస్టరీ వీడింది. అక్టోబర్ 31న జరిగిన ఓ హత్య కేసును విచారణ చేసిన పోలీసులు, ఆగస్టు 16న మృతి చెందిన మరో వృద్ధురాలిది కూడా హత్యేనని తేల్చారు. వీరి ఒంటిపై ఉన్న బంగారు, వెండి ఆభరణాల కోసమే ఈ హత్యలు జరిగినట్లు విచారణలో తేలింది. వృద్ధులు చనిపోతే ఎవ్వరూ అనుమానించరని నిందితులు పక్కా స్కెచ్‌తో ఆయుధాలు ఉపయోగించకుండా ఊపిరి ఆడకుండా చేసి సహజమరణంలా చిత్రీకరించారు. కానీ వరుసగా కేవలం మూడు నెలల వ్యవధిలో ఇద్దరూ ఒకే విధంగా మృతి చెందడంతో కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. చివరకు వారి అనుమానమే నిజమైంది.వృద్ధురాళ్లకు ఊపిరాడకుండా చేసివచ్చనూరు గ్రామంలో నివాసముంటున్న ఉప్పులేటి లక్ష్మి పిల్లలంతా ఎవరికి వారుగా ఉండటంతో ఇంట్లో ఒంటరిగా ఉంటోంది. అక్టోబర్ 31న అనుమానస్పద స్థితిలో మృతిచెందింది. 80 ఏడా అదే విధంగా చనిపోయింది. దీంతో కుటుంబసభ్యులు లక్ష్మీ మరణంపై అనుమానం వ్యక్తం చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు మృతురాలి కాల్ డేటా ఆధారంగా నిందితుడు మద్దూరి సాయిగా గుర్తించారు. తన ఆర్థిక ఇబ్బందులను తొలగించుకునేందుకు సాయి తన సహచరులతో కలిసియించి సొమ్ము చేసుకున్నాడు. మొదటి హత్యతో ఎవరికీ అనుమానం రాకపోవడంతో నిందితులు మరో నేరానికి పథకం వేసి ఉప్పులేటి లక్ష్మి ఇంట్లోకి చొరబడి ఆమెకు ఊపిరాడకుండా చేసి చంపారు. ఆమె వద్ద నుంచి వెండి కడియాలు, బంగారు గొలుసు, చెవి కమ్మలను అపహరించారు. ఇది కూడా మొదటి కేసులాగే అవుతుందని నిందితులు భావించారు. కానీ పోలీసుల ఎంట్రీతో సీన్‌రివర్స్ అయ్యింది. ఫలితంగా ఒక కేసు దర్యాప్తు కోసం వచ్చిన పోలీసులు రెండు హత్యల మిస్టరీని ఛేదించారు.ఆభరణాలను పలు చోట్ల విక్రయించిచోరీ చేసిన సొత్తును నిందితులు కొంత కరీంనగర్‌లో, మరికొంత హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో విక్రయించినట్లు విచారణలో పోలీసులు గుర్తించారు. అలుగునూర్ చౌరస్తా వద్ద వాహన తనిఖీల్లో నిందితులు సాయి, కిన్నెర రాజును అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారు ఇచ్చిన సమాచారంతో పవన్, ఎల్కతుర్తి రాజులను అరెస్ట్ చేసి పరారీ ఉన్న మణికంఠ కోసం గాలిస్తున్నట్లు వెల్లడించారు."ఈ కేసులో ప్రధాన నిందితుడు సాయి, మరో ఇద్దరితో కలిసి వృద్ధురాలిని హత్య చేసేందుకు పథకం రచించాడు. మరో ఇద్దరు ఆభరణాలు విక్రయించేందుకు సాయం చేశారు. వృద్ధులను హతమార్చి, ఆభరణాలను అపహరించి వాటిని అమ్మి సొమ్ము చేసుకున్నారు. ఇదే నేపథ్యంలో గతంలో ఉప్పులేటి బూదమ్మ (103)ను హత్య చేశారు. నిందితులంతా నిరుద్యోగులు, అవసరాల కోసం అప్పులు చేస్తున్నారు. వీటిని తీర్చేందుకు ఈ తరహా హత్యలకు పాల్పడుతున్నారు. నిందితులపై కుటుంబ పర్యవేక్షణ కరవైంది దీంతో నేరాలకు పాల్పడుతున్నారు"

చెడు వ్యసనాలకు దూరంగా ఉండండి.. సృజనాత్మకతకు దగ్గరవ్వండి!

■ పోలీసులు మంచి అభిరుచులను అలవర్చుకోవాలి.. విధులతో పాటు ప్రతిభను వెలికితీయాలి: హైదరాబాద్ సీపీ సజ్జనర్

■ కానిస్టేబుల్ నారాయణరావు రచించిన 'వంశధార' వచన కవితా సంకలనం ఆవిష్కరణ







హైదరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో నవంబర్ 11 (పీపుల్స్ న్యూస్)

పోలీస్ ఉద్యోగం అంటే కేవలం విధుల నిర్వహణ మాత్రమే కాదు.. సమాజానికి ఆదర్శంగా నిలిచే బాధ్యత కూడా అని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, మానసిక ప్రశాంతత కోసం క్రీడలు, పుస్తక పఠనం, సంగీతం, యోగా, రచనలు వంటి సృజనాత్మక అభిరుచులను అలవర్చుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరిలోనూ ఏదో ఒక ప్రత్యేక ప్రతిభ దాగి ఉంటుందని, దానిని గుర్తించి అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు.బంజారాహిల్స్‌లోని టీజీఐసీసీసీలో బుధవారం హైదరాబాద్ సిటీ పోలీస్ ఐటీ సెల్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న నారాయణరావు కురిటి రచించిన 'వంశధార' వచన కవితా సంకలనాన్ని సీపీ సజ్జనర్ ఆవిష్కరించారు.

పోలీస్ ఉద్యోగంలో ఉంటూ రచయితగా ఎదగడం అభినందనీయం.

ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చిన నారాయణరావు, నిరంతరం పని ఒత్తిడితో కూడిన పోలీస్ ఉద్యోగంలో ఉంటూనే నాలుగేళ్ల పాటు శ్రమించి చక్కటి కవితా సంకలనాన్ని తీసుకురావడం హైదరాబాద్ సిటీ పోలీస్ శాఖకు గర్వకారణమని ప్రశంసించారు. విధులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ మంచి అభిరుచులను పెంపొందించుకోవాలని సిబ్బందికి సూచించారు. పోలీస్ సిబ్బందిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ప్రత్యేక వర్క్‌షాప్‌లు నిర్వహించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు.

తల్లిదండ్రులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత.

'వంశధార' పుస్తకాన్ని తన తల్లిదండ్రులు రమణ, నర్సమ్మలకు అంకితం చేయడంపై సీపీ ప్రత్యేకంగా స్పందించారు. కంటికి కనిపించే దేవుళ్లైన తల్లిదండ్రులను గౌరవించడం, వారి బాగోగులు చూసుకోవడం ప్రతి ఒక్కరి ప్రథమ కర్తవ్యమని పేర్కొన్నారు. పోలీసులు ప్రశాంతంగా విధులు నిర్వర్తించేందుకు ఇంటి బాధ్యతలను చూసుకుంటూ అండగా నిలిచే భార్యలు, కుటుంబ సభ్యుల సహకారం ఎంతో కీలకమని కొనియాడారు.

ఏఐ వచ్చినా అక్షరానికి ఉన్న విలువ చెరిగిపోదు.

ప్రస్తుత డిజిటల్ యుగంలో కృత్రిమ మేధ (ఏఐ) విస్తృతంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ మానవ భావోద్వేగాలను, అక్షరానికి ఉండే జీవాన్ని ఏఐ ఎప్పటికీ భర్తీ చేయలేదని సీపీ పేర్కొన్నారు. పుస్తక పఠనం, సాహిత్యం, రచనలకు ఎప్పటికీ ప్రత్యేక స్థానం ఉంటుందని స్పష్టం చేశారు.

ప్రముఖుల అభినందనలు.

ఈ కార్యక్రమంలో రచయిత తల్లిదండ్రులు రమణ, నర్సమ్మ, సతీమణి గీతాంజలి, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, సినీ గీత రచయిత మౌనశ్రీ మల్లిక్, యూపీఎస్సీ మెంటార్ ఎన్. రాజ్‌కుమార్, లిమ్కా బుక్ అవార్డు గ్రహీత రామ కోటేశ్వరరావు, డీసీపీ వెంకటలక్ష్మి, ప్రచురణ సంస్థ ఆన్వీక్షికి ప్రతినిధులు వెంకట్ సిద్ధారెడ్డి, మహీ తదితరులు పాల్గొన్నారు.

20 అడుగుల ఎత్తుతో కనువిందు చేస్తున్న భారీ 'రామ్ దర్బార్' నిర్మాణం- 'బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్' గుర్తింపు!



అయోధ్య:అయోధ్య దీపోత్సవం 2026 వేడుకల్లో భాగంగా అంతర్జాతీయ సైకత శిల్పి మధురేంద్ర కుమార్ ఒక చరిత్రాత్మక ఘనతను సాధించారు. సరయూ నది నుంచి సేకరించిన 220 టన్నుల ఇసుకను ఉపయోగించి 58 అడుగుల పొడవు, 20 అడుగుల ఎత్తుతో కూడిన భారీ 'రామ్ దర్బార్', రామమందిర నమూనా శిల్పాన్ని అత్యంత అద్భుతంగా తీర్చిదిద్దారు. ఉత్తర్?ప్రదేశ్ ప్రభుత్వం, రాష్ట్ర పర్యాటక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో అయోధ్యలోని సరయూ నదీ ఒడ్డున ఉన్న రామ్ కథా పార్క్‌లో ఈ శిల్పాన్ని నిర్మించారు. ప్రపంచ శాంతి, మానవత్వం, సౌభ్రాతృత్వం అనే సందేశాలను చాటిచెప్పే ఈ కళాఖండానికి 'బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'నుంచి అధికారిక గుర్తింపు లభించింది. ఈ కళాకృతిని రూపొందించడంలో మధురేంద్ర కుమార్?కు ఆయన బృందం కూడా సహాయపడింది.

ఏడు రోజుల పాటు నిరంతరాయంగా కొనసాగిన నిర్మాణ పనులు

అక్టోబర్ 30న ప్రారంభమైన ఈ శిల్ప నిర్మాణ పనులు ఏడు రోజుల పాటు నిరంతరాయంగా కొనసాగాయి. చివరికి నవంబర్ 7న పూర్తయ్యాయి. "రామ్ దర్బార్‌ను చిత్రిస్తూ నేను రూపొందించిన మొట్టమొదటి ఇసుక శిల్పం ఇది. ఈ తరహాలో ఇంత పొడవుగా ఇసుకతో నిర్మించడం ఇదే మొదటిసారి" అని మధురేంద్ర కుమార్? పేర్కొన్నారు. మరోవైపు, దీపోత్సవం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సీ.పీ. రాధాకృష్ణన్, గవర్నర్ ఆనందీబెన్ పటేల్, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఈ శిల్పాన్ని వీక్షించారు. ఈ చరిత్రాత్మక కళాఖండాన్ని అయోధ్య ఎప్పటికీ మరచిపోదని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కొనియాడారు. ప్రపంచ రికార్డు సాధించినందుకు మధురేంద్ర కుమార్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. మరోవైపు, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ సైతం ఈ అద్భుత కళా నైపుణ్యాన్ని చూసి 'చాలా బాగా చేశారు' అని ప్రశంసించారు.అక్టోబర్ 30న ఈ కళాఖండానికి సంబంధించిన సమాచారాన్ని 'బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్', 'గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్'కు సమర్పించారు కుమార్?. నవంబర్ 7న 'బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్' దీనిని ఈమెయిల్ ద్వారా ఆమోదించింది. ఈ ఘనత ×చీణ/2026/001810 రికార్డు నంబరు కింద అధికారికంగా నమోదు చేశారు. ఇందుకు సంబంధించి ఒక డిజిటల్ సర్టిఫికేట్ కూడా జారీ చేశారు. గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌తో గుర్తింపు ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. కాగా, అయోధ్యను ప్రపంచ పర్యాటక, సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు ఈ కళాఖండం నిదర్శనం అని చెప్పవచ్చు.

12కు పైగా ప్రపంచ రికార్డులను నెలకొల్పిన మధురేంద్ర కుమార్?

బిహార్‌లోని తూర్పు చంపారన్‌కు చెందిన మధురేంద్ర కుమార్, 25కు పైగా దేశాల్లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించి, 12కు పైగా ప్రపంచ రికార్డులను నెలకొల్పారు. ఇసుక, బొగ్గు బూడిద, ఆకులు, పండ్లు, కూరగాయలు, పునర్వినియోగ పదార్థాలను ఉపయోగించి వేలాది కళాఖండాలను సృష్టించిన ఈ కళాకారుడు, అమెరికా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ నుంచి ఇసుక కళలో గౌరవ డాక్టరేట్ కూడా అందుకున్నారు. ఆయన కళాఖండాలు ప్రధానంగా పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత, వ్యసన విముక్తి, ప్రపంచ శాంతి వంటి ఇతివృత్తాలపై దృష్టి సారిస్తాయి. అయోధ్యలోని ఈ అద్భుతమైన కళాఖండం, సాంస్కృతిక పునరుజ్జీవనం కోసం యోగి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను, రామ మందిరాన్ని కేంద్రంగా చేసుకున్న దాని అభివృద్ధి నమూనాని మరింత బలోపేతం చేసింది. కాగా, ఇటీవల జరిగిన దీపావళి వేడుకల్లో ఉత్తర్?ప్రదేశ్‌లోని అయోధ్య నగరం దీపాల వెలుగులతో ముస్తాబైంది. శనివారం రాత్రి అయోధ్య ధామ్ ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. సరయూ నదీ తీరాన ఉన్న 56 ఘాట్లలో ఏకంగా 30 లక్షలకుపైగా మట్టి ప్రమిదలను (దీపాలు) వెలిగించి, అత్యంత వైభవంగా 10వ దీపోత్సవ వేడుకల్ని నిర్వహించారు. దీప కాంతులతో వెలుగులీనుతూ అయోధ్య నగర ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవాన్ని, భక్తుల అపారమైన భక్తిశ్రద్ధలను కళ్లకు కట్టాయి.

జగన్నాథుడి సేవతో మహిళల ఆర్థిక స్వావలంబన- 11 మందితో మొదలై 400 మందికి ఉపాధి!



చేతిలో సూది, దారం, రంగు రంగుల వస్త్రాలు- కళ్లలో మాత్రం సొంత కష్టంతో కుటుంబాన్ని పోషించుకోవాలనే ఆశయం. ఒకప్పుడు ఇంటికే పరిమితమైన ఈ మహిళలు ఇప్పుడు తమ చేతివృత్తితో కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలుస్తున్నారు. ఒకరు జగన్నాథ మహాప్రభువు కిరీటాన్ని తయారు చేస్తుంటే, మరొకరు స్వామి వారి వస్త్రాలు (ఘాగ్రా), ఛత్రాలను (చందూవా) కుడుతున్నారు. ఇది కేవలం దారపు పోగులతో ముడిపడిన వస్త్రాలు మాత్రమే కాదు. వందలాది మంది మహిళల కలలు, పోరాటాలు, ఆత్మగౌరవం, స్వయం సమృద్ధికి నిదర్శనం. జగన్నాథ సేవే మార్గంగా ఒడిశాలోని ఖాంటాపాడ ప్రాంతానికి చెందిన మహిళలు ఇలా ఆర్థిక స్వావలంబన సాధించారు. ఒకప్పుడు కేవలం 11 మంది మహిళలతో ప్రారంభమైన చిన్న ప్రయత్నం, నేడు ఎడతెగని శ్రమతో వందలాది కుటుంబాలకు జీవనాధారంగా మారిపోయింది. బాలాసోర్ జిల్లా పరిధిలోని సుతాంగ్‌కు చెందిన బనదుర్గ స్వయం సహాయక సంఘం (ూఒ+) ఇప్పుడు మహిళా సాధికారతకు చక్కటి ఉదాహరణగా నిలుస్తోంది.11 మందితో మొదలై ప్రొడ్యూసర్ గ్రూప్ స్థాయికిభగవంతుడి (ఠాకూర్) సేవకు సంబంధించి ఏదైనా కొత్తగా చేయాలనే తపనతో 2010 సంవత్సరంలో కేవలం 11 మంది మహిళలు కలిసి ఈ సంస్థను ప్రారంభించారు. భగవంతుడి సేవకు అవసరమైన వస్తువుల్ని తామే తయారు చేయాలన్న ఆలోచనతోనే ఈ కుట్టు పని మొదలుపెట్టారు. తొలుత మహిళలు తమ సొంత పెట్టుబడితోనే జెండాలు, ఘాగ్రాలు, చందూవాలు (అలంకరణ వస్త్రాలు), జగన్నాథుని కిరీటాలు, హనుమంతుని వస్త్రాలు వంటివి తయారు చేయడం ప్రారంభించారు. తర్వాత ఖాంటాపాడ బ్యాంక్, ఇతర బ్యాంకుల నుంచి రుణాలు పొంది వ్యాపారాన్ని మరింత విస్తరించారు. సుమారు 3-4 ఏళ్ల కిందట ఈ సంఘం ప్రొడ్యూసర్ గ్రూప్ హోదాను పొందడంతో తయారీ సామర్థ్యం, వ్యాపార కార్యకలాపాలు పెరిగి ఉత్పత్తి, టర్నోవర్ మరింత పెరిగింది."2010లో కేవలం 11 మంది మహిళలతో ఠాకూర్ (దైవ) సేవ చేయాలనే తపనతో ఈ సంస్థను ప్రారంభించాం. సొంత డబ్బుతో మొదలుపెట్టి, తర్వాత బ్యాంక్ లోన్ల సహాయంతో వ్యాపారాన్ని మరింత విస్తరించాం. నేడు ప్రొడ్యూసర్ గ్రూప్‌గా రూపాంతరం చెంది, 400 మందికిపైగా మహిళలకు ఉపాధి కల్పిస్తున్నందుకు మాకెంతో గర్వంగా ఉంది."
– సులోచనా దాస్, గ్రూప్ ఎడిటర్ప్రస్తుతం బనదుర్గ ప్రొడ్యూసర్ గ్రూప్ ద్వారా 100 రకాలకుపైగా వస్తువులు తయారవుతున్నాయి. ఈ తయారయ్యే వస్తువుల్లో జగన్నాథుని వివిధ రకాల వస్త్రాలు, పూలదండలు, రాధా కృష్ణ, దండకాళి, అష్టగోపాలులు, హనుమాన్ అలంకరణ వస్త్రాలతో పాటు చందూవా, పుల్హారాలు, పతాకాలు వంటివి ఉన్నాయి. పెళ్లిళ్లకు అవసరమైన చున్నీలు, బాజుబంద్, కిరీటాలు వంటి అలంకరణ వస్తువుల్ని కూడా రూపొందిస్తున్నారు. ముఖ్యంగా జగన్నాథుని కిరీటాలు, చందూవాలు, జెండాలకు విపరీతమైన గిరాకీ ఉంది. ఒడిశాలోని కటక్, భువనేశ్వర్, సంబల్‌పూర్, రూర్కెలా, బరిపడా, భద్రక్, జాజ్‌పుర్, అంగుల్ జిల్లాలతో పాటుగా బెంగాల్‌కు కూడా ఇవి ఎగుమతి అవుతున్నాయి.

బిల్డర్లకు బానిసలుగా టౌన్‌ప్లానింగ్ అధికారులు? ప్రజల ఫిర్యాదులకు పాతరేస్తున్నారా?

- అక్రమ నిర్మాణాలకు అధికారులే రక్షకులా? సర్కిల్--57లో ఇదేం పాలన?
- బిల్డర్ జేబులో టౌన్‌ప్లానింగ్ శాఖ ఉందా? ఫిర్యాదులు క్లోజ్.. నిర్మాణాలు ఓపెన్!
- బిల్డర్ సేవలో అధికారులు.. ప్రజల సమస్యలు గాలికి!
- అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులే అడ్డుగా మారుతున్నారా?
- ఫిర్యాదులపై విచారణ వద్దు.. క్లోజింగ్ ఒక్కటే ముద్దా?
- బిల్డర్‌కు గ్రీన్‌సిగ్నల్.. ఫిర్యాదుదారుడికి రెడ్‌సిగ్నలా?
- టౌన్‌ప్లానింగ్ కార్యాలయంలో న్యాయం ఖరీదైందా? నిర్మాణదారులదే పైచేయా?
- అధికారుల తనిఖీలు డ్రామానా? ఫిర్యాదుల క్లోజింగ్ వెనుక అసలు కథేంటి?
- ప్రజల ఫిర్యాదులను పాతరేసి.. బిల్డర్ల నిర్మాణాలకు బాటలు వేస్తున్నారా?





కుత్బుల్లాపూర్, నవంబర్ 11 (పీపుల్స్ న్యూస్)

గాజులరామారం సర్కిల్--57 టౌన్‌ప్లానింగ్ విభాగంలో అసలు ఏం జరుగుతోంది? అక్రమ నిర్మాణాలపై ప్రజలు ఫిర్యాదులు చేస్తుంటే వాటిని క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు, ఫిర్యాదులను క్లోజ్ చేయడానికే పరిమితమవుతున్నారా? నిర్మాణదారుల ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తున్నారన్న అనుమానాలకు టౌన్‌ప్లానింగ్ విభాగం తావిస్తోందా? అన్న ప్రశ్నలు ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.ఉషోదయ కాలనీ, చిత్తారమ్మ ఆలయం సమీపంలో, ట్రెండ్స్ ఎదురుగా ఉన్న ప్లాట్లు 75, 76 వద్ద అక్రమ సెల్లార్, కమర్షియల్ భవన నిర్మాణాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నిర్మాణాలపై మై క్యూర్ ద్వారా ఫిర్యాదు చేసినప్పటికీ, టౌన్‌ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్ సరిత సేన్ సైట్ విజిట్ అనంతరం ఫిర్యాదును క్లోజ్ చేసినట్లు సమాచారం. అయితే నిర్మాణాలపై ఉన్న అభ్యంతరాలు పరిష్కారమయ్యాయా? అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు లేవని నిర్ధారించారా? అన్నది ఇప్పటికీ స్పష్టత రావాల్సి ఉంది.

బిల్డర్‌కు భరోసా.. ఫిర్యాదుదారుడికి నిరాశా?

ప్రజలు ఫిర్యాదు చేస్తే అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలి. కానీ ఫిర్యాదు క్లోజ్ చేసినంత మాత్ర ాన నిర్మాణం నిబంధనలకు అనుగుణంగా మారిపోతుందా? సైట్ విజిట్ అంటే నిర్మాణం వద్దకు వెళ్లి రావడమేనా? లేక అనుమతి పత్రాలు, ఆమోదిత ప్లాన్, సెల్లార్, సెట్‌బ్యాక్‌లు, పార్కింగ్ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించడమా?



సరిత సేన్ గారూ.. తనిఖీ నివేదిక ఎక్కడ?

మై క్యూర్ ఫిర్యాదును క్లోజ్ చేయడానికి ముందు ఏయే అంశాలను పరిశీలించారు? ప్లాట్లు 75, 76కు సంబంధించిన భవన నిర్మాణ అనుమతులను తనిఖీ చేశారా? ఆమోదిత ప్లాన్‌తో ప్రస్తుత నిర్మాణాన్ని పోల్చి చూశారా? సెల్లార్ నిర్మాణానికి అనుమతి ఉందా? కమర్షియల్ వినియోగానికి అనుమతులు ఉన్నాయా? ఉల్లంఘనలు లేవని నిర్ధారించడానికి ఆధారాలేమిటి?ఈ ప్రశ్నలకు సంబంధిత అధికారి స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉంది. తనిఖీ నివేదికను ప్రజలకు అందు బాటులో ఉంచాల్సిన బాధ్యత లేదా? ఫిర్యాదును క్లోజ్ చేయడమే లక్ష్యమా? లేక సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడమా?

నిర్మాణదారులకే టౌన్‌ప్లానింగ్ శాఖ అండనా?

సామాన్యులు ఇంటి నిర్మాణం చేపడితే అనుమతుల పేరుతో నిబంధనలు గుర్తుచేసే అధికారులు, భారీ కమర్షియల్ నిర్మాణాల విషయంలోనూ అదే స్థాయిలో పారదర్శకత చూపించాలి. నిర్మాణదారుడి ప్రభావం ఎంత ఉన్నా చట్టం ముందు అందరూ సమానమే. బిల్డర్ నిర్మాణం కొనసాగుతుంటే అధికారులు మౌనంగా ఉండాల్సిన అవసరం ఏమిటి? ప్రజల ఫిర్యాదులను ఎందుకు తేలికగా తీసుకుంటున్నారన్న ప్రశ్నలకు సమాధానం రావాలి.

ఫిర్యాదు క్లోజ్.. అక్రమ నిర్మాణాలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లేనా?

ఆన్‌లైన్‌లో ఫిర్యాదు క్లోజ్ అయినంత మాత్రాన నిర్మాణం చట్టబద్ధ మైనట్లు కాదు. నిర్మాణ అనుమతులు, క్షేత్రస్థాయి పరిస్థితులు సరిపోలకపోతే చట్టప్రకారం చర్యలు తీసుకోవాల్సిందే. ఫిర్యాదు పరిష్కారంలో పారదర్శకత లేకపోతే అధికారుల పనితీరుపై ప్రజల్లో అనుమానాలు మరింత పెరుగుతాయి.

ముడుపుల ఆరోపణలపైనా విచారణ జరగాలి!

నిర్మాణదారులకు అధికారులు కొమ్ముకాస్తున్నారన్న అనుమానాలు, స్థానికంగా వినిపిస్తున్న ఇతర ఆరోపణలపై కూడా ఉన్నతాధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలి. ఎలాంటి ఆధారాలు లేకుండా ఎవరినీ దోషిగా ప్రకటించలేం. అయితే ఆరోపణలు వచ్చినప్పుడు వాటిని పరిశీలించి వాస్తవాలను వెల్లడించడం అధికారుల బాధ్యత.

ఉన్నతాధికారులారా.. సర్కిల్--57లో ఏం జరుగుతోందో తేల్చండి!

ఉషోదయ కాలనీలోని ప్లాట్లు 75, 76 నిర్మాణాలపై స్వతంత్ర అధికారుల బృందంతో మరోసారి తనిఖీ చేయించాలి. మై క్యూర్ ఫిర్యాదుపై సరిత సేన్ నిర్వహించిన సైట్ విజిట్ నివేదికను పరిశీలించాలి. ఫిర్యాదును క్లోజ్ చేయడానికి పేర్కొన్న కారణాలను వెల్లడించాలి. నిర్మాణాల్లో ఉల్లంఘనలు ఉన్నట్లు నిర్ధారణ అయితే బిల్డర్‌పై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం జరిగినట్లు తేలితే సంబంధిత అధికారులపై కూడా శాఖాపరమైన చర్యలు చేపట్టాలి.

పేదలకు సీఎం సహాయనిధి వరం

16 మంది లబ్ధిదారులకు రూ.7.53 లక్షల చెక్కులు పంపిణీ చేసిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

హనుమకొండ, నవంబర్ 11

ఎద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎం సహాయనిధి () ఆపన్నహస్తంగా నిలుస్తోందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. ఆర్థిక ఇబ్బందులతో వైద్య ఖర్చులు భరించలేని నిరుపేదలకు ఈ పథకం ఎంతో భరోసా కల్పిస్తోందని పేర్కొన్నారు.బుధవారం హనుమకొండలోని కనకదుర్గ కాలనీలో ఉన్న ఎంపీ క్యాంపు కార్యాలయంలో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గానికి చెందిన 16 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.7,53,000 విలువైన సీఎం సహాయనిధి చెక్కులను ఎంపీ డాక్టర్ కడియం కావ్య పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ వైద్య ఖర్చులు భరించలేని పేద కుటుంబాలకు సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటోందన్నారు. అర్హులైన బాధితులు సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకుంటే నిబంధనల ప్రకారం ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందని తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమం, ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తోందని అన్నారు. ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు అండగా నిలవడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య కోరారు.





నిశ్చితార్థం చేసుకున్న అర్ష్‌దీప్ సింగ్

● న్యూజిలాండ్‌లో ప్రేయసి సమ్రీన్ కౌర్‌కు ఉంగరం తొడిగిన టీమిండియా యువ పేసర్

ఇంటర్నెట్ డెస్క్: టీమిండియా యువ ఫాస్ట్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ తన జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించాడు. తన ప్రేయసి, నటి సమ్రీన్ కౌర్‌తో న్యూజిలాండ్‌లో నిశ్చితార్థం చేసుకున్నాడు. బుధవారం (నవంబర్ 11) జరిగిన ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలను సమ్రీన్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పంచుకుంది.ఈ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. అర్ష్‌దీప్ తనకు ఉంగరం తొడిగిన ప్రత్యేక క్షణాలను సమ్రీన్ అభిమానులతో పంచుకోవడంతో నెటిజన్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ జంటకు పెద్ద సంఖ్యలో శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.ఇటీవలే అర్ష్‌దీప్ తన ప్రేమ బంధాన్ని బహిరంగంగా వెల్లడించాడు. ఇప్పుడు నిశ్చితార్థంతో తమ బంధాన్ని మరో అడుగు ముందుకు తీసుకెళ్లాడు. అర్ష్‌దీప్ సహచర క్రికెటర్లు గుర్నూర్ బ్రార్, నమన్ ధీర్ తదితరులు కూడా ఈ జంటకు అభినందనలు తెలిపారు.క్రికెట్‌లో తన బౌలింగ్‌తో అభిమానులను ఆకట్టుకుంటున్న అర్ష్‌దీప్.. వ్యక్తిగత జీవితంలోనూ కొత్త ప్రయాణానికి శ్రీకారం చుట్టడంతో అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రపంచ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో నీరజ్‌కు కాంస్యం

2028 లాస్‌ఏంజెలిస్ ఒలింపిక్స్‌కు అర్హత.. భారత్‌కు రెండో కోటా

దోహా, నవంబర్ 11: భారత షూటర్ నీరజ్ కుమార్ అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటాడు. ఖతార్‌లోని దోహాలో జరుగుతున్న ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ విభాగంలో కాంస్య పతకం సాధించాడు. ఈ విజయంతో 2028లో అమెరికాలోని లాస్‌ఏంజెలిస్‌లో జరగనున్న ఒలింపిక్స్‌కు అర్హత సాధించాడు. ఈ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు ఇది రెండో ఒలింపిక్ కోటా కావడం విశేషం.**ఫైనల్లో మూడో స్థానం**ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్లో నీరజ్ కుమార్ 346.5 పాయింట్లు సాధించి మూడో స్థానంలో నిలిచాడు. వ్యక్తిగత తటస్థ అథ్లెట్ల తరఫున బరిలోకి దిగిన దిమిత్రి పిమెనోవ్ 362.8 పాయింట్లతో స్వర్ణ పతకం సాధించడంతోపాటు జూనియర్ ప్రపంచ రికార్డును నెలకొల్పాడు. స్లోవేకియాకు చెందిన పాట్రిక్ జానీ 357.2 పాయింట్లతో రజత పతకాన్ని దక్కించుకున్నాడు.నీరజ్ చివరి దశ వరకు రజత పతక పోటీలో ఉన్నప్పటికీ కీలక సమయంలో 9.4 పాయింట్ల షాట్ కారణంగా రెండో స్థానాన్ని కోల్పోయాడు. అయినప్పటికీ నిలకడైన ప్రదర్శనతో కాంస్య పతకాన్ని సాధించి ఒలింపిక్స్ కోటాను ఖాయం చేసుకున్నాడు.**క్వాలిఫికేషన్‌లో అగ్రస్థానం**ఫైనల్‌కు ముందు జరిగిన అర్హత పోటీల్లో నీరజ్ అద్భుత ప్రదర్శన చేశాడు. మొత్తం 591 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచాడు. మరో భారత షూటర్ ఐశ్వర్య ప్రతాప్ సింగ్ తోమర్ 586 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించాడు. అయితే ఫైనల్లో ఐశ్వర్య 323.7 పాయింట్లతో ఐదో స్థానానికి పరిమితమయ్యాడు.**జట్టు విభాగంలోనూ కాంస్యం**పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ జట్టు విభాగంలోనూ భారత్ కాంస్య పతకాన్ని సాధించింది. నీరజ్ కుమార్, ఐశ్వర్య ప్రతాప్ సింగ్ తోమర్, అఖిల్ షియోరన్ కలిపి 1,751 పాయింట్లు సాధించారు. చెక్ రిపబ్లిక్ 1,754 పాయింట్లతో స్వర్ణం, నార్వే 1,752 పాయింట్లతో రజతం గెలుచుకున్నాయి. ఒక్క పాయింట్ తేడాతో భారత్ రజతాన్ని కోల్పోయింది.**భారత్‌కు రెండో ఒలింపిక్ కోటా**ఈ ఛాంపియన్‌షిప్‌లో భారత షూటింగ్ జట్టుకు ఇది రెండో ఒలింపిక్ కోటా. అంతకుముందు పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో జయపాల్ మాల్వియా రజత పతకం సాధించి తొలి కోటాను అందించాడు. తాజాగా నీరజ్ కుమార్ సాధించిన కాంస్యంతో భారత్ ఖాతాలో మరో కోటా చేరింది. ప్రపంచ స్థాయి పోటీల్లో వ్యక్తిగత పతకం



సాధించాలన్న తన లక్ష్యం నెరవేరిందని నీరజ్ ఆనందం వ్యక్తం చేశాడు. ఈ విజయంతో భారత షూటింగ్ జట్టుకు ఒలింపిక్స్ సన్నాహాల్లో మరింత ఉత్సాహం లభించింది.

ముంబై ఇండియన్స్ కెప్టెన్సీపై ఉత్కంఠ!

● రోహిత్ శర్మకు మళ్లీ పగ్గాలు అప్పగిస్తారా?

● తొందరపడి నిర్ణయం తీసుకోబోమన్న ఫ్రాంచైజీ



ఇంటర్నెట్ డెస్క్, నవంబర్ 11: ఐపీఎల్-2027 సీజన్‌కు ముందు ముంబై ఇండియన్స్ జట్టులో కీలక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా పంజాబ్ కింగ్స్ జట్టులోకి వెళ్లిపోవడంతో ముంబై ఇండియన్స్ తదుపరి కెప్టెన్ ఎవరనే అంశంపై క్రికెట్ వర్గాల్లో చర్చ మొదలైంది. రెండు సీజన్లుగా జట్టుకు నాయకత్వం వహించిన హార్దిక్ జట్టును వీడటంతో ఇప్పుడు ఆ బాధ్యతలు ఎవరికి అప్పగిస్తారన్న ఆసక్తి అభిమానుల్లో నెలకొంది.**రోహిత్ శర్మ పేరుపై భారీ చర్చ** హార్దిక్ పాండ్యా స్థానంలో ముంబై ఇండియన్స్ మాజీ కెప్టెన్ రోహిత్ శర్మకు తిరిగి జట్టు పగ్గాలు అప్పగిస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది. రోహిత్ నాయకత్వంలో ముంబై ఇండియన్స్ ఐదుసార్లు ఐపీఎల్ టైటిల్ సాధించింది. జట్టుతో అతడికి ఉన్న అనుబంధం, నాయకత్వ అనుభవం నేపథ్యంలో మరోసారి కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందని అభిమానులు భావిస్తున్నారు.అయితే రోహిత్ ఒక్కడే కెప్టెన్సీ రేసులో లేడు. భారత టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, యువ ఆటగాడు తిలక్ వర్మ పేర్లు కూడా వినిపిస్తున్నాయి. వీరిలో ఎవరికి అవకాశం దక్కుతుందన్నది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.**కెప్టెన్సీపై ముంబై ఇండియన్స్ స్పందన**ఈ పరిణామాల నేపథ్యంలో ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ కెప్టెన్సీ అంశంపై స్పందించింది. ఇప్పుడే తొందరపడి ఎలాంటి నిర్ణయాలు తీసుకోబోమని స్పష్టం చేసింది. రాబోయే సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని అన్ని అంశాలను పరిశీలించిన తర్వాతే కెప్టెన్ ఎంపికపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించింది. సరైన సమయంలో జట్టు కెప్టెన్సీపై అధికారిక ప్రకటన చేస్తామని తెలిపింది.ఫ్రాంచైజీ ప్రకటనతో రోహిత్ శర్మకు మళ్లీ నాయకత్వ బాధ్యతలు దక్కుతాయా? లేక మరో ఆటగాడికి అవకాశం కల్పిస్తారా? అన్న ఉత్కంఠ మరింత పెరిగింది. ప్రస్తుతానికి కెప్టెన్ ఎంపికపై ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని ముంబై యాజమాన్యం సంకేతాలిచ్చింది.**హార్దిక్ స్థానంలో అర్ష్‌దీప్ సింగ్**ఆటగాళ్ల బదిలీల్లో భాగంగా హార్దిక్ పాండ్యా పంజాబ్ కింగ్స్ జట్టుకు వెళ్లగా, భారత యువ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ ముంబై ఇండియన్స్ జట్టులోకి వచ్చాడు. ఈ మార్పు కూడా జట్టు కూర్పుపై చర్చకు దారితీసింది. కొత్త సీజన్‌లో జట్టు వ్యూహాలు, ఆటగాళ్ల పాత్రలు ఎలా ఉండబోతున్నాయన్నది ఆసక్తికరంగా మారింది.**రిటెన్షన్, మినీ వేలంపై ఆసక్తి**నవంబర్ 17న ఆటగాళ్ల రిటెన్షన్ గడువు ముగియనుంది. అనంతరం డిసెంబర్ 16న గోవాలో ఐపీఎల్ మినీ వేలం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ముంబై ఇండియన్స్ జట్టు కూర్పు, ఆటగాళ్ల ఎంపిక, కెప్టెన్సీ నిర్ణయం కీలకంగా మారాయి. వేలానికి ముందే కెప్టెన్ విషయంలో స్పష్టత వస్తుందా? లేక వేలం తర్వాత ప్రకటిస్తారా? అన్నది వేచి చూడాల్సి ఉంది.మొత్తానికి హార్దిక్ పాండ్యా జట్టును వీడటంతో ముంబై ఇండియన్స్ నాయకత్వ బాధ్యతలపై కొత్త చర్చ మొదలైంది.

చిన్న వయసులోనే కోహ్లీని ఇంటర్వ్యూ చేసిన ఆర్యవీర్ సెహ్వాగ్!

- తొమ్మిదేళ్ల నాటి వీడియో మళ్లీ వైరల్.. యువ క్రికెటర్‌కు కోహ్లీ ఇచ్చిన విజయ రహస్యం

న్యూఢిల్లీ, నవంబర్ 11: భారత మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ తనయుడు ఆర్యవీర్ సెహ్వాగ్ ప్రస్తుతం అండర్-19 ఆసియా కప్‌లో తన బ్యాటింగ్‌తో వార్తల్లో నిలుస్తున్నాడు. యూఏఈతో జరిగిన మ్యాచ్‌లో అద్భుతమైన 160 పరుగుల ఇన్నింగ్స్ ఆడిన అతడి పేరు ఒక్కసారిగా క్రికెట్ అభిమానుల నోట వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఆర్యవీర్‌కు సంబంధించిన తొమ్మిదేళ్ల క్రితం నాటి ఓ వీడియో సామాజిక మాధ్యమాల్లో మళ్లీ వైరల్‌గా మారింది. చిన్న వయసులోనే టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీని ఇంటర్వ్యూ చేసిన ఆ వీడియో నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటోంది.**2017లో కోహ్లీతో ప్రత్యేక ఇంటర్వ్యూ**2017లో స్టార్ స్పోర్ట్స్ నిర్వహించిన ఓ కార్యక్రమంలో అప్పటి టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీని చిన్నారి ఆర్యవీర్ ఇంటర్వ్యూ చేశాడు. అప్పటికి అతడి వయసు సుమారు తొమ్మిదేళ్లు. చేతిలో మైక్ పట్టుకుని ఎంతో ఆసక్తిగా కోహ్లీని ప్రశ్నలు అడిగాడు. మూడు ఫార్మాట్లలోనూ భారత జట్టుకు నాయకత్వం వహిస్తున్న కోహ్లీతో ఆ చిన్నారి జరిపిన సంభాషణ అప్పట్లోనూ అభిమానులను ఆకట్టుకుంది. తాజాగా ఆర్యవీర్ అద్భుత ఇన్నింగ్స్ ఆడటంతో ఈ పాత వీడియో మరోసారి తెరపైకి వచ్చింది.**తండ్రితో కోహ్లీ తొలి పరిచయం ఎలా?**ఇంటర్వ్యూలో ఆర్యవీర్ అడిగిన ప్రశ్నల్లో ఒకటి ఆసక్తికరంగా నిలిచింది. తన తండ్రి వీరేంద్ర సెహ్వాగ్‌తో కోహ్లీకి తొలిసారి పరిచయం ఎలా ఏర్పడిందని ప్రశ్నించాడు. దీనికి కోహ్లీ చిరునవ్వుతో సమాధానమిచ్చాడు. ఢిల్లీలో తనకు, సెహ్వాగ్‌కు పరిచయమున్న ఓ రాష్ట్రస్థాయి కోచ్ ద్వారా ఈ పరిచయం ఏర్పడిందని వివరించాడు. అండర్-17 క్రికెట్‌లో తాను తొలిసారి డబుల్ సెంచరీ సాధించిన తర్వాత ఓ కార్యక్రమంలో సెహ్వాగ్‌ను కలిసినట్లు గుర్తుచేసుకున్నాడు. ఆ రోజు జరిగిన పరిచయం



తనకు ఇప్పటికీ గుర్తుందని తెలిపాడు.**ఆశిష్ నెహ్రా ఫొటోపై ప్రశ్న** అదే ఇంటర్వ్యూలో ఆర్యవీర్ మరో ఆసక్తికరమైన ప్రశ్నను కోహ్లీ ముందు ఉంచాడు. చిన్న వయసులో ఆశిష్ నెహ్రా తనకు ట్రోఫీ అందిస్తున్న ప్రసిద్ధ ఫొటోను ప్రస్తావించాడు. భవిష్యత్తులో నెహ్రా తన కెప్టెన్సీలోనే ఆడతాడని అప్పట్లో ఊహించారా? అన్న తరహాలో ప్రశ్నించాడు. దీనిపై కోహ్లీ తన అనుభవాన్ని పంచుకుంటూ యువతకు విలువైన సందేశం ఇచ్చాడు.**పెద్ద కలలు కనాలి.. నమ్మకంతో ముందుకు సాగాలి**జీవితంలో ఉన్నత లక్ష్యాలను పెట్టుకోవాలని, వాటిని సాధించగలననే నమ్మకంతో ముందుకు సాగాలని కోహ్లీ ఆర్యవీర్‌కు సూచించాడు. పెద్దగా ఆలోచించాలని, ఏదైనా సాధించగలననే ఆత్మవిశ్వాసం కలిగి ఉండాలని చెప్పాడు. కోహ్లీ ఇచ్చిన ఈ సందేశం ప్రస్తుతం వీడియోలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. చిన్ననాటి ఆర్యవీర్‌కు ఇచ్చిన ఈ స్ఫూర్తిదాయక మాటలు ఇప్పుడు అతడు క్రికెట్‌లో రాణిస్తున్న సమయంలో మళ్లీ చర్చకు వచ్చాయి.**యూఏఈపై ఆర్యవీర్ అద్భుత ఇన్నింగ్స్**ఇటీవల అండర్-19 ఆసియా కప్‌లో యూఏఈతో జరిగిన మ్యాచ్‌లో ఆర్యవీర్ తన బ్యాటింగ్ ప్రతిభను చాటుకున్నాడు. 168 బంతులు ఎదుర్కొని 17 ఫోర్లు, ఏడు సిక్సర్లతో 160 పరుగులు సాధించాడు. మరో ఓపెనర్ వీకే వినీత్‌తో కలిసి 193 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. వీరిద్దరి ప్రదర్శనతో భారత్ నిర్ణీత ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 309 పరుగులు చేసింది. అనంతరం యూఏఈని ఓడించి 70 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ గెలుపుతో భారత జట్టు సెమీఫైనల్‌కు చేరుకుంది.ఈ ఇన్నింగ్స్ ఆర్యవీర్ కెరీర్‌లో తొలి యూత్ వన్డే శతకంగా నిలిచింది. అంతకుముందు నేపాల్‌తో జరిగిన మ్యాచ్‌లోనూ అతడు అజేయంగా 72 పరుగులు సాధించాడు. వరుసగా మెరుగైన ప్రదర్శనలతో తనలోని ప్రతిభను చాటుకుంటున్నాడు.**కోహ్లీ అటతీరు అంటే ఆర్యవీర్‌కు అభిమానం**తన తండ్రి వీరేంద్ర సెహ్వాగ్ దూకుడైన బ్యాటింగ్ శైలితో పాటు విరాట్ కోహ్లీ ఆటతీరుపై కూడా ఆర్యవీర్‌కు ప్రత్యేక అభిమానం ఉంది. కోహ్లీ బ్యాటింగ్‌లోని కొన్ని అంశాలను తన ఆటలోనూ అనుసరించాలని కోరుకుంటున్నట్లు గతంలో వెల్లడించాడు. కేవలం తండ్రి శైలిలోనే కాకుండా కోహ్లీ తరహాలోనూ ఆడాలని ఉందని తెలిపాడు. యూఏఈపై ఆడిన 160 పరుగుల ఇన్నింగ్స్‌తో ఆర్యవీర్ తనదైన గుర్తింపు తెచ్చుకునే దిశగా అడుగులు వేస్తున్నాడు.తొమ్మిదేళ్ల క్రితం కోహ్లీని ప్రశ్నలు అడిగిన చిన్నారి.. ఇప్పుడు భారత అండర్-19 జట్టులో కీలక ఆటగాడిగా ఎదుగుతుండటంపై అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అప్పట్లో కోహ్లీ ఇచ్చిన సలహాలను గుర్తుచేసుకుంటూ ఈ వీడియోను విస్తృతంగా పంచుకుంటున్నారు. రాబోయే మ్యాచ్‌ల్లో నూ ఆర్యవీర్ ఎలా రాణిస్తాడన్న ఆసక్తి నెలకొంది.

పంజాబ్ జట్టులోకి హార్దిక్ పాండ్యా.. శ్రేయస్‌కు మద్దతుగా సందేశం!

- నా కెప్టెన్ శ్రేయస్.. నా కోచ్ రికీ పాంటింగ్..

పంజాబ్ జట్టులో కొత్త ప్రయాణంపై హార్దిక్ స్పందన

స్పోర్ట్స్ డెస్క్, నవంబర్ 11: ఐపీఎల్-2027 సీజన్‌కు ముందు భారత స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా కీలక జట్టు మార్పుతో వార్తల్లో నిలిచాడు. ముంబై ఇండియన్స్ నుంచి పంజాబ్ కింగ్స్ జట్టులోకి మారిన అతడు.. కొత్త జట్టులో తన పాత్రపై సామాజిక మాధ్యమాల వేదికగా స్పందించాడు. పంజాబ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, ప్రధాన కోచ్ రికీ పాంటింగ్‌కు మద్దతు ప్రకటిస్తూ చేసిన పోస్టు క్రికెట్ అభిమానుల దృష్టిని ఆకర్షించింది.**శ్రేయస్ నాయకత్వంలో ఆడేందుకు సిద్ధం**పంజాబ్ కింగ్స్‌లో చేరిన అనంతరం హార్దిక్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ప్రత్యేక సందేశాన్ని పంచుకున్నాడు. “సత్ శ్రీ అకాల్.. నా కెప్టెన్ శ్రేయస్.. నా కోచ్ రికీ.. నా జట్టు.. యావత్ పంజాబ్. మీకు అండగా నేను ఉంటాను” అంటూ పేర్కొన్నాడు. ఈ సందేశం ద్వారా శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలో ఆడేందుకు తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశాడు. గతంలో కెప్టెన్‌గా వ్యవహరించిన హార్దిక్.. కొత్త జట్టులో శ్రేయస్ నాయకత్వానికి మద్దతు ప్రకటించడం



ఆసక్తికరంగా మారింది.**భారీ ట్రేడింగ్ ఒప్పందం**ఐపీఎల్ చరిత్రలో కీలక ఆటగాళ్ల బదిలీల్లో ఒకటిగా నిలిచే ఈ ఒప్పందంలో భాగంగా హార్దిక్ పాండ్యా ముంబై ఇండియన్స్ నుంచి పంజాబ్ కింగ్స్‌కు మారాడు. ప్రతిగా పంజాబ్ జట్టు స్టార్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌ను ముంబై ఇండియన్స్‌కు పంపించింది. ఈ మార్పును ఐపీఎల్ అధికారికంగా కూడా ధ్రువీకరించింది. హార్దిక్ పంజాబ్ జట్టులో రూ.18 కోట్ల పారితోషికంతో కొనసాగనున్నాడు. అర్ష్‌దీప్ సింగ్ కూడా తన ప్రస్తుత రూ.18 కోట్ల పారితోషికంతోనే ముంబై జట్టులోకి వెళ్లాడు.**ముంబైతో రెండో విడత ప్రయాణానికి ముగింపు**హార్దిక్ పాండ్యా 2015లో తొలిసారి ముంబై ఇండియన్స్ జట్టులోకి వచ్చాడు. తన ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. 2015, 2017, 2019, 2020 సీజన్లలో ముంబై టైటిళ్లు సాధించిన జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. ఏడు సీజన్ల పాటు ముంబై తరఫున ఆడిన అనంతరం 2022లో గుజరాత్ టైటాన్స్‌కు మారాడు. ఆ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తూ తొలి సీజన్‌లోనే టైటిల్ అందించాడు. 2023లోనూ గుజరాత్‌ను ఫైనల్‌కు చేర్చాడు.

శర్వానంద్ 'భోగి' సినిమా విడుదల వాయిదా



యంగ్ హీరో శర్వానంద్ కథానాయకుడిగా, దర్శకుడు సంపత్ నంది కాంబినేషన్‌లో రూపొందుతున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'భోగి' విడుదల వాయిదా పడింది. ఈ మేరకు చిత్ర నిర్మాణ సంస్థ శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బుధవారం సోషల్ మీడియా వేదికగా అధికారికంగా ప్రకటన విడుదల చేసింది. అనుకోని కారణాల వల్ల సినిమా విడుదలను వాయిదా వేయాల్సి వచ్చిందని, త్వరలోనే సరికొత్త విడుదల తేదీని ప్రకటిస్తామని వెల్లడించింది.ఈ మేరకు చిత్రబృందం ఒక ప్రకటన విడుదల చేస్తూ.. "'భోగి' మా అందరికీ ఎంతో ప్రత్యేకమైన ప్రాజెక్ట్. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా, అంకితభావంతో, ప్యాషన్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. ప్రేక్షకులకు థియేటర్లలో ఒక గొప్ప అనుభూతిని అందించాలనే సంకల్పంతో మొదటి నుంచీ పనిచేస్తున్నాం. అయితే కొన్ని ఊహించని కారణాల వల్ల సినిమా విడుదలను వాయిదా వేస్తున్నాం. విడుదల విషయంలో సామాజిక మాధ్యమాల్లో వచ్చే ఎలాంటి పుకార్లను, ఊహాగానాలను ఎవరూ నమ్మవద్దు. త్వరలోనే కొత్త విడుదల తేదీని అధికారికంగా ప్రకటిస్తాం" అని స్పష్టం చేసింది.ఈ ప్రణాళిక మార్పు వల్ల కలిగిన అసౌకర్యానికి విచారం వ్యక్తం చేసిన నిర్మాతలు, చిత్రాన్ని మరింత ఉన్నతంగా ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు తమకు ప్రేక్షకుల మద్దతు, సహనం అవసరమని కోరారు. ప్రేక్షకులు ఎదురుచూసే సమయానికి తగిన పూర్తి న్యాయం చేస్తామని మేకర్స్ హామీ ఇచ్చారు. వాస్తవానికి ఈ సినిమాను రేపు (నవంబర్ 12న) ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల చేయాలని గతంలో నిర్ణయించారు.ఈ చిత్రంలో శర్వానంద్ 'గంగ' అనే పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన పాత్ర వివరాలు ఇప్పటికే సినీ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించాయి. ఈ సినిమాలో అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయతి హీరోయిన్లుగా నటిస్తున్నారు. 1960ల కాలం నాటి నేపథ్యంలో, తెలంగాణ మరియు మహారాష్ట్ర సరిహద్దుల్లోని ఒక ఊహాజనిత గ్రామంలో జరిగే కథాంశంతో ఈ పీరియడ్ యాక్షన్ డ్రామాను దర్శకుడు సంపత్ నంది తెరకెక్కిస్తున్నారు.సాంకేతిక విభాగంలో ప్రతిభావంతులైన సాంకేతిక నిపుణులు పనిచేస్తున్నారు. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తుండగా, కిశోర్ కుమార్ అరోకియా సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కిరణ్ కుమార్ మన్నె ప్రొడక్షన్ డిజైనర్‌గా వ్యవహరిస్తున్నారు. పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా రూపుదిద్దుకుంటున్న 'భోగి' చిత్రాన్ని తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు

ప్రియుడ్ని పెళ్లాడిన 'ఇరుముడి' హీరోయిన్ ప్రియా భవానీ శంకర్



ప్రముఖ నటి ప్రియా భవానీ శంకర్ వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. తన ప్రియుడు రాజ్ వేల్‌ను ఆమె పెళ్లాడారు. నేడు (నవంబర్ 11న) ఉదయం చెన్నైలో వీరి వివాహం అత్యంత నిరాడంబరంగా, సంప్రదాయబద్ధంగా జరిగింది. సినిమా పరిశ్రమలో సాధారణంగా కనిపించే ఆర్భాటాలు, డెస్టినేషన్ వెడ్డింగ్స్ వంటి వేడుకలకు దూరంగా ఉంటూ, అత్యంత సాదాసీదాగా ఈ శుభకార్యాన్ని నిర్వహించారు.
ఈ పెళ్లి వేడుకలో ప్రియా భవానీ శంకర్ సాంప్రదాయ ఎరుపు రంగు చీరలో మెరిసిపోగా, వరుడు రాజ్ వేల్ తెల్లటి పంచెకట్టులో కనిపించారు. వివాహానికి ఇరు కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహిత మిత్రులు మాత్రమే హాజరయ్యారు. వేడుకకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ఎలాంటి హంగులు లేకుండా ఇంత సింపుల్‌గా వివాహం చేసుకోవడంపై నెటిజన్లు, అభిమానులు నూతన దంపతులను ప్రశంసిస్తూ శుభాకాంక్షలు తెలుపుతున్నారు.
ప్రియా భవానీ శంకర్, రాజ్ వేల్ ఇద్దరూ కాలేజీ రోజుల్లో క్లాస్‌మేట్స్. అప్పటి నుంచే వీరి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. దాదాపు 10 ఏళ్లుగా వీరి బంధం కొనసాగుతోంది. ఈ విషయాన్ని ప్రియ ఎప్పుడూ దాచలేదు. గతంలో పలు ఇంటర్వ్యూలు, సోషల్ మీడియా పోస్టుల ద్వారా తమ ప్రేమను ధ్రువీకరించారు. వీరిద్దరూ కలిసి ఇప్పటికే ఒక ఇంటిని కూడా కొనుగోలు చేశారు. ఇరు కుటుంబాల పెద్దల అంగీకారంతో ఇప్పుడు అధికారికంగా ఒక్కటయ్యారు.
న్యూస్ రీడర్‌గా కెరీర్ ప్రారంభించిన ప్రియా భవానీ శంకర్, ఆ తర్వాత బుల్లితెర సీరియళ్ల ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. 2017లో 'మేయాద మాన్' చిత్రంతో తమిళ వెండితెరకు పరిచయమై, పలు విజయవంతమైన సినిమాల్లో నటించారు. తెలుగులో 'కల్యాణం కమనీయం', 'భీమా', 'జీబ్రా' చిత్రాల్లో నటించిన ఆమె, కమల్ హాసన్ 'భారతీయుడు 2'తో పాటు నాగచైతన్య 'దూత' వెబ్ సిరీస్‌లోనూ మెప్పించారు. ఇటీవల విడుదలైన 'ఇరుముడి' చిత్రం ఘన విజయం సాధించి, తెలుగు ప్రేక్షకుల నుంచి ఆమెకు విశేష ఆదరణ దక్కింది. ప్రస్తుతం 'డిమాంటీ కాలనీ' ప్రాజెక్టులతో పాటు పలు క్రేజీ చిత్రాల్లో ఆమె నటిస్తున్నారు. వివాహ జీవితంలోకి అడుగుపెట్టిన ప్రియా భవానీ శంకర్, రాజ్ వేల్ దంపతులకు సినీ ప్రముఖులు, అభిమానులు సోషల్ మీడియా ద్వారా శుభాకాంక్షలు వెల్లువెత్తిస్తున్నారు.

టాక్సిక్' చిత్రంలో రొమాంటిక్ సీన్స్.. కియారా అద్వానీకి భర్త సిద్ధార్థ్ మద్దతు



రాకింగ్ స్టార్ యశ్ కథానాయకుడిగా తెరకెక్కిన పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్'లో కొన్ని సన్నివేశాలపై బాలీవుడ్ నటి కియారా అద్వానీ సోషల్ మీడియా వేదికగా విమర్శలను ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆమె భర్త, నటుడు సిద్ధార్థ్ మల్హోత్రా ఆమెకు అండగా నిలిచారు.దర్శకురాలు గీతు మోహన్‌దాస్ రూపొందించిన ఈ సినిమాలో కియారా 'నాదియా' అనే సర్కస్ కళాకారిణి పాత్రను పోషించారు. సినిమాలోని కొన్ని సన్నిహిత సన్నివేశాలను ఉద్దేశించి కొందరు నెటిజన్లు ఆమెపై ట్రోలింగ్ చేశారు. వివాహం తర్వాత ఇలాంటి పాత్రలు చేయడంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ పోస్టులు పెట్టారు.
ఈ ట్రోలింగ్‌పై సిద్ధార్థ్ మల్హోత్రా సానుకూలంగా స్పందిస్తూ భార్యకు మద్దతు పలికారట. ఈ విషయాన్ని కియారా స్వయంగా వెల్లడించారు. విమర్శలు చేసేవారికి ఇతరుల వ్యక్తిగత జీవితం తెలియదని... విమర్శలను పట్టించుకోవద్దని సిద్ధార్థ్ చెప్పారట. ఇలాంటి వ్యాఖ్యలను పట్టించుకుని మానసిక ప్రశాంతతను కోల్పోవద్దని సూచించారట. మరోవైపు, తోటి నటి హుమా ఖురేషి కూడా ఈ వ్యవహారంపై స్పందిస్తూ, సినీ పరిశ్రమలో మహిళా నటుల పట్ల చూపే ద్వంద్వ ప్రమాణాలు సరికావని ట్రోలింగ్‌ను తీవ్రంగా ఖండించారు. వృత్తిపరమైన నటనను, వ్యక్తిగత జీవితాన్ని వేరుగా చూడాలని పలువురు సినీ విశ్లేషకులు కూడా అభిప్రాయపడుతున్నారు.



సిద్ధూ జొన్నలగడ్డ కొత్త సినిమా ప్రారంభం.. నిర్మాతగా సుకుమార్!



టాలీవుడ్ యంగ్ హీరో సిద్ధూ జొన్నలగడ్డ మరో ఆసక్తికరమైన ప్రాజెక్టుతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. #Siddhu10 అనే వర్కింగ్ టైటిల్ తో తెరకెక్కనున్న ఈ కొత్త సినిమా బుధవారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ తొలి షాట్‌కు క్లాప్ కొట్టి సినిమాను లాంఛనంగా ప్రారంభించారు. ఈ నెల చివర్లో రెగ్యులర్ షూటింగ్ మొదలుకానుంది. తొలుత ఓ పాటను చిత్రీకరించనున్నారు.
మోహన్ బి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని స్టార్ డైరెక్టర్ సుకుమార్ నిర్మిస్తున్నాడు. ఆయనతో పాటు ప్రముఖ నిర్మాతలు బన్నీ వాసు, అన్మోల్ శర్మ, అశోక్ బండిరెడ్డి సంయుక్తంగా నిర్మాణ బాధ్యతలు చేపట్టారు. రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న ఈ సినిమాలో సిద్ధూ జొన్నలగడ్డ సరసన నయన్ సారిక కథానాయికగా నటించనుంది. మూడు జాతీయ అవార్డులు అందుకున్న సంగీత దర్శకుడు జి.వి. ప్రకాశ్ కుమార్ బాణీలు సమకూర్చనున్నాడు.సినిమా ప్రారంభోత్సవానికి సంబంధించిన ఫొటోలను సుకుమార్ సోషల్ మీడియాలో పంచుకున్నాడు. దేవుడి ఆశీస్సులతో, ఎంతో ఉత్సాహంగా #Siddhu10 ప్రయాణం మొదలైందని పేర్కొన్నాడు. త్వరలోనే ఓ అందమైన ప్రేమకథను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని తెలిపాడు.
మరోవైపు దర్శకుడు మోహన్ కూడా సినిమా ప్రారంభానికి ముందు భావోద్వేగభరితమైన పోస్టు పెట్టాడు. ఓ కథకుడి కల వెండితెరపై సాకారమయ్యే దిశగా తొలి అడుగు పడిందని, ప్రేమలోని మాధుర్యాన్ని ఆవిష్కరించే అందమైన కలయికగా ఈ సినిమా నిలుస్తుందని పేర్కొన్నాడు. చిత్రంలోని మిగతా నటీనటులు, సాంకేతిక బృందం వివరాలను త్వరలో వెల్లడించనున్నారు.

'ఇట్లు అర్జున' చిత్రానికి సెన్సార్ పూర్తి.. విడుదలకు సిద్ధం



హీరో అనీష్, కథానాయిక అనశ్వర రాజన్ జంటగా నటించిన తాజా రొమాంటిక్ అండ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఇట్లు అర్జున'. మహేశ్ ఉప్పాల దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రానికి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ నుంచి క్లియరెన్స్ లభించింది. సెన్సార్ బోర్డు ఈ చిత్రానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా 'యూ/ఏ' సర్టిఫికెట్ జారీ చేసింది. ఈ విషయాన్ని చిత్ర నిర్మాణ సంస్థ 'వాట్ నెక్స్ట్ ఎంటర్‌టైన్‌మెంట్స్' సోషల్ మీడియా వేదికగా అధికారికంగా వెల్లడించింది.నిజానికి ఈ చిత్రం అక్టోబర్ 30నే ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉండగా, అనివార్య కారణాల వల్ల విడుదల వాయిదా పడింది. ప్రస్తుతం సెన్సార్ సహా అన్ని కార్యక్రమాలు పూర్తి కావడంతో, ఈ చిత్రాన్ని నవంబర్ 13న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ స్పష్టం చేశారు.ఈ సినిమాకు టాలీవుడ్‌లో మంచి క్రేజ్ ఉండటానికి ప్రధాన కారణం దీని నిర్మాణ భాగస్వామ్యం. ప్రముఖ దర్శకుడు వెంకీ కుడుముల 'వాట్ నెక్స్ట్ ఎంటర్‌టైన్‌మెంట్స్' బ్యానర్‌పై ఈ చిత్రాన్ని స్వయంగా నిర్మించగా, స్టార్ హీరో అక్కినేని నాగార్జున ఈ సినిమాను సమర్పిస్తున్నారు. ఈ చిత్రంతో అనీష్ హీరోగా వెండితెరకు పరిచయమవుతుండగా, మహేశ్ ఉప్పాల దర్శకుడిగా తన ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నారు.ఇటీవల విడుదలైన ఈ చిత్ర ట్రైలర్ ప్రేక్షకులలో ఆసక్తిని రేకెత్తించింది. కథ ప్రకారం.. కథానాయకుడు అర్జున్ (అనీష్) మాట్లాడలేని దివ్యాంగుడైనప్పటికీ, చోరీలలో ఎంతో నేర్పరి. నగరంలో జరిగిన ఓ పెద్ద దొంగతనం కేసులో పోలీసులు అతడి కోసం గాలిస్తుంటారు. మరోవైపు, చదువే లోకంగా భావించే క్రమశిక్షణ గల అమ్మాయి కీర్తి (అనశ్వర రాజన్)తో అర్జున్ ప్రేమలో పడతాడు. అర్జున్ మంచివాడనే నమ్మకంతో కీర్తి కూడా అతడిని ఇష్టపడుతుంది. అయితే ఊహించని రీతిలో సుమారు రూ. 1000 కోట్లకు సంబంధించిన ఓ పెన్ డ్రైవ్ వ్యవహారంలో ఒక ప్రమాదకరమైన ముఠా అర్జున్, కీర్తిల వెంటపడుతుంది. అటు పోలీసులు, ఇటు నేర ముఠా ఇద్దరూ వీరిని వెంటాడే క్రమంలో ఏం జరిగింది అనే ఉత్కంఠభరిత కథనంతో సినిమా రూపొందినట్లు ట్రైలర్ ద్వారా తెలుస్తోంది.
ఈ సినిమాకు ఉన్నత స్థాయి సాంకేతిక నిపుణులు పనిచేశారు. సౌత్ టాప్ మ్యూజిక్ డైరెక్టర్ తమన్ ఈ చిత్రానికి స్వరాలు సమకూర్చారు. రాజా మహాదేవ్ సినిమాటోగ్రఫీ అందించగా, రామ్ కుమార్ ఎ ప్రొడక్షన్ డిజైనర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. కోటి కె ఎడిటింగ్ చేయగా, దిలీప్ సుబ్బరాయన్ యాక్షన్ సన్నివేశాలను కొరియోగ్రఫీ చేశారు. నవంబర్ 13న రానున్న ఈ చిత్రం ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుంటుందో వేచి చూడాలి.

Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com